www.visalaandhra.com
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
పేజీలు : 12+టాబ్లాయిడ్ +ఆదివారం అనుబంధం
వెల: రూ.4.00

Sunday Special

SUNDAY
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
సంపుటి : 66, సంచిక : 272

ఆదివారం 25-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ

మాటల తూటాలు

■ చంద్రబాబుకు అమిత్‌షా లేటుగా ఘాటు లేఖ ■ అసెంబ్లీ సాక్షిగా తీవ్రంగా స్పందించిన సీఎం






రాజ్యాంగాన్ని గౌరవిస్తారో.. చరిత్రహీను లవుతారో... బీజేపీ వాళ్లు తేల్చుకోవాలి.

- రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి



హోదా కావాలని టీడీపీ వాళ్లు గట్టిగా అడగరు. కేంద్రంలో ఉన్న బీజేపీకి అసలా ఉద్దేశమే లేదు.

- పవన్ కల్యాణ్, జనసేన అధినేత



నాటి మిత్రపార్టీల అధినేతల మధ్య మొట్టమొదటిసారిగా మాటల తూటాలు పేలాయి. ఏపీకి అన్నీ ఇచ్చామని, చెయ్యవలసినదంతా చేశామని, రాజకీయ ప్రయోజనాల కోసమే బంధం తెంచుకున్నారని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా లేటుగా రాసిన లేఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఘాటు సమాధానమిచ్చారు. లేఖంతా తప్పుల తడకని.. రాష్ట్రానికి ఏం చేశారో స్పష్టంగా చెప్పాలని సవాలు విసిరారు.

3 లో



మత్తు..చిత్తు

విజృంభిస్తున్న గంజాయి అలవాటు

- దమ్ము లేకుంటే పిచ్చోళ్లుగా మారుతున్న యువత
- బానిసల్లో సగం మంది విద్యార్థులే
- ఛిద్రమవుతున్న యువత భవిత

7 లో

మాదకద్రవ్యాలలో అత్యంత ప్రమాదకరమైనది గంజాయి. గంజాయి దమ్ము లేకుంటే యువతలో కొందరు పిచ్చి వాళ్లయిపోతున్నారు. దానికోసం తహతహలాడి పోతున్నారు. అది దొరక్కపోతే నిద్రమాత్రలు, ఇంజక్షన్లను ఆశ్రయిస్తున్నారు. యువకులు, విద్యార్థులు, వృత్తి నిపుణులు ఈ మత్తుకు చిత్తవుతున్నారు. జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు.



మంచి నిద్రతో అనారోగ్యం మటుమాయం

6 నుంచి 8 గంటల నిద్ర తప్పనిసరి

- వృద్ధులు, పిల్లలకు 10 గంటలు కావాల్సిందే
- తక్కువ నిద్రతో మెదడు మందగమనం
- ఊబకాయానికి ఇదో కారణం

7 లో

నిద్ర మన శరీరానికి అత్యంత అవసరం. ప్రతి రోజూ మనం కచ్చితంగా 6 నుంచి 8 గంటల వరకు నిద్రపోవాలి. వృద్ధులు, పిల్లలు అయితే 10 గంటలకు పైగానే నిద్ర పోవాల్సి ఉంటుంది. నిద్ర వల్ల శరీరం రీచార్జ్ అవడమే కాదు, పలు రకాల అనారోగ్య సమస్యలు పోతాయి. మనం నిద్రపోయే క్రమంలో శరీరం తనకు తానే పలు మరమ్మతులు కూడా చేసుకుంటుంది.

నీటికి మనిషి చేటు



ప్రపంచమంతటా దాహం కేకలు

- నీటికోసం కిలోమీటర్లు నడవాల్సిందే..
- 2025 నాటికి దొరికేది చుక్కలే...

7 లో

ఆర్టీసీ ప్రయాణీకుల సౌకర్యార్థం

సెస్ నిధులు ఖర్చు పెట్టండి

మండలిలో ఎమ్మెల్సీ కత్తి డిమాండు



విశాలాంధ్ర-అమరావతి : ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణీకుల నుంచి వసూలు చేసే ఒక శాతం సెస్‌ను ప్రయాణీకుల సౌకర్యార్థం ఖర్చు పెట్టాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చైర్మన్ ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన శనివారం జరిగిన శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్టీసీ స్వాధీనంపై జరిగిన చర్చలో కత్తి మాట్లాడారు. రూ.8,075 కోట్ల నష్టంతో నడుస్తున్న ఆర్టీసీని ఆదుకోవాలని నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరుతూ ఒక శాతం సెస్ క్రింద రూ.60 కోట్లు వస్తుందని, 60 కోట్ల నిధులను ప్రయాణీకుల సౌకర్యార్థం ఖర్చు చేయాలని కోరారు. ఇదే అంశంపై యండపల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నష్టాలతో నడుస్తున్న ఆర్టీసీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే బాగుంటుందని, అలా కాకుంటే నష్టాలను తగ్గించుకునేందుకు ప్రైవేటు బస్సులు, ఆటోలను నియంత్రించాలని సూచించారు. తిప్పేస్వామి మాట్లాడుతూ అంతరాష్ట్ర సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. రాము సూర్యారావు, బొడ్డు నాగేశ్వరరావులు మాట్లాడుతూ బస్ షెల్టర్‌లను అధునికీకరించాలని విజ్ఞప్తి చేశారు. సభ్యుల ప్రశ్నలకు రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ ఆర్టీసీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోదని, భారీ నష్టాలతో నడుస్తున్న ఆర్టీసీని ఆదుకునేందుకు గత ఏడాది రూ.490 కోట్లు ఇచ్చామని, ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించటంతో పాటు పల్లె వెలుగుల బస్సు కొనుగోళ్లకు రూ.200 కోట్లు మంజూరు చేశామన్నారు. నష్టాలను రూ.8 కోట్ల నుంచి 3 కోట్లకు తగ్గించామని, వచ్చే ఏడాది నుంచి ఆర్టీసీని లాభాల బాటలో

- మిగతా 2 లో

పోరు ఉధృతం

● ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర-అమరావతి : ఈ వారంలో పార్లమెంటుకు ఐదు రోజులు సెలవులు. ఇంకా రెండు రోజులే సభ జరుగుతుంది. మన పోరాటం మరింత ఉధృతం చేయాలి. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలి. ప్రజల హక్కులు పరిరక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీ నేతలకు సూచించారు. శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ వ్యూహ కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. సభ లేనప్పుడు ఎక్కడికక్కడ ప్రజల్లోకి వెళ్లి రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి చెప్పాలి. కేంద్రాన్ని మనం ఏం అడుగుతున్నాం. వాళ్లు ఎందుకు ఇవ్వడం లేదు. మిగిలిన రాష్ట్రాలకు ఎలా ఇస్తున్నారు అనే దానిపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. ఒకవైపు మనరాష్ట్రంలో ఆందోళనలు జరుగుతుంటే మరోవైపు ఈశాన్య రాష్ట్రాలకు రూ.3వేల కోట్లు ఇచ్చారు. రాష్ట్రంలో ఒక పరిశ్రమ పెడితే జీఎస్‌టీ, ఐటీ ద్వారా భారీగా ఆదాయం కేంద్రమే పొందుతోందన్నారు. భూమి, నీళ్లు, కరెంటు ఇచ్చేది రాష్ట్ర ప్రభుత్వం, కానీ ఆదాయంలో అధిక భాగం పొందేది కేంద్రం. ఈ పరిస్థితులు మారాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కియా, హీరో

- మిగతా 2 లో

చేపలు కావవి.. తిమింగలాలు

ఐడీబీఐలో రూ.539 కోట్ల భారీ స్కామ్

- ఆంధ్ర, తెలంగాణలలో చేపల పెంపకం పేరుతో రుణాలు నొక్కేసిన వైనం
- బ్యాంకు అధికారులు ముగ్గురితోసహా 41 మంది పాత్ర
- రెండు వేర్వేరు కేసులు నమోదు చేసిన సీబీఐ



న్యూఢిల్లీ : చేపలు కావవి.. తిమింగళాలు. ఆక్వా సాగు పేరుతో అడ్డంగా కోట్ల రూపాయల రుణాలను నొక్కేశారు. ఇందుకు బ్యాంకు అధికారులూ సహకరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే బ్యాంకింగ్ రంగంలో కుంభకోణాలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)తో మొదలైన స్కామ్‌లు వరుస కట్టాయి. కొన్ని బ్యాంకులకు చెందిన అధికారులు ఆర్థిక నేరగాళ్లకు అవకాశాలు అందిపుచ్చినట్లు స్పష్టమవుతోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కేంద్రంగా కార్పొరేట్ బ్యాంకు ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ)లో భారీ కుంభకోణం బట్టబయలయ్యింది. రూ.539 కోట్ల మొత్తానికి ఐడీబీఐ బ్యాంకును మోసం చేసినట్లు వెల్లడయ్యింది. ఇందుకు సంబంధించి బ్యాంకు అధికారులు ముగ్గురితో సహా 41 మందిపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) రెండు వేర్వేరు కేసులు నమోదు చేసింది. చేపల పెంపకానికి రుణాల మంజూరులో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఐడీబీఐ శాఖల్లో పెద్ద ఎత్తున జరిగిన కుంభకోణానికి సంబంధించి ఈ కేసులు నమోదయ్యాయి. మొదటి కేసులో 445.32 కోట్ల మొత్తానికి బ్యాంకును మోసం చేసినందుకు ఐడీబీఐ జనరల్ మేనేజర్ భట్టు రామారావుతో సహా మాజీ చీఫ్ జనరల్ మేనేజర్

- మిగతా 2 లో

www.visalaandhra.com
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
పేజీలు : 12+8 +ఆదివారం అనుబంధం
వెల: రూ.4.00

Sunday Special

SUNDAY
విశాలాంధ్ర
స్థాపితం : 1952
అక్షరాక్షరం అభ్యుదయం
సంపుటి : 05, సంచిక : 125
ఆదివారం 25-03-2018
Simultaneously published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Karimnagar, Khammam
విశాఖపట్నం /కర్నూల్ /తిరుపతి ప్రచురణ



మత్తు..చిత్తు

విజృంభిస్తున్న గంజాయి అలవాటు

- దమ్ము లేకుంటే పిచ్చోళ్లుగా మారుతున్న యువత
- బానిసల్లో సగం మంది విద్యార్థులే
- ఛిద్రమవుతున్న యువత భవిత

7 లో

మాదకద్రవ్యాలలో అత్యంత ప్రమాదకరమైనది గంజాయి. గంజాయి దమ్ము లేకుంటే యువతలో కొందరు పిచ్చి వాళ్లయిపోతున్నారు. దానికోసం తహతహలాడి పోతున్నారు. అది దొరక్కపోతే నిద్రమాత్రలు, ఇంజక్షన్లను ఆశ్రయిస్తున్నారు. యువకులు, విద్యార్థులు, వృత్తి నిపుణులు ఈ మత్తుకు చిత్తవుతున్నారు. జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు.



మంచి నిద్రతో అనారోగ్యం మటుమాయం

6 నుంచి 8 గంటల నిద్ర తప్పనిసరి

- వృద్ధులు, పిల్లలకు 10 గంటలు కావాల్సిందే
- తక్కువ నిద్రతో మెదడు మందగమనం
- ఊబకాయానికి ఇదో కారణం

7 లో

నిద్ర మన శరీరానికి అత్యంత అవసరం. ప్రతి రోజూ మనం కచ్చితంగా 6 నుంచి 8 గంటల వరకు నిద్రపోవాలి. వృద్ధులు, పిల్లలు అయితే 10 గంటలకు పైగానే నిద్ర పోవాల్సి ఉంటుంది. నిద్ర వల్ల శరీరం రీచార్జ్ అవడమే కాదు, పలు రకాల అనారోగ్య సమస్యలు పోతాయి. మనం నిద్రపోయే క్రమంలో శరీరం తనకు తానే పలు మరమ్మతులు కూడా చేసుకుంటుంది.

నీటికి మనిషి చేటు



ప్రపంచమంతటా దాహం కేకలు

- నీటికోసం కిలోమీటర్లు నడవాల్సిందే..
- 2025 నాటికి దొరికేది చుక్కలే...

7 లో

మాటల తూటాలు

- చంద్రబాబుకు అమిత్‌షా లేటుగా ఘాటు లేఖ
- అసెంబ్లీ సాక్షిగా తీవ్రంగా స్పందించిన సీఎం






రాజ్యాంగాన్ని గౌరవిస్తారో.. చరిత్రహీను లవుతారో... బీజేపీ వాళ్లు తేల్చుకోవాలి.
- రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి



హోదా కావాలని టీడీపీ వాళ్లు గట్టిగా అడగరు. కేంద్రంలో ఉన్న బీజేపీకి అసలా ఉద్దేశమే లేదు.
- పవన్ కల్యాణ్, జనసేన అధినేత



నాటి మిత్రపార్టీల అధినేతల మధ్య మొట్టమొదటిసారిగా మాటల తూటాలు పేలాయి. ఏపీకి అన్నీ ఇచ్చామని, చెయ్యవలసినదంతా చేశామని, రాజకీయ ప్రయోజనాల కోసమే బంధం తెంచుకున్నారని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా లేటుగా రాసిన లేఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఘాటు సమాధానమిచ్చారు. లేఖంతా తప్పుల తడకని.. రాష్ట్రానికి ఏం చేశారో స్పష్టంగా చెప్పాలని సవాలు విసిరారు.

3 లో

మాతృభాషకు పట్టం

- తెలుగుభాష తప్పనిసరి బిల్లుకు ఆమోదం
- తమిళనాడు, పంజాబ్‌లలో అధ్యయనం : కడియం

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్: తెలుగు భాషకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. అమ్మ ఒడి పలుకులు బడి పలుకులు కావాలనే లక్ష్యంతోనే తెలుగు తప్పనిసరి అమలు బిల్లును తీసుకొచ్చామన్నారు. తెలుగు భాషను రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేసే బిల్లును శాసనసభ శనివారం ఆమోదించింది. రానున్న విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ఇతర భాష పాఠశాలల్లోనూ తెలుగు తప్పనిసరిగా అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెడుతున్నామని కడియం శ్రీహరి తెలిపారు. తెలుగు భాష గొప్పతనాన్ని నిలబెట్టేందుకు, తెలుగు భాషకు పూర్వ వైభవం తెచ్చేందుకు, తెలుగుకు పట్టం కట్టేందుకు ఈ బిల్లు తీసుకొచ్చామన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు తెలుగుతో పాటు ఇంగ్లీష్ నేర్చుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. కమ్మనైన తెలుగు భాషను కాపాడుకునేందుకే ఈ నిర్ణయమని మంత్రి తెలిపారు. ఈ విద్యా సంవ త్సరం నుంచే ఈ విధానం అమల్లోకి వస్తుంద న్నారు. తమ ప్రభుత్వం తెలుగు భాష అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. తెలుగు అమలు కోసం తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ సిధారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ తమిళనాడు, పంజాబ్‌లలో పర్యటించి, అక్కడ మాతృభాషను అమలు చేస్తున్న తీరును అధ్య యనం చేసిందన్నారు. తమిళ నాడు మోడల్‌లో తెలుగు భాషను అమలు చేయాలని ఈ బిల్ తెచ్చామన్నారు. తొలిద శలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, రాష్ట్ర, కేంద్ర, ఇతర

- మిగతా 2 లో

పోరు ఉధృతం

- ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర–అమరావతి : ఈ వారంలో పార్లమెంటుకు ఐదు రోజులు సెలవులు. ఇంకా రెండు రోజులే సభ జరుగుతుంది. మన పోరాటం మరింత ఉధృతం చేయాలి. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలి. ప్రజల హక్కులు పరిరక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీ నేతలకు సూచించారు. శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ వ్యూహ కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. సభ లేనప్పుడు ఎక్కడికక్కడ ప్రజల్లోకి వెళ్లి రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి చెప్పాలి. కేంద్రాన్ని మనం ఏం అడుగుతున్నాం. వాళ్లు ఎందుకు ఇవ్వడం లేదు. మిగిలిన రాష్ట్రాలకు ఎలా ఇస్తున్నారు అనే దానిపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. ఒకవైపు మనరాష్ట్రంలో ఆందోళనలు జరుగుతుంటే మరోవైపు ఈశాన్య రాష్ట్రాలకు రూ.3వేల కోట్లు ఇచ్చారు. రాష్ట్రంలో ఒక పరిశ్రమ పెడితే జీఎస్టీ, ఐటీ ద్వారా భారీగా ఆదాయం కేంద్రమే పొందుతోందన్నారు. భూమి, నీళ్లు, కరెంటు ఇచ్చేది రాష్ట్ర ప్రభుత్వం, కానీ ఆదాయంలో అధిక భాగం పొందేది కేంద్రం. ఈ పరిస్థితులు మారాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కియా, హీరో మోటార్స్ కంపెనీలతో కేంద్రానికి ఎంత ఆదాయం వస్తుంది. దీనికి ప్రతిగా రాష్ట్రాలను కేంద్రం ఎందుకు ఆదుకోదని చంద్రబాబు ప్రశ్నించారు. నంద్యాల ఎన్నికలలో ప్రజల్లో 58 శాతం సంతృప్తి ఉంది. ఈ నెలలో 63 శాతం సంతృప్తి ప్రజల్లో నెలకొందన్నారు. కేంద్రం అన్యాయంపై ఆందోళనలు చేపట్టడం వల్ల 73 శాతం సంతృప్తి వచ్చిందని, త్వరలోనే 80 శాతానికి చేరుకుంటామని చెప్పారు. పీఎంవో చుట్టూ విజయసాయి ప్రదక్షిణల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సుజనా చౌదరిపై దుష్ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. మీలాగా మాకు లాలూచీ రాజకీయాలు తెలియవని, కేసుల మాఫీ అవసరం తమకు లేదన్నారు.

అనంతరం దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల భేటీపై ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. కేరళ ఆర్థిక మంత్రి ఫోన్ చేశారని చెప్పారు. పథకాలకు కేంద్ర నిధుల మంజూరులో 2011 జనాభా ప్రామాణికతపై తీవ్ర వ్యతిరేకత ఉందని,

- మిగతా 2 లో

ఆర్టీసీ ప్రయాణీకుల సౌకర్యార్థం సెస్ నిధులు ఖర్చు పెట్టండి

మండలిలో ఎమ్మెల్సీ కత్తి డిమాండు



విశాలాంధ్ర–అమరావతి : ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణీకుల నుంచి వసూలు చేసే ఒక శాతం సెస్‌ను ప్రయాణీకుల సౌకర్యార్థం ఖర్చు పెట్టాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చైర్మన్ ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన శనివారం జరిగిన శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్టీసీ స్వాధీనంపై జరిగిన చర్చలో కత్తి మాట్లాడారు. రూ.8,075 కోట్ల నష్టంతో నడుస్తున్న ఆర్టీసీని ఆదుకోవాలని నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరుతూ ఒక శాతం సెస్ క్రింద రూ.60 కోట్లు వస్తుందని, 60 కోట్ల నిధులను ప్రయాణీకుల సౌకర్యార్థం ఖర్చు చేయాలని కోరారు. ఇదే అంశంపై యండపల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నష్టాలతో నడుస్తున్న ఆర్టీసీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే బాగుంటుందని, అలా కాకుంటే నష్టాలను తగ్గించుకునేందుకు ప్రైవేటు బస్సులు, ఆటోలను నియంత్రించాలని సూచించారు. తిప్పేస్వామి మాట్లాడుతూ అంతరాష్ట్ర సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. రాము సూర్యారావు, బొడ్డు నాగేశ్వరరావులు మాట్లాడుతూ బస్ షెల్టర్‌లను ఆధునీకీకరించాలని విజ్ఞప్తి చేశారు. సభ్యుల ప్రశ్నలకు రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ ఆర్టీసీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోదని, భారీ నష్టాలతో నడుస్తున్న ఆర్టీసీని ఆదుకునేందుకు గత ఏడాది రూ.490 కోట్లు ఇచ్చామని, ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించటంతో పాటు పల్లె వెలుగుల బస్సు కొనుగోళ్లకు రూ.200 కోట్లు మంజూరు చేశామన్నారు. నష్టాలను రూ.8 కోట్ల నుంచి 3 కోట్లకు తగ్గించామని, వచ్చే ఏడాది నుంచి ఆర్టీసీని లాభాల బాటలో

- మిగతా 2 లో

లాలూకు 14 ఏళ్ల జైలు

దాణా కుంభకోణం నాల్గవ కేసులో శిక్ష ఖరారు

9 లో

ఎన్నికల వేళ జేడీఎస్‌కు షాక్

నలుగురు ఎమ్మెల్యే రాజీనామా

9 లో

కార్తీకి ముందస్తు బెయిల్

ఏప్రిల్ 16వరకు అరెస్టు వద్దు : ఢిల్లీ హైకోర్టు

9 లో

చేపలు కావవి.. తిమింగలాలు

ఐడీబీఐలో రూ.539 కోట్ల భారీ స్కామ్

- ఆంధ్ర, తెలంగాణలలో చేపల పెంపకం పేరుతో రుణాలు నొక్కేసిన వైనం
- బ్యాంకు అధికారులు ముగ్గురితోసహా 41 మంది పాత్ర
- రెండు వేర్వేరు కేసులు నమోదు చేసిన సీబీఐ



న్యూఢిల్లీ : చేపలు కావవి.. తిమింగళాలు. ఆక్వా సాగు పేరుతో అడ్డంగా కోట్ల రూపాయల రుణాలను నొక్కేశారు. ఇందుకు బ్యాంకు అధికారులూ సహకరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే బ్యాంకింగ్ రంగంలో కుంభకోణాలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)తో మొదలైన స్కామ్‌లు వరుస కట్టాయి. కొన్ని బ్యాంకులకు చెందిన అధికారులు ఆర్థిక నేరగాళ్లకు అవకాశాలు అందిపుచ్చినట్లు స్పష్టమవుతోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కేంద్రంగా కార్పొరేట్ బ్యాంకు ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ)లో భారీ కుంభకోణం బట్టబయలయ్యింది. రూ.539 కోట్ల మొత్తానికి ఐడీబీఐ బ్యాంకును మోసం చేసినట్లు వెల్లడయ్యింది. ఇందుకు సంబంధించి బ్యాంకు అధికారులు ముగ్గురితో సహా 41 మందిపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) రెండు వేర్వేరు కేసులు నమోదు చేసింది. చేపల పెంపకానికి రుణాల మంజూరులో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఐడీబీఐ శాఖల్లో పెద్ద ఎత్తున జరిగిన కుంభకోణానికి సంబంధించి ఈ కేసులు నమోదయ్యాయి. మొదటి కేసులో 445.32 కోట్ల మొత్తానికి బ్యాంకును మోసం చేసినందుకు ఐడీబీఐ జనరల్ మేనేజర్ భట్టు రామారావుతో సహా మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్.దామోదరన్, 22 మంది అగ్రిగేటర్స్, బ్యాంకు ప్యానెల్ విలువదారులపై కేసు నమోదయ్యింది. భట్టు రామారావును సర్వీసు నుంచి తొలగించారు. నిందితులపై దుర్వినియోగం, ఫోర్జరీ, మోసం, నేరపూరిత కుట్ర ఆరోపణలను సీబీఐ నమోదు చేసింది. హైదరాబాద్‌లో ఐడీబీఐ అధికారి నుంచి ఒక ఫిర్యాదు అందిన తర్వాత ఈ మేరకు చర్యలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



వచ్చే వారంలో కొరియాల సమావేశం



సియోల్ : దక్షిణ కొరియాతో ఉన్నతస్థాయి చర్చలకు ఉత్తర కొరియా అంగీకారం తెలిపింది. అంతర్గత కొరియా సదస్సుపై చర్చించేందుకు ఇరు వర్గాలు వచ్చే వారంలో సమావేశం కానున్నాయి. ఉత్తరం, దక్షిణం నుంచి ముగ్గురు సభ్యులతో కూడిన ప్రతినిధి బృందం చర్చల్లో పాల్గొనుంది. ఏప్రిల్ చివరిలో జరగనున్న సదస్సుకు మార్గం సుగమం చేసే లక్ష్యంతో గురువారం సరిహద్దు గ్రామమైన పన్‌ముంజమ్‌లో ఉత్తర, దక్షిణ కొరియాల ప్రతినిధులు భేటీ కానున్నారు. దక్షిణ కొరియా త్రిసభ్య బృందానికి యునిఫికేషన్ మంత్రి చో మ్యాంగ్-గ్యాన్ నేతృత్వం వహిస్తారని మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కమిటీ ఫర్ పీస్‌ఫుల్ రీయూనిఫికేషన్ చైర్మన్ రీ సాన్-గ్వాన్ నేతృత్వంలోని త్రిసభ్య బృందాన్ని చర్చలకు పంపేందుకు ఉత్తర కొరియా అంగీకరించినట్లు ప్రకటన పేర్కొంది. ఈనెల 29న జరిగే చర్చల ద్వారా అంతర్గత కొరియాల సమావేశానికి తమ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపింది.

ఆస్ట్రేలియాలోని హమెలిన్ పెను విషాదం

తీరానికి కొట్టుకొచ్చిన 150 వేల్స్



పెర్త్ , ఆస్ట్రేలియా : వెస్టర్న్ ఆస్ట్రేలియాలోని హమెలిన్ సముద్ర తీరంలో పెను విషాదం చోటు చేసుకుంది. దాదాపు 150 వేల్స్ ఒడ్డుకు కొట్టుకువచ్చి ప్రాణాలు విడిచాయి. మృత్యువాత పడ్డ వేల్స్‌ను తినేందుకు షార్క్‌లు ఎగబడ్డాయి. ఈ ఘటనకు సంబంధించిన హృదయవిదారక దృశ్యాలను చిత్రీకరించిన స్థానికులు సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారాయి. నది సముద్రం కలిసే చోట నీటికి ఎదురొచ్చిన వేల్స్ గుంపు ఇలా సముద్ర తీరానికి వచ్చి తిరిగి వెళ్లలేక ప్రాణాలు కోల్పోయాయని భావిస్తున్నారు. ఈ ఘటనపై డెయిలీ మెయిల్‌తో మాట్లాడిన స్థానిక మహిళ.. ఒడ్డుకు కొట్టుకొచ్చిన వందలాది వేల్స్‌లో తాను చూస్తుండగా మరణించాయని చెప్పారు. మరికొన్ని నీటిలోకి తిరిగి వెళ్లడానికి చేసిన ప్రయత్నాన్ని చూసి కంటతడి ఆగలేదని వెల్లడించారు. వాటికి సాయం చేయలేని తన నిస్సహాయతను ఆమె నిందించుకున్నారు. మరణించిన వేల్స్ మాంసం కోసం షార్క్‌లు తీరానికి వచ్చాయని చెప్పారు.





ఆఫ్ఘన్‌లో బాంబు పేలుడు

15 మంది మృతి, 50 మందికి గాయాలు

నూతన సంవత్సర వేడుకల్లో విషాదం

లష్కర్‌ఘా (అఫ్ఘనిస్థాన్) : దక్షిణ అఫ్ఘనిస్థాన్ నూతన సంవత్సరం వేడుకల్లో విషాదం చోటు చేసుకొంది. శుక్రవారం హెల్మాండ్‌లోని స్టేడియంలో బాంబు పేలుడు సంభవించడంతో 14 మంది మరణించారు. 50మంది గాయపడ్డారు. శనివారానికి మృతుల సంఖ్య 15కు చేరుకొన్నట్లు అధికారులు వెల్లడించారు. రెజిలింగ్ మ్యాచ్ పూర్తి అయిన తర్వాత స్టేడియం నుంచి ప్రజలు వెళ్లిపోతున్న సమయంలో పేలుడు సంభవించిందని అఫ్ఘన్ అధికార ప్రతినిధి ఒమర్ జ్వాక్ తెలిపారు. ఘాజీ మహమ్మద్ అయూబ్ స్టేడియంలో కారు బాంబు పేలిందని, దీనిని ఆత్మాహుతి దాడిగా పరిగణిస్తున్నామని చెప్పారు. ఈ దాడిలో చనిపోయిన వారిలో చిన్నారులు కూడా ఉన్నారన్నారు. అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. దేశ సంప్రదాయ, సాంస్కృతిక వేడుకను అఫ్ఘనిస్థాన్ శత్రువులు అడ్డుకోలేరని ఉద్ఘాటించారు. అఫ్ఘనిస్థాన్‌లోని యునైటెడ్ నేషన్స్ అసిస్టెంటెన్స్ మిషన్ (యూఎన్ఏఎంఏ) కూడా ట్విట్టర్ ద్వారా ఈ ఘటనను ధ్రువీకరించింది. హెల్మాండ్‌లోని స్టేడియం వద్ద నుంచి వస్తున్న రిపోర్డులు కలచివేసేవిగా ఉన్నాయని పేర్కొంది. ప్రజలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం అంతర్జాతీయ మానవ చట్టాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమేనని, ఇది యుద్ధనేరాలకు దారితీయొచ్చునని ట్వీట్ చేసింది. ఈ దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు. కొన్ని నెలలుగా అఫ్ఘనిస్థాన్ ఆత్మాహుతి దాడులతో దద్దరిల్లుతోందిన రాజధాని నగరం కాబూల్‌లో జరిగిన దాడుల్లో 150మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

సామాజిక ఐక్యతకు పెరూ నూతన అధ్యక్షుడి పిలుపు



లిమా : పెరూ నూతన అధ్యక్షుడిగా మార్టిన్ విజ్‌కరా బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం వరకు పెరూకు తొలి ఉపాధ్యక్షుడిగా, కెనడాకు దౌత్యాధికారిగా వ్యవహరించిన మార్టిన్ శనివారం దేశ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక ఐక్యతకు, అవినీతి, అక్రమాలపై ఐక్యపోరుకు పిలుపునిచ్చారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో అధ్యక్షుడు గద్దె దిగే పరిస్థితి రావడంతో దేశం సంక్షోభంలోకి నెట్టబడింది. రేండేళ్ల పాటు అధ్యక్షుడిగా ఉన్న పెడ్రో పాబ్లో కుసీన్కీ బుధవారం రాజీనామా చేశారు. ఇది అవిశ్వాస ఓటింగ్‌కు కేవలం ఒక రోజు ముందు జరిగింది. మార్టిన్ మాట్లాడుతూ, అవినీతిపై ఉక్కుపాదం మోపుతానని ఉద్ఘాటించారు. గత మంత్రివర్గం కొనసాగబోదన్న ఆయన మాటలను మెజారిటీ ప్రజలు స్వాగతించారు. అస్థిరత, వ్యవస్థ సంక్షోభంలో ఉన్న సమయంలో తాను దేశ బాధ్యతలు స్వీకరిస్తున్నానన్నారు. పూర్వ అధ్యక్షుడు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర నేతలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వానికి మార్గదర్శకాలను జారీచేశారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితి నుంచి పెరూను బయటకు తీసుకొచ్చేందుకు శాయాశక్తులా కలిసికట్టుగా ప్రయత్నిద్దామని పిలుపునిచ్చారు. ఆర్థిక వ్యవస్థ గురించి ప్రస్తావిస్తూ మంచిని ప్రోత్సహిస్తామని, కొన్నిసందర్భాల్లో మార్పులు అనివార్యమని మార్టిన్ అన్నారు. ఆరోగ్యం, విద్య, ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తానని చెప్పారు.



హీరో కల్నల్

మహిళను విడిపించేందుకు ఉగ్రవాది చేతిలోకి బందీగా వెళ్లి అమరుడయ్యాడు

ట్రెబెస్ : ఉగ్రవాది చెర నుంచి బందీలుగా ఉన్న వారిని కాపాడేందుకు తన ప్రాణాలను సైతం లెక్కచేయలేదు ఫ్రాన్స్‌కు చెందిన అధికారి లెఫ్టినెంట్ కల్నల్ అర్నాడ్ బెల్ట్రేమ్. ఉగ్రవాది ఓ మహిళను బందీగా చేసుకునేందుకు ప్రయత్నించగా.. ఆమెకు బదులుగా బెల్ట్రేమ్ ఉగ్రవాదికి బందీగా వెళ్లి ప్రాణాలను కోల్పోయారు. ఆయన చూపిన అసాధారణ ప్రతిభకు అందరూ సెల్యూట్ చేస్తున్నారు. ప్రజలను కాపాడేందుకు తన ప్రాణాలనే పణంగా పెట్టాడు.. ఆయన నిజంగా హీరో అంటూ అభినందిస్తున్నారు. శుక్రవారం ఫ్రాన్స్‌లోని ఓ సూపర్‌మార్కెట్‌కి సాయుధుడు చొరబడి పోలీస్‌పై కాల్పులు జరిపి అక్కడి వారిని బందీలుగా చేసుకున్న విషయం తెలిసిందే. వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాది కాల్పులు జరిపే సమయంలో అక్కడే ఉన్న ఓ మహిళను బందీగా చేసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో అక్కడ ఉన్న కల్నల్ బెల్ట్రేమ్ తన వద్ద ఉన్న ఆయుధాన్ని కిందపడేసి మహిళకు బదులుగా ఆయనే ఉగ్రవాదికి బందీగా వెళ్లాడు. అంతేకాదు.. సూపర్‌మార్కెట్ లోపల ఏం జరుగుతుందనేది బయట ఉన్న పోలీసులకు తెలిసే విధంగా కల్నల్ తన ఫోన్‌ను ఆన్ చేసి ఘటనా స్థలంలో వదిలిపెట్టాడు. ఆయన ఫోన్ ద్వారానే పోలీసులు సూపర్‌మార్కెట్‌లో ఏం జరుగుతుందనేది తెలుసుకోగలిగారు. బందీగా వెళ్లిన బెల్ట్రేమ్‌పై ఉగ్రవాది కాల్పులు జరిపాడు. దీంతో ఆయనకు తీవ్రంగా బుల్లెట్ గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య నాలుగుకు చేరింది. కల్నల్ బెల్ట్రేమ్ సాహసాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, అంతర్గతశాఖ మంత్రి కొల్లాంబ్ కొనియాడారు. ఆయన దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. ఆయన ధైర్యసాహసాలను దేశం ఎన్నటికీ మరిచిపోదని పేర్కొన్నారు. కల్నల్ మృతికి మేక్రాన్ సంతాపం తెలియజేస్తూ నివాళులర్పించారు

చేపలు కావవి.. తిమింగలాలు

(మొదటిపేజీ తరువాయి)

ఆర్.దామోదరన్, 22 మంది అగ్రిగేటర్స్, బ్యాంకు ప్యానెల్ విలువదారులపై కేసు నమోదయ్యింది. భట్టు రామారావును సర్వీసు నుంచి తొలగించారు. నిందితులపై దుర్వినియోగం, ఫోర్జరీ, మోసం, నేరపూరిత కుట్ర ఆరోపణలను సీబీఐ నమోదు చేసింది. హైదరాబాద్‌లో ఐడీబీఐ అధికారి నుంచి ఒక ఫిర్యాదు అందిన తర్వాత ఈ మేరకు చర్యలు చేపట్టారు. వేర్వేరు శాఖల నుంచి 220 రుణ ఖాతాల ద్వారా కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ), చేపల పెంపకానికి రూ.198.28 కోట్ల మేర రుణాన్ని పొందారు. బ్యాంకు ప్యానెల్ విలువదారులతోపాటు 22 మంది అగ్రిగేటర్లతో కూడిన 220 మంది రుణ గ్రహీతలు ఐడీబీఐ బషీర్‌బాగ్(హైదరాబాద్), సిరిపురం(విశాఖపట్టణం) శాఖల అధికారులతో కలిసి కుట్ర పన్నినట్లు ఆరోపణలు వచ్చాయి. అధిక విలువ కలిగిన అనుషంగిక ఆస్తి నకిలీ డాక్యుమెంట్ల ఆధారంగా ఈ రుణాలు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తరువాత నిరర్థక ఆస్తి(ఎన్‌పీఏ)గా మారింది. 2017 సెప్టెంబరు నాటికి అసాధారణ మొత్తం రూ.445.32 కోట్లుగా ఉంది. రుణగ్రహీతలు పేర్కొన్నట్లుగా తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలలో చేపల పెంపకం లేదా చేపలకు సంబంధించి ఇతర ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదని గుర్తించారు. మంజూరు చేసిన రుణాలను దుర్వినియోగం చేశారు. బ్యాంకు ప్యానెల్ విలువదారులు బి.కె.సాహూ, ఆకార్ కన్సల్టింగ్ ఇంజినీర్స్, ఆర్.ఎ.శర్మ, ఎం.వి.శ్రీనివాసులు, శుభ సిండికేట్, శ్రీనివాసరావ్, సోమశేఖర రావులపై కూడా కేసులు నమోదు చేశారు. ఇక రెండవ కేసుకు సంబంధించి రూ.93.73 కోట్ల మొత్తానికి బ్యాంకును మోసం చేసిన ఐడీబీఐ అధికారి ఒకరు, మరో తొమ్మిది మందిపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఐడీబీఐ గుంటూరు శాఖలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్న చంద్రశేఖర్ హరీష్ చెన్నప్పగారి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. 2010 నుంచి 2012 వరకు 142 చేపల పెంపకం రుణాల మంజూరు ప్రక్రియను నిర్వహించారు. ఈయనను కూడా ఐడీబీఐ సర్వీసు నుంచి తొలగించారు. నకిలీ పత్రాల ద్వారా రుణాలను పొందినట్లు దర్యాప్తులో వెల్లడయ్యింది. కాగా బ్యాంకు ప్యానెల్ విలువదారు, బ్యాంకు ప్యానెల్ న్యాయవాది, అగ్రిగేటర్లు, వ్యక్తిగత రుణ గ్రహీతలపై ఆరోపణలు నమోదు చేయబడ్డాయి.

పోరు ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

మోటార్స్ కంపెనీలతో కేంద్రానికి ఎంత ఆదాయం వస్తుంది. దీనికి ప్రతిగా రాష్ట్రాలను కేంద్రం ఎందుకు ఆదుకోదని చంద్రబాబు ప్రశ్నించారు. నంద్యాల ఎన్నికలలో ప్రజల్లో 58 శాతం సంతృప్తి ఉంది. ఈ నెలలో 63 శాతం సంతృప్తి ప్రజల్లో నెలకొందన్నారు. కేంద్రం అన్యాయంపై ఆందోళనలు చేపట్టడం వల్ల 73 శాతం సంతృప్తి వచ్చిందని, త్వరలోనే 80 శాతానికి చేరుకుంటామని చెప్పారు. పీఎంవో చుట్టూ విజయసాయి ప్రదక్షిణల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సుజనా చౌదరిపై దుష్ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. మీలాగా మాకు లాలూచీ రాజకీయాలు తెలియవని, కేసుల మాఫీ అవసరం తమకు లేదన్నారు.

అనంతరం దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల భేటీపై ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. కేరళ ఆర్థిక మంత్రి ఫోన్ చేశారని చెప్పారు. పథకాలకు కేంద్ర నిధుల మంజూరులో 2011 జనాభా ప్రామాణికతపై తీవ్ర వ్యతిరేకత ఉందని, 1971 జనాభానే ప్రామాణికంగా తీసుకోవాలని గతంలోనే కోరిన విషయాన్ని యనమల గుర్తు చేశారు. 2011 జనాభాకు 10 శాతం వెయిటేజి ఇవ్వడం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని యనమల చెప్పారు. కుటుంబ నియంత్రణ పాటించినందుకు గతంలో ప్రోత్సాహకాలు ఉండేవని, అలాంటిది ఇప్పుడు జనాభా నియంత్రణ లేని రాష్ట్రాలకు అధిక నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. దక్షిణాది ఆర్థిక మంత్రుల భేటీకి వెళ్లేందుకు సీఎంను యనమల అనుమతి కోరగా అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు.

సెస్ నిధులు ఖర్చు పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

పయనింపచేస్తామన్నారు. ఇచ్ఛాపురం, పుంగనూరు తదితర పాఠశాలలతో పాటు 59 మున్సిపల్ పాఠశాలల్లో జీపీఎఫ్‌ను ఉపాధ్యాయుల ఖాతాల్లోకి జమ చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పురపాలక శాఖ మంత్రిని కోరారు. పురపాలక ఉపాధ్యాయుల భవిష్య నిధి గురించి ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2009 నుంచి పురపాలక సంఘాల్లో ఉపాధ్యాయుల ఖాతాల్లో భవిష్య నిధిని వారి జీతాల నుంచి చెల్లించినా ఇప్పటి వరకు సక్రమంగా ఖాతాలలో వేయలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతపురం కార్పొరేషన్‌లో టీచర్ల పీఎఫ్ బకాయి రూ.36 లక్షలను వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఉపాధ్యాయుల అంతర్ బదిలీల కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని కత్తి డిమాండు చేశారు. ఇదే అంశంపై గాదె శ్రీనివాసులునాయుడు, బాలసుబ్రహ్మణ్యం, యండపల్లిలు మాట్లాడుతూ ఆర్థిక శాఖ అభ్యంతరం లేదంటుంది కానీ పురపాలక శాఖ ఉపాధ్యాయుల ఖాతాలకు జమ చేయదు. ఉపాధ్యాయులకు చెందిన రూ.62 కోట్లు ఏ ఖాతాలో ఉన్నాయి. చీరాల, మార్కాపురం, గూడూరు, మున్సిపాలిటీల్లో ఉపాధ్యాయులు భవిష్యనిధి వ్యవహారంపై అయోమయానికి గురవుతున్నారని చెప్పారు. పై ప్రశ్నలకు పురపాలక శాఖ మంత్రి నారాయణ సమాధానమిస్తూ ఏప్రిల్ 1 నుంచి భవిష్య నిధిని ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే చీరాలకు చెందిన రూ.40 లక్షలు, అనంతపురం రూ.36 లక్షలు జమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

టీటీడీ 73 ఆలయాలను నవీకరించింది : మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్రంలో టీటీడీ ద్వారా శిథిలమైన దేవాలయాల పునర్నిర్మాణంపై ఎమ్మెల్సీ చలపతిరావు అడిగిన ప్రశ్నకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ రాష్ట్రంలో టీటీడీ ఇప్పటికే 73 ఆలయాలను నవీకరించిందని, 13 ఆలయాలు పురోగతిలో ఉన్నాయని, మరో 27 పరిశీలనలో ఉన్నాయని, రూ.7 కోట్లతో 36 వెంకటేశ్వరస్వామి దేవాలయాల నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. శమంతకమణి మాట్లాడుతూ సింగనమలలోని ఆత్మారాముడు ఆలయాన్ని పునర్మించాలని కోరగా పురావస్తు శాఖ, దేవదాయ శాఖ మధ్య చర్చలు నడుస్తున్నాయని, ఆ తర్వాత పనులు ప్రారంభమతాయని మంత్రి చెప్పారు.

విజయవాడ కార్పొరేషన్‌లో
ఆగస్టు తర్వాత గ్రామ పంచాయతీల విలీనం

విజయవాడ నగరపాలక సంస్థలో 51 గ్రామ పంచాయతీలను విలీనం చేసే ప్రతిపాదన ఉందని, ఆగస్టు తర్వాత విలీన ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం చెప్పారు. గోదావరి, పెన్నా అనుసంధానం పనులు త్వరలో ప్రారంభిస్తామని, లిఫ్టుల ద్వారా బొల్లాపల్లి రిజర్వాయర్‌కు నీటిని చేర్చి అక్కడి నుంచి నాగార్జునసాగర్ కుడికాల్వకు, వెలిగొండ ప్రాజెక్ట్‌కు కూడా గోదావరి నీరును అందించి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, కడప జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమమాహేశ్వరరావు సభ్యురాలు పోతుల సునీత అడిగన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాకినాడ, చెన్నై జల రవాణా పనులు ముత్యాల నుంచి ప్రారంభమయ్యాయని, అచ్చంపేట మధ్యలో ఓ బండరాయి బయటపడిందని, ఆ బండరాయిని తొలగించే పనులు నడుస్తున్నాయన్నారు. రెండవ దశలో విజయవాడ నుంచి రాజమండ్రి, మూడవ దశలో కొమ్మమూరు-బకింగ్‌హామ్ కెనాల్ పనులు జరుగుతాయని రాము సూర్యారావు, విఠలపు బాలసుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

స్కూల్ గేమ్స్‌కు రూ.10 కోట్లు కేటాయించాలి

పాఠశాలల్లో జోనల్‌స్థాయి క్రీడా పోటీలకు రూపాయి కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వటం లేదని, స్కూల్ గేమ్ ఫెడరేషన్‌కు రూ.10 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్సీ కత్తి ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. గోదావరి నదిని కాలుష్య కోరల నుంచి తప్పించాలని రాము సూర్యారావు కోరారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల వ్యక్తిగత సహాయకులకు వేతనాలు పెంచాలని విఠలపు బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వానికి విన్నవించారు.

జల వినియోగమే జాతి సౌభాగ్యం : ఎమ్మెల్సీ కత్తి


ప్రకృతిలో ప్రాణమున్న ప్రతి ప్రాణికి జలమే జీవనాధారం. అటువంటి నీటి ప్రాధాన్యత ఏమిటో తనకు బాగా తెలుసని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. మండలిలో శనివారం గ్రామీణ నీటి సరఫరాపై మాట్లాడుతూ మా కుటుంబ సభ్యులు మొత్తం ఆరు మంది. నాలుగు ఎకరాల పొలం ఉంది. దానిలో వేరుశనగ వేసి వచ్చిన ఆదాయంతో జీవించేవారం. కానీ గత 15 ఏళ్ల నుంచి వర్షాలు సక్రమంగా లేకపోవడంతో పంటలు సరిగా పండకు రెండు ఎకరాలు అమ్మాల్సిన పరిస్థితులు వచ్చాయని ఆవేదన చెందారు.

నేడు రాష్ట్రంలో రూ.22 వేల కోట్లతో అందరికీ తాగునీరు అందించే ప్రణాళికలు రూపొందించినందుకు మంత్రి లోకేష్‌కు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో 22,250 పంపుల ద్వారా నీటిని తీసుకొంటున్నారు. నీటి కాలుష్యం వల్లనే రకరకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి శుభ్రం చేయాలన్నారు. బోరులను క్లీన్ చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. వర్షపు నీటిని వాడుకునే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మన రాష్ట్రంలో వైద్యానికి ఎంత ఖర్చు పెడుతున్నారో నీటికీ అంతే ఖర్చు చేస్తున్నారన్నారు. కేరళ తరహాలో వేడి నీటిని హోటళ్లు, బస్సు స్టాండ్, రైల్వేస్టేషన్‌లో సరఫరా చేస్తున్నారు.

అలాగే ఇక్కడ కూడా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి పథకాల నిర్వహణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ ఇవ్వటం కూడా మంచి శుభపరిణామం అన్నారు. రాజధానిలో అమరావతి కోఆర్డినేటర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు.

చంద్రబాబు అవినీతిపాలనకు అంతం పలకండి

ప్రజా సంకల్పయాత్రలో జగన్



విశాలాంధ్ర-నరసరావుపేట : రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అవినీతి, అరాచకపాలన సాగిస్తున్నాడని, ఈ పాలనకు అంతం పలకాల్సిన సమయం ఆసన్నమైందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా శనివారం గుంటూరు జిల్లా నరసరావుపేటకు చేరుకున్న ఆయన పట్టణంలోని పల్నాడు బస్టాండ్ వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, మార్కెట్‌యార్డులను రాష్ట్రంలో అవినీతి కేంద్రాలుగా మార్చారన్నారు. పంటలను అమ్ముకోవాలన్నా, వ్యాపారాలు చేసుకోవాలన్నా క్రిందిస్థాయి నుంచి లంచాలు ఇవ్వాల్సిందేనన్నారు. దేశంలో జీఎస్టీ, రాష్ట్రంలో టీఎస్టీ, నరసరావుపేట నియోజకవర్గంలో కేఎస్టీ అమలవుతున్నాయన్నారు. నియోజకవర్గంలో రైల్వే, కోటప్పకొండ అభివృద్ధి కాంట్రాక్టులు, ఆటోలు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, అపార్ట్‌మెంట్‌లకు కేఎస్టీ వసూలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో ఏ వర్గం ప్రజలు సంతోషంగా లేరన్నారు. చంద్రబాబు పాలనను బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. అన్యాయాలు, అక్రమాలు చేయటానికి చంద్రబాబుకు ఏ ప్రజలు అనుమతించారో, ప్రత్యేకహోదాను తాకట్టుపెట్టి ప్రత్యేక ప్యాకేజీ తీసుకోమని ఏ ప్రజలు చెప్పారో వివరించాలన్నారు. చంద్రబాబును బలహీనపరిస్తే రాష్ట్రం బలహీనపడుతుందని ప్రజలను బెదిరించటం సిగ్గుచేటన్నారు. సాగర్ కుడికాల్వ పరిధిలోని రైతులు వరిసాగు చేపట్టక నాలుగేళ్లు గడుస్తున్నా చంద్రబాబుకు ఎటువంటి బాధలేదన్నారు. ఆరుతడి పంటలకు నీరు ఇవ్వలేని స్థితిలో చంద్రబాబు పాలన ఉందన్నారు. తెలంగాణలోని ఎడమ కాల్వ పరిధిలో రైతులు వరి సాగు చేసుకొని సంతోషంగా ఉంటే కుడికాల్వ పరిధిలో రైతులు ఆరుతడి పంటలు కూడా వేయలేని దుస్థితిలో ఉన్నారన్నారు.

నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు రాకతో రాష్ట్రంలో కరవు వచ్చిందన్నారు. కందుల కొనుగోళ్లలో కూడా పక్షపాతం చూపిస్తూ ఈ నియోజకవర్గంలోని అధికారపార్టీ నాయకులు అక్రమాలు చేయటం దారుణమన్నారు. నరసరావుపేటలో ఓడిపోతానని ముందే ఊహించుకుని సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు సత్తెనపల్లికి పారిపోయాడన్నారు. 22 క్రిమినల్ కేసులు ఉన్న కోడెలకు సభాపతి ఇవ్వటం చంద్రబాబు తప్పిదమన్నారు. కోడెల పదవిని అడ్డంపెట్టుకొని ఆయన కుమార్తె సేఫ్ ఫార్మాలో నకిలీ మందులు తయారు చేస్తున్నారని విమర్శించారు. గురజాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి అంశంలో అవినీతి పేరుకుపోయిందన్నారు. ఎన్ఎస్‌పీ కుడి, ఎడమ కాల్వలకు సమానంగా నీరు అందించిన ఘనత వైఎస్‌దేనని చెప్పారు. రానున్న ఎన్నికల్లో డాక్టర్ గోపిరెడ్డి విజయానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు, జిల్లా అధ్యక్షుడు మర్రి రాజశేఖర్, కమలాపురం ఎమ్మెల్యే బి.రవీంద్రనాథ్‌రెడ్డి, వినుకొండ ఇన్‌ఛార్జి బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్సీ టీవీజీ.కృష్ణారెడ్డి ఆళ్ల రామకృష్ణారెడ్డి, ముస్తఫా, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పట్టణంలోని నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణ ఖర్చంతా కేంద్రమే భరించాలి

అసెంబ్లీలో 344 నోటీసుపై మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం రాజధాని అమరావతిలో పరిపాలన భవనాలకయ్యే రూ. 11,600 కోట్లను కేంద్రమే భరించాలని పట్టణాభివృద్ధి, మున్సిపల్‌శాఖమంత్రి పి నారాయణ అన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా శనివారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో నియమావళిలోని 344వ నియమంలో 'అమరావతి రాజధాని నగరాభివృద్ధి' అంశంపై పలువురు ఎమ్మెల్యేలు అందచేసిన నోటీసును స్పీకర్ కోడెల శివప్రసాద్ అనుమతించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తామని తిరుపతి సభలో ప్రకటించిన ప్రధాని మోడీ ఆ హామీని అమలు చేసి మాట నిలుపుకోవాలన్నారు. కేంద్రం ఇప్పటి వరకూ రాజధాని నిర్మాణానికి రూ. 1500 కోట్లు మాత్రమే ఇచ్చి, ఇంకా రూ. 1000 కోట్లే ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా 1450 ఎకరాల్లో నిర్మించే శాసనసభ, మండలి, హైకోర్టు, సచివాలయం, ప్రభుత్వ అధికారుల నివాసాలకు రూ. 11,600 కోట్ల వ్యయం కానుందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీని తలదన్నె రీతిలో ఏపీ రాజధాని నిర్మాణానికి ఆస్థానా సహా అనేక దేశాల్లోని రాజధానులను సందర్శించాలని సూచించిన మోడీ తర్వాత పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర బీజేపీ నేతలు ఏం సమాధానం చెబుతారని ఆపార్టీ సభాపక్షనేత విష్ణుకుమార్‌రాజును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాజధాని బృహత్ ప్రణాళిక తయారు మొదలుకొని రాజధానిలో ఆయా ప్రభుత్వ భవనాల డిజైన్ల వరకూ అన్ని అంశాలను సభకు వివరించిన ఆయన ఎన్ని ఇబ్బందులెదురైనా సరే ప్రపంచస్థాయిలో అత్యుత్తమ రాజధాని నగరాన్ని నిర్మించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ఏప్రిల్‌లో అసెంబ్లీ, హైకోర్టు తుది డిజైన్లను ప్రభుత్వానికి సమర్పిస్తుందని ఆయన చెప్పారు. ప్రతిపక్షం మొదట్నుంచీ కూడా రాజధాని నిర్మాణానికి అనేక రకాలుగా అవరోధాలను కలిగిస్తోందన్నారు. మొత్తం 217 చదరపు కి.మీ. విస్తీర్ణంలో తొమ్మిది నగరాలను నిర్మించనున్నట్లు చెప్పారు. ఇందులో 30 శాతం పూర్తిగా నీలి-హరిత శోభితంగా నీరు, పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. దాదాపు 3 లక్షల మొక్కలను నాటుతున్నట్లు చెప్పారు. ప్రధాన వాగులైన కొండవీటివాగు, పాలవాగులను పూడ్చేస్తామనే ప్రచారం జరుగుతోందని, ఇది పూర్తిగా అవాస్తమన్నారు. ఈ వాగులను మరింత లోతు, వెడల్పులతో విస్తరించడమే కాకుండా ఇరువైపులా వివిధ నిర్మాణాలను చేపడుతున్నట్లు వివరించారు. అలాగే ఈ వాగుల్లో ప్రవహించే వరదనీటిని నిల్వ చేసేందుకు మొత్తం ఆరు ప్రదేశాల్లో జలాశయాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాజధాని ప్రాంతంలో 1600 కిలోమీటర్ల రోడ్‌నెట్ వర్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రూ. 1,387 కోట్ల వ్యయంతో కృష్ణానదిపై ఐకానిక్ వంతెనను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామని నారాయణ సభాసమక్షంగా స్పష్టం చేశారు.

వచ్చే వారంలో కొరియాల సమావేశం



సియోల్ : దక్షిణ కొరియాతో ఉన్నతస్థాయి చర్చలకు ఉత్తర కొరియా అంగీకారం తెలిపింది. అంతర్గత కొరియా సదస్సుపై చర్చించేందుకు ఇరు వర్గాలు వచ్చే వారంలో సమావేశం కానున్నాయి. ఉత్తరం, దక్షిణం నుంచి ముగ్గురు సభ్యులతో కూడిన ప్రతినిధి బృందం చర్చల్లో పాల్గొనుంది. ఏప్రిల్ చివరిలో జరగనున్న సదస్సుకు మార్గం సుగమం చేసే లక్ష్యంతో గురువారం సరిహద్దు గ్రామమైన పన్‌ముంజమ్‌లో ఉత్తర, దక్షిణ కొరియాల ప్రతినిధులు భేటీ కానున్నారు. దక్షిణ కొరియా త్రిసభ్య బృందానికి యునిఫికేషన్ మంత్రి చో మ్యాంగ్-గ్యాన్ నేతృత్వం వహిస్తారని మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కమిటీ ఫర్ పీస్‌ఫుల్ రీయూనిఫికేషన్ చైర్మన్ రీ సాన్-గ్వాన్ నేతృత్వంలోని త్రిసభ్య బృందాన్ని చర్చలకు పంపేందుకు ఉత్తర కొరియా అంగీకరించినట్టు ప్రకటన పేర్కొంది. ఈనెల 29న జరిగే చర్చల ద్వారా అంతర్గత కొరియాల సమావేశానికి తమ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపింది.

ఆస్ట్రేలియాలోని హమెలిన్ పెను విషాదం

తీరానికి కొట్టుకొచ్చిన 150 వేల్స్



పెర్త్ , ఆస్ట్రేలియా : వెస్టర్న్ ఆస్ట్రేలియాలోని హమెలిన్ సముద్ర తీరంలో పెను విషాదం చోటు చేసుకుంది. దాదాపు 150 వేల్స్ ఒడ్డుకు కొట్టుకువచ్చి ప్రాణాలు విడిచాయి. మృత్యువాత పడ్డ వేల్స్‌ను తినేందుకు షార్క్‌లు ఎగబడ్డాయి. ఈ ఘటనకు సంబంధించిన హృదయవిదారక దృశ్యాలను చిత్రీకరించిన స్థానికులు సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారాయి. నది సముద్రం కలిసే చోట నీటికి ఎదురొచ్చిన వేల్స్ గుంపు ఇలా సముద్ర తీరానికి వచ్చి తిరిగి వెళ్లలేక ప్రాణాలు కోల్పోయాయని భావిస్తున్నారు. ఈ ఘటనపై డెయిలీ మెయిల్‌తో మాట్లాడిన స్థానిక మహిళ.. ఒడ్డుకు కొట్టుకొచ్చిన వందలాది వేల్స్‌లో తాను చూస్తుండగా మరణించాయని చెప్పారు. మరికొన్ని నీటిలోకి తిరిగి వెళ్లడానికి చేసిన ప్రయత్నాన్ని చూసి కంటతడి ఆగలేదని వెల్లడించారు. వాటికి సాయం చేయలేని తన నిస్సహాయతను ఆమె నిందించుకున్నారు. మరణించిన వేల్స్ మాంసం కోసం షార్క్‌లు తీరానికి వచ్చాయని చెప్పారు.





ఆఫ్ఘన్‌లో బాంబు పేలుడు

15 మంది మృతి, 50 మందికి గాయాలు

నూతన సంవత్సరం వేడుకల్లో విషాదం

లష్కర్‌ఘా (ఆఫ్ఘనిస్థాన్) : దక్షిణ ఆఫ్ఘనిస్థాన్ నూతన సంవత్సరం వేడుకల్లో విషాదం చోటు చేసుకొంది. శుక్రవారం హెల్మాండ్‌లోని స్టేడియంలో బాంబు పేలుడు సంభవించడంతో 14 మంది మరణించారు. 50మంది గాయపడ్డారు. శనివారానికి మృతుల సంఖ్య 15కు చేరుకొన్నట్టు అధికారులు వెల్లడించారు. రెజిలింగ్ మ్యాచ్ పూర్తి అయిన తర్వాత స్టేడియం నుంచి ప్రజలు వెళ్లిపోతున్న సమయంలో పేలుడు సంభవించిందని ఆఫ్ఘన్ అధికార ప్రతినిధి ఒమర్ జ్వాక్ తెలిపారు. ఘాజీ మహమ్మద్ అయూబ్ స్టేడియంలో కారు బాంబు పేలిందని, దీనిని ఆత్మాహుతి దాడిగా పరిగణిస్తున్నామని చెప్పారు. ఈ దాడిలో చనిపోయిన వారిలో చిన్నారులు కూడా ఉన్నారన్నారు. అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. దేశ సంప్రదాయ, సాంస్కృతిక వేడుకను ఆఫ్ఘనిస్థాన్ శత్రువులు అడ్డుకోలేరని ఉద్ఘాటించారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని యునైటెడ్ నేషన్స్ అసిస్టెంటెన్స్ మిషన్ (యూఎన్ఏఎంఏ) కూడా ట్విట్టర్ ద్వారా ఈ ఘటనను ధ్రువీకరించింది. హెల్మాండ్‌లోని స్టేడియం వద్ద నుంచి వస్తున్న రిపోర్డులు కలచివేసేవిగా ఉన్నాయని పేర్కొంది. ప్రజలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం అంతర్జాతీయ మానవ చట్టాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమేనని, ఇది యుద్ధనేరాలకు దారితీయెచ్చునని ట్వీట్ చేసింది. ఈ దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు. కొన్ని నెలలుగా ఆఫ్ఘనిస్థాన్ ఆత్మాహుతి దాడులతో దద్దరిల్లుతోందిన రాజధాని నగరం కాబూల్‌లో జరిగిన దాడుల్లో 150మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

సామాజిక ఐక్యతకు పెరూ నూతన అధ్యక్షుడి పిలుపు



లిమా : పెరూ నూతన అధ్యక్షుడిగా మార్టిన్ విజ్‌కరా బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం వరకు పెరూకు తొలి ఉపాధ్యక్షుడిగా, కెనడాకు దౌత్యాధికారిగా వ్యవహరించిన మార్టిన్ శనివారం దేశ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక ఐక్యతకు, అవినీతి, అక్రమాలపై ఐక్యపోరుకు పిలుపునిచ్చారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో అధ్యక్షుడు గద్దె దిగే పరిస్థితి రావడంతో దేశం సంక్షోభంలోకి నెట్టబడింది. రేండేళ్ల పాటు అధ్యక్షుడిగా ఉన్న పెడ్రో పాబ్లో కుసీన్కీ బుధవారం రాజీనామా చేశారు. ఇది అవిశ్వాస ఓటింగ్‌కు కేవలం ఒక రోజు ముందు జరిగింది. మార్టిన్ మాట్లాడుతూ, అవినీతిపై ఉక్కుపాదం మోపుతానని ఉద్ఘాటించారు. గత మంత్రివర్గం కొనసాగబోదన్న ఆయన మాటలను మోజారిటీ ప్రజలు స్వాగతించారు. అస్థిరత, వ్యవస్థ సంక్షోభంలో ఉన్న సమయంలో తాను దేశ బాధ్యతలు స్వీకరిస్తున్నానన్నారు. పూర్వ అధ్యక్షుడు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర నేతలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వానికి మార్గదర్శకాలను జారీచేశారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితి నుంచి పెరూను బయటకు తీసుకొచ్చేందుకు శాయాశక్తులా కలిసికట్టుగా ప్రయత్నిద్దామని పిలుపునిచ్చారు. ఆర్థిక వ్యవస్థ గురించి ప్రస్తావిస్తూ మంచిని ప్రోత్సహిస్తామని, కొన్నిసందర్భాల్లో మార్పులు అనివార్యమని మార్టిన్ అన్నారు. ఆరోగ్యం, విద్య, ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తానని చెప్పారు.



హీరో కల్నల్

మహిళను విడిపించేందుకు ఉగ్రవాది చేతిలోకి బందీగా వెళ్లి అమరుడయ్యాడు

ట్రెబెస్ : ఉగ్రవాది చెర నుంచి బందీలుగా ఉన్న వారిని కాపాడేందుకు తన ప్రాణాలను సైతం లెక్కచేయలేదు ఫ్రాన్స్‌కు చెందిన అధికారి లెఫ్టినెంట్ కల్నల్ అర్నాడ్ బెల్ట్రేమ్. ఉగ్రవాది ఓ మహిళను బందీగా చేసుకునేందుకు ప్రయత్నించగా.. ఆమెకు బదులుగా బెల్ట్రేమ్ ఉగ్రవాదికి బందీగా వెళ్లి ప్రాణాలను కోల్పోయారు. ఆయన చూపిన అసాధారణ ప్రతిభకు అందరూ సెల్యూట్ చేస్తున్నారు. ప్రజలను కాపాడేందుకు తన ప్రాణాలనే పణంగా పెట్టాడు.. ఆయన నిజంగా హీరో అంటూ అభినందిస్తున్నారు. శుక్రవారం ఫ్రాన్స్‌లోని ఓ సూపర్‌మార్కెట్‌కి సాయుధుడు చొరబడి పోలీస్‌పై కాల్పులు జరిపి అక్కడి వారిని బందీలుగా చేసుకున్న విషయం తెలిసిందే. వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాది కాల్పులు జరిపే సమయంలో అక్కడే ఉన్న ఓ మహిళను బందీగా చేసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో అక్కడ ఉన్న కల్నల్ బెల్ట్రేమ్ తన వద్ద ఉన్న ఆయుధాన్ని కిందపడేసి మహిళకు బదులుగా ఆయనే ఉగ్రవాదికి బందీగా వెళ్లాడు. అంతేకాదు.. సూపర్‌మార్కెట్ లోపల ఏం జరుగుతుందనేది బయట ఉన్న పోలీసులకు తెలిసే విధంగా కల్నల్ తన ఫోన్‌ను ఆన్ చేసి ఘటనా స్థలంలో వదిలిపెట్టాడు. ఆయన ఫోన్ ద్వారానే పోలీసులు సూపర్‌మార్కెట్‌లో ఏం జరుగుతుందనేది తెలుసుకోగలిగారు. బందీగా వెళ్లిన బెల్ట్రేమ్‌పై ఉగ్రవాది కాల్పులు జరిపాడు. దీంతో ఆయనకు తీవ్రంగా బుల్లెట్ గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య నాలుగుకు చేరింది. కల్నల్ బెల్ట్రేమ్ సాహసాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మానుయేల్ మేక్రాన్, అంతర్గతశాఖ మంత్రి కొల్లాంబ్ కొనియాడారు. ఆయన దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. ఆయన ధైర్యసాహసాలను దేశం ఎన్నటికీ మరిచిపోదని పేర్కొన్నారు. కల్నల్ మృతికి మేక్రాన్ సంతాపం తెలియజేస్తూ నివాళులర్పించారు

సెస్ నిధులు ఖర్చు పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

పయనింపచేస్తామన్నారు. ఇచ్చాపురం, పుంగనూరు తదితర పాఠశాలలతో పాటు 59 మున్సిపల్ పాఠశాలల్లో జీపీఎఫ్‌ను ఉపాధ్యాయుల ఖాతాల్లోకి జమ చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పురపాలక శాఖ మంత్రిని కోరారు. పురపాలక ఉపాధ్యాయుల భవిష్య నిధి గురించి ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2009 నుంచి పురపాలక సంఘాల్లో ఉపాధ్యాయుల ఖాతాల్లో భవిష్య నిధిని వారి జీతాల నుంచి చెల్లించినా ఇప్పటి వరకు సక్రమంగా ఖాతాలలో వేయలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతపురం కార్పొరేషన్‌లో టీచర్ల పీఎఫ్ బకాయి రూ.36 లక్షలను వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఉపాధ్యాయుల అంతర్ బదిలీల కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని కత్తి డిమాండు చేశారు. ఇదే అంశంపై గాదె శ్రీనివాసులునాయుడు, బాలసుబ్రహ్మణ్యం, యండపల్లిలు మాట్లాడుతూ ఆర్థిక శాఖ అభ్యంతరం లేదంటుంది కానీ పురపాలక శాఖ ఉపాధ్యాయుల ఖాతాలకు జమ చేయదు. ఉపాధ్యాయులకు చెందిన రూ.62 కోట్లు ఏ ఖాతాలో ఉన్నాయి. చీరాల, మార్కాపురం, గూడూరు, మున్సిపాలిటీల్లో ఉపాధ్యాయులు భవిష్యనిధి వ్యవహారంపై అయోమయానికి గురవుతున్నారని చెప్పారు. పై ప్రశ్నలకు పురపాలక శాఖ మంత్రి నారాయణ సమాధానమిస్తూ ఏప్రిల్ 1 నుంచి భవిష్య నిధిని ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే చీరాలకు చెందిన రూ.40 లక్షలు, అనంతపురం రూ.36 లక్షలు జమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

టీటీడీ 73 ఆలయాలను నవీకరించింది : మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్రంలో టీటీడీ ద్వారా శిథిలమైన దేవాలయాల పునర్నిర్మాణంపై ఎమ్మెల్సీ చలపతిరావు అడిగిన ప్రశ్నకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ రాష్ట్రంలో టీటీడీ ఇప్పటికే 73 ఆలయాలను నవీకరించిందని, 13 ఆలయాలు పురోగతిలో ఉన్నాయని, మరో 27 పరిశీలనలో ఉన్నాయని, రూ.7 కోట్లతో 36 వెంకటేశ్వరస్వామి దేవాలయాల నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. శమంతకమణి మాట్లాడుతూ సింగనమలలోని ఆత్మారాముడు ఆలయాన్ని పునర్మించాలని కోరగా పురావస్తు శాఖ, దేవదాయ శాఖ మధ్య చర్చలు నడుస్తున్నాయని, ఆ తర్వాత పనులు ప్రారంభమతాయని మంత్రి చెప్పారు.

విజయవాడ కార్పొరేషన్‌లో ఆగస్టు తర్వాత గ్రామ పంచాయతీల విలీనం

విజయవాడ నగరపాలక సంస్థలో 51 గ్రామ పంచాయతీలను విలీనం చేసే ప్రతిపాదన ఉందని, ఆగస్టు తర్వాత విలీన ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం చెప్పారు. గోదావరి, పెన్నా అనుసంధానం పనులు త్వరలో ప్రారంభిస్తామని, లిఫ్టుల ద్వారా బొల్లాపల్లి రిజర్వాయర్‌కు నీటిని చేర్చి అక్కడి నుంచి నాగార్జునసాగర్ కుడికాల్వకు, వెలిగొండ ప్రాజెక్టుకు కూడా గోదావరి నీరును అందించి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, కడప జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమమహేశ్వరరావు సభ్యురాలు పోతుల సునీత అడిగన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాకినాడ, చెన్నై జల రవాణా పనులు ముత్యాల నుంచి ప్రారంభమయ్యాయని, అచ్చంపేట మధ్యలో ఓ బండరాయి బయటపడిందని, ఆ బండరాయిని తొలగించే పనులు నడుస్తున్నాయన్నారు. రెండవ దశలో విజయవాడ నుంచి రాజమండ్రి, మూడవ దశలో కొమ్మమూరు-బకింగ్‌హామ్ కెనాల్ పనులు జరుగుతాయని రాము సూర్యారావు, విఠలపు బాలసుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

స్కూల్ గేమ్స్‌కు రూ.10 కోట్లు కేటాయించాలి

పాఠశాలల్లో జోనల్‌స్థాయి క్రీడా పోటీలకు రూపాయి కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వటం లేదని, స్కూల్ గేమ్ ఫెడరేషన్‌కు రూ.10 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్సీ కత్తి ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. గోదావరి నదిని కాలుష్య కోరల నుంచి తప్పించాలని రాము సూర్యారావు కోరారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల వ్యక్తిగత సహాయకులకు వేతనాలు పెంచాలని విఠలపు బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వానికి విన్నవించారు.

జల వినియోగమే జాతి సౌభాగ్యం : ఎమ్మెల్సీ కత్తి

విశాలాంధ్ర-అమరావతి : ప్రకృతిలో ప్రాణమున్న ప్రతి ప్రాణికి జలమే జీవనాధారం. అటువంటి నీటి ప్రాధాన్యత ఏమిటో తనకు బాగా తెలుసని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. మండలిలో శనివారం గ్రామీణ నీటి సరఫరాపై మాట్లాడుతూ మా కుటుంబ సభ్యులు మొత్తం ఆరు మంది. నాలుగు ఎకరాల పొలం ఉంది. దానిలో వేరుశనగ వేసి వచ్చిన ఆదాయంతో జీవించేవారం. కానీ గత 15 ఏళ్ల నుంచి వర్షాలు సక్రమంగా లేకపోవడంతో పంటలు సరిగా పండకు రెండు ఎకరాలు అమ్మాల్సిన పరిస్థితులు వచ్చాయని ఆవేదన చెందారు.

నేడు రాష్ట్రంలో రూ.22 వేల కోట్లతో అందరికీ తాగునీరు అందించే ప్రణాళికలు రూపొందించినందుకు మంత్రి లోకేష్‌కు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో 22,250 పంపులు ద్వారా నీటిని తీసుకొంటున్నారు. నీటి కాలుష్యం వల్లనే రకరకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి శుభ్రం చేయాలన్నారు.

బోరులను క్లీన్ చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. వర్షపు నీటిని వాడుకునే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మన రాష్ట్రంలో వైద్యానికి ఎంత ఖర్చు పెడుతున్నారో నీటికీ అంతే ఖర్చు చేస్తున్నారన్నారు. కేరళ తరహాలో వేడి నీటిని హోటళ్లు, బస్సు స్టాండ్, రైల్వేస్టేషన్‌లో సరఫరా చేస్తున్నారు. అలాగే ఇక్కడ కూడా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి పథకాల నిర్వహణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ ఇవ్వటం కూడా మంచి శుభపరిణామం అన్నారు. రాజధానిలో అమరావతి కోఆర్డినేటర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు.

చేపలు కావవి.. తిమింగలాలు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టారు. వేర్వేరు శాఖల నుంచి 220 రుణ ఖాతాల ద్వారా కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ), చేపల పెంపకానికి రూ.198.28 కోట్ల మేర రుణాన్ని పొందారు. బ్యాంకు ప్యానెల్ విలువదారులతోపాటు 22 మంది అగ్రిగేటర్లతో కూడిన 220 మంది రుణ గ్రహీతలు ఐడీబీఐ బషీర్‌బాగ్(హైదరాబాద్), సిరిపురం(విశాఖపట్టణం) శాఖల అధికారులతో కలిసి కుట్ర పన్నినట్లు ఆరోపణలు వచ్చాయి. అధిక విలువ కలిగిన అనుషంగిక ఆస్తి నకిలీ డాక్యుమెంట్ల ఆధారంగా ఈ రుణాలు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తరువాత నిరర్థక ఆస్తి(ఎన్‌పీఏ)గా మారింది. 2017 సెప్టెంబరు నాటికి అసాధారణ మొత్తం రూ.445.32 కోట్లుగా ఉంది. రుణగ్రహీతలు పేర్కొన్నట్లుగా తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలలో చేపల పెంపకం లేదా చేపలకు సంబంధించి ఇతర ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదని గుర్తించారు. మంజూరు చేసిన రుణాలను దుర్వినియోగం చేశారు. బ్యాంకు ప్యానెల్ విలువదారులు లెఫ్టినెంట్ కల్నల్ బి.కె.సాహూ, ఆకార్ కన్సల్టింగ్ ఇంజినీర్స్, ఆర్.ఎ.శర్మ, ఎం.వి.శ్రీనివాసులు, శుభ సిండికేట్, శ్రీనివాసరావ్, సోమశేఖర రావులపై కూడా కేసులు నమోదు చేశారు. ఇక రెండవ కేసుకు సంబంధించి రూ.93.73 కోట్ల మొత్తానికి బ్యాంకును మోసం చేసిన ఐడీబీఐ అధికారి ఒకరు, మరో తొమ్మిది మందిపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఐడీబీఐ గుంటూరు శాఖలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్న చంద్రశేఖర్ హరీష్ చెన్నప్పగారి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. 2010 నుంచి 2012 వరకు 142 చేపల పెంపకం రుణాల మంజూరు ప్రక్రియను నిర్వహించారు. ఈయనను కూడా ఐడీబీఐ సర్వీసు నుంచి తొలగించారు. నకిలీ పత్రాల ద్వారా రుణాలను పొందినట్లు దర్యాప్తులో వెల్లడయ్యింది. కాగా బ్యాంకు ప్యానెల్ విలువదారు, బ్యాంకు ప్యానెల్ న్యాయవాది, అగ్రిగేటర్లు, వ్యక్తిగత రుణ గ్రహీతలపై ఆరోపణలు నమోదు చేయబడ్డాయి.

చంద్రబాబు అవినీతిపాలనకు అంతం పలకండి



ప్రజా సంకల్పయాత్రలో జగన్

విశాలాంధ్ర-నరసరావుపేట : రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అవినీతి, అరాచకపాలన సాగిస్తున్నాడని, ఈ పాలనకు అంతం పలకాల్సిన సమయం ఆసన్నమైందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా శనివారం గుంటూరు జిల్లా నరసరావుపేటకు చేరుకున్న ఆయన పట్టణంలోని పల్నాడు బస్టాండ్ వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, మార్కెట్‌యార్డులను రాష్ట్రంలో అవినీతి కేంద్రాలుగా మార్చారన్నారు. పంటలను అమ్ముకోవాలన్నా, వ్యాపారాలు చేసుకోవాలన్నా క్రిందిస్థాయి నుంచి లంచాలు ఇవ్వాల్సిందేనన్నారు. దేశంలో జీఎస్టీ, రాష్ట్రంలో టీఎస్టీ, నరసరావుపేట నియోజకవర్గంలో కేఎస్టీ అమలవుతున్నాయన్నారు. నియోజకవర్గంలో రైల్వే, కోటప్పకొండ అభివృద్ధి కాంట్రాక్టులు, ఆటోలు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, అపార్ట్‌మెంట్‌లకు కేఎస్టీ వసూలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో ఏ వర్గం ప్రజలు సంతోషంగా లేరన్నారు. చంద్రబాబు పాలనను బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. అన్యాయాలు, అక్రమాలు చేయటానికి చంద్రబాబుకు ఏ ప్రజలు అనుమతించారో, ప్రత్యేకహోదాను తాకట్టుపెట్టి ప్రత్యేక ప్యాకేజీ తీసుకోమని ఏ ప్రజలు చెప్పారో వివరించాలన్నారు. చంద్రబాబును బలహీనపరిస్తే రాష్ట్రం బలహీనపడుతుందని ప్రజలను బెదిరించటం సిగ్గుచేటన్నారు. సాగర్ కుడికాల్వ పరిధిలోని రైతులు వరిసాగు చేపట్టక నాలుగేళ్లు గడుస్తున్నా చంద్రబాబుకు ఎటువంటి బాధలేదన్నారు. ఆరుతడి పంటలకు నీరు ఇవ్వలేని స్థితిలో చంద్రబాబు పాలన ఉందన్నారు. తెలంగాణలోని ఎడమ కాల్వ పరిధిలో రైతులు వరి సాగు చేసుకొని సంతోషంగా ఉంటే కుడికాల్వ పరిధిలో రైతులు ఆరుతడి పంటలు కూడా వేయలేని దుస్థితిలో ఉన్నారన్నారు.

నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు రాకతో రాష్ట్రంలో కరవు వచ్చిందన్నారు. కందుల కొనుగోళ్లలో కూడా పక్షపాతం చూపిస్తూ ఈ నియోజకవర్గంలోని అధికారపార్టీ నాయకులు అక్రమాలు చేయటం దారుణమన్నారు. నరసరావుపేటలో ఓడిపోతానని ముందే ఊహించుకుని సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు సత్తెనపల్లికి పారిపోయాడన్నారు. 22 క్రిమినల్ కేసులు ఉన్న కోడెలకు సభాపతి ఇవ్వటం చంద్రబాబు తప్పిదమన్నారు. కోడెల పదవిని అడ్డంపెట్టుకొని ఆయన కుమార్తె సేఫ్ ఫార్మాలో నకిలీ మందులు తయారు చేస్తున్నారని విమర్శించారు. గురజాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి అంశంలో అవినీతి పేరుకుపోయిందన్నారు. ఎన్ఎస్‌పీ కుడి, ఎడమ కాల్వలకు సమానంగా నీరు అందించిన ఘనత వైఎస్‌దేనని చెప్పారు. రానున్న ఎన్నికల్లో డాక్టర్ గోపిరెడ్డి విజయానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు, జిల్లా అధ్యక్షుడు మర్రి రాజశేఖర్, కమలాపురం ఎమ్మెల్యే బి.రవీంద్రనాథ్‌రెడ్డి, వినుకొండ ఇన్‌ఛార్జి బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్సీ టీవీజీ.కృష్ణారెడ్డి ఆళ్ళ రామకృష్ణారెడ్డి, ముస్తఫా, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పట్టణంలోని నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణ ఖర్చంతా కేంద్రమే భరించాలి

అసెంబ్లీలో 344 నోటీసుపై మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం రాజధాని అమరావతిలో పరిపాలన భవనాలకయ్యే రూ. 11,600 కోట్లను కేంద్రమే భరించాలని పట్టణాభివృద్ధి, మున్సిపల్‌శాఖమంత్రి పి నారాయణ అన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా శనివారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో నియమావళిలోని 344వ నియమంలో 'అమరావతి రాజధాని నగరాభివృద్ధి' అంశంపై పలువురు ఎమ్మెల్యేలు అందచేసిన నోటీసును స్పీకర్ కోడెల శివప్రసాద్ అనుమతించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తామని తిరుపతి సభలో ప్రకటించిన ప్రధాని మోడీ ఆ హామీని అమలు చేసి మాట నిలుపుకోవాలన్నారు. కేంద్రం ఇప్పటి వరకూ రాజధాని నిర్మాణానికి రూ. 1500 కోట్లు మాత్రమే ఇచ్చి, ఇంకా రూ. 1000 కోట్లే ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా 1450 ఎకరాల్లో నిర్మించే శాసనసభ, మండలి, హైకోర్టు, సచివాలయం, ప్రభుత్వ అధికారుల నివాసాలకు రూ. 11,600 కోట్ల వ్యయం కానుందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీని తలదన్నే రీతిలో ఏపీ రాజధాని నిర్మాణానికి ఆస్థానా సహా అనేక దేశాల్లోని రాజధానులను సందర్శించాలని సూచించిన మోడీ తర్వాత పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర బీజేపీ నేతలు ఏం సమాధానం చెబుతారని ఆపార్టీ సభాపక్షనేత విష్ణుకుమార్‌రాజును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాజధాని బృహత్ ప్రణాళిక తయారు మొదలుకొని రాజధానిలో ఆయా ప్రభుత్వ భవనాల డిజైన్ల వరకూ అన్ని అంశాలను సభకు వివరించిన ఆయన ఎన్ని ఇబ్బందులెదురైనా సరే ప్రపంచస్థాయిలో అత్యుత్తమ రాజధాని నగరాన్ని నిర్మించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ఏప్రిల్‌లో అసెంబ్లీ, హైకోర్టు తుది డిజైన్లను ప్రభుత్వానికి సమర్పిస్తుందని ఆయన చెప్పారు. ప్రతిపక్షం మొదట్నుంచీ కూడా రాజధాని నిర్మాణానికి అనేక రకాలుగా అవరోధాలను కలిగిస్తోందన్నారు. మొత్తం 217 చదరపు కి.మీ. విస్తీర్ణంలో తొమ్మిది నగరాలను నిర్మించనున్నట్లు చెప్పారు. ఇందులో 30 శాతం పూర్తిగా నీలి-హరిత శోభితంగా నీరు, పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. దాదాపు 3 లక్షల మొక్కలను నాటుతున్నట్లు చెప్పారు. ప్రధాన వాగులైన కొండవీటివాగు, పాలవాగులను పూడ్చేస్తామనే ప్రచారం జరుగుతోందని, ఇది పూర్తిగా అవాస్తమన్నారు. ఈ వాగులను మరింత లోతు, వెడల్పులతో విస్తరించడమే కాకుండా ఇరువైపులా వివిధ నిర్మాణాలను చేపడుతున్నట్లు వివరించారు. అలాగే ఈ వాగుల్లో ప్రవహించే వరదనీటిని నిల్వ చేసేందుకు మొత్తం ఆరు ప్రదేశాల్లో జలాశయాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాజధాని ప్రాంతంలో 1600 కిలోమీటర్ల రోడ్‌నెట్ వర్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రూ. 1,387 కోట్ల వ్యయంతో కృష్ణానదిపై ఐకానిక్ వంతెనను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామని నారాయణ సభాసమక్షంగా స్పష్టం చేశారు.

పోరు ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

1971 జనాభానే ప్రామాణికంగా తీసుకోవాలని గతంలోనే కోరిన విషయాన్ని యనమల గుర్తు చేశారు. 2011 జనాభాకు 10 శాతం వెయిటేజి ఇవ్వడం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని యనమల చెప్పారు. కుటుంబ నియంత్రణ పాటించినందుకు గతంలో ప్రోత్సాహకాలు ఉండేవని, అలాంటిది ఇప్పుడు జనాభా నియంత్రణ లేని రాష్ట్రాలకు అధిక నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. దక్షిణాది ఆర్థిక మంత్రుల భేటీకి వెళ్లేందుకు సీఎంను యనమల అనుమతి కోరగా అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు.

మాతృభాషకు పట్టం

(మొదటిపేజీ తరువాయి)

భాషా ప్రాథమిక పాఠశాలల్లో మొదటి తరగతిలో తెలుగు భాషను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ప్రవేశపెడుతు న్నామన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశపెట్టే భాష చాలా సులభతరంగా ఉంటుందని చెప్పారు. తెలుగు భాషను తప్పనిసరి చేయడం కోసం రూపొందించే సిలబస్ బాధ్యతలు తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయానికి అప్పగించామన్నారు. ఎంఐఎం సభ్యులు జాఫర్ హుస్సేన్, బీజేపీ సభ్యులు కిషన్‌రెడ్డి, టీడీపీ సభ్యులు ఆర్.కృష్ణయ్య, సీపీఎం సభ్యులు సున్నం రాజయ్య మాట్లాడుతూ తెలుగును తప్పనిసరి చేస్తూ బిల్లు తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.



ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు మంత్రి పితాని హామీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహిస్తామని కార్మిక శాఖమంత్రి పితాని సత్యనారాయణ హామీ ఇచ్చారు. కోడ్ ఆఫ్ డిసిప్లిన్ నిబంధన ప్రకారం ప్రతి రెండేళ్లకు ఒకసారి జరగాల్సిన గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రతినిధి బృందం శనివారం మంత్రిని కలసి విజ్ఞప్తి చేసింది. ఎన్నికల కోసం ఈనెల 1వ తేదీన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కార్మిక శాఖ అధికారులను కలసి లేఖను ఇచ్చినట్లు తెలి పింది. ఎన్నికలకు సవాలు చేసిన 50 రోజుల్లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని ఆ బృందం మంత్రి దృష్టికి తీసు కొచ్చింది. దీనిపై మంత్రి స్పందిస్తూ కార్మికశాఖ అధికారులతో చర్చించి సకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే కనీస వేతన సలహా బోర్డును కూడా త్వరలోనే నియమిస్తామన్నారు. కార్మికుల వేతనాలు పెంచుతూ జీవోను విడుదల చేస్తామన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు రూ. 3 వేలు పెన్షన్ ఇచ్చే విషయం ప్రభుత్వ పరిశీల నలో ఉందన్నారు. అలాగే అంగన్‌వాడీ కార్మికులు, ఇతర స్కీమ్ వర్కర్లకు వేతనాలను పెంచే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు మంత్రి బృందానికి తెలి పారు. ఇక మెడికల్ కాంట్రాక్టు కార్మికుల పరిస్థితులను బృందం మంత్రికి వివరించగా సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి వేతనాల పెంపుదల గురించి విద్యాశాఖ మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అలాగే రాజమండ్రి పేపర్‌మిల్లులో తొలగించిన కార్మిక నాయకులు ముగ్గుర్ని తిరిగి పనిలోకి తీసుకోవాలని, భవన నిర్మాణ కార్మికుల పదవీ విరమణ వయసును 65 సంవత్సరాలకు పెంపుదల, పెండింగ్‌లో ఉన్న సభ్యత్వ కార్డులు తదితర విషయాలను ఈ బృందం మంత్రి దృష్టికి తీసుకొచ్చింది. గొల్లపూడిలో నిర్మించిన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించాలని నాయకులు మంత్రిని కోరగా త్వరలోనే వస్తానని ఆయన హామీ ఇచ్చారు. మంత్రితో భేటీ అయిన వారిలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్, కార్యదర్శి బీవీవీ కొండలరావు, కార్యవర్గ సభ్యుడు ఆసుల రంగనాయకులు ఉన్నారు.

రాజకీయమే మీ అజెండా

- టీడీపీ ప్రభుత్వం తప్పిదాలను ఎప్పటికీ విస్మరించలేం
- ప్రజలకు లెక్క చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంది
- ఏపీకి హామీలను పూర్తిగా నెరవేర్చాం
- చంద్రబాబుకు అమిత్‌షా లేఖ



విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : రాజకీయ దురుద్దేశంతోనే చంద్రబాబు ఎన్‌డీఏ కూటమి నుంచి వైదొలిగారని, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఘాటుగా స్పందించారు. ఎన్‌డీఏ కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటిస్తూ, అందుకు కారణాలు వివరిస్తూ అంతకుముందు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు రాసిన లేఖకు అమిత్‌షా సమాధానం ఇచ్చారు. చంద్రబాబు నిర్ణయంలో అభివృద్ధి అజెండా కంటే రాజకీయ ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయని మండిపడ్డారు. చంద్రబాబు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని దుయ్యబట్టారు. ఈ నిర్ణయం దురదృష్టకరమని, తమను ఆశ్చర్య పరిచిందని అమిత్‌షా 9 పేజీల లేఖలో స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం అన్ని రకాలుగా సహకరించిందన్నారు. ఏపీ విభజన సమయంలో తెలుగు రాష్ట్రాల హక్కులను పరిరక్షించడంలో బీజేపీ ముందుందని చెప్పారు. ఏపీ ప్రజల ఆకాంక్షల పట్ల బీజేపీకి ఏమాత్రం సానుభూతి లేదని మీరు(చంద్రబాబు) చెబుతున్న మాటలన్నీ కూడా అబద్ధాలు, నిరాధారాలు అని అమిత్‌షా ధ్వజమెత్తారు. ఎన్‌డీఏ సర్కార్ ఏపీకి ఇచ్చే కేంద్ర సహాయాన్ని రెండింతలు పెంచిందని, బీజేపీ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదని చెప్పారు. రాజధాని కోసం కేంద్రం విడుదల చేసిన నిధుల్లో కేవలం 8 శాతం మాత్రమే ఏపీ వాడుకుందన్నారు. పోలవరానికి రూ.5,364 కోట్లు కేటాయించామని చెప్పిన ఆయన చంద్రబాబు ప్రభుత్వం నుంచి జరిగిన తీవ్రమైన తప్పిదాలను ఎప్పటికీ విస్మరించలేమన్నారు. కేంద్రం నిధులకు సంబంధించి ఎలాంటి లెక్కలూ ఇప్పటి వరకు చంద్రబాబు ప్రభుత్వం సమర్పించలేదని, ప్రభుత్వాలు ప్రతి పైసా ఖర్చుపై ప్రజలకు లెక్క చెప్పాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు.

కాగా విభజన చట్టంలోని హామీల అమలు, ప్రత్యేక హోదా, రాష్ట్రాభివృద్ధి కోసమే ఎన్‌డీఏతో తాము జతకట్టామని, ఆ హామీలు నెరవేర్చక పోవడంతో తీవ్ర అసంతృప్తిగా ఉన్నామని చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. ప్రత్యేక హోదాని ఏపీ ప్రజలు బలంగా కోరుకుంటున్నారని, చాలాసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని అందుకే తాము కూటమి నుంచి వైదొలిగినట్లు చంద్రబాబు వివరించారు. దీనికి ప్రతిగానే అమిత్‌షా కౌంటర్ లేఖను తాజాగా విడుదల చేశారు. ఏపీకి సంబంధించి ఏ చిన్న విషయంలోనూ వెనకడుగు వేయలేదని వివరించారు. ఏపీ అభివృద్ధికి నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందించిందని తెలిపారు. గతంలో టీడీపీకి లోక్‌సభలోగానీ, రాజ్యసభలోగానీ సరైన ప్రాతినిధ్యం లేనప్పుడు బీజేపీనే అజెండా తయారుచేసిందని గుర్తు చేశారు. బీజేపీనే ఏపీ తరఫున వాదనలు వినిపించిందని చెప్పారు. ఏపీకి ఇచ్చిన హామీలను కేంద్రం పూర్తిస్థాయిలో నెరవేర్చిందని వెల్లడించారు. తెలుగుదేశానికి, ఏపీ ప్రజలకు బీజేపీనే నిజమైన మిత్రుడని పేర్కొన్నారు. ఏపీకి ఇచ్చిన కేంద్ర విద్యాసంస్థలు, ఎయిమ్స్, ఇతరత్రా అంశాలు, విభజన చట్టంలోని అంశాలను అమిత్‌షా లేఖలో ప్రస్తావించారు. మూడు ఎయిర్‌పోర్టులను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా మార్చినట్లు పేర్కొన్నారు. అమరావతిలో రైల్ రోడ్ నిర్మాణానికి, 180 కిలోమీటర్ల రింగ్‌రోడ్డుకు నిధుల విషయాన్ని ప్రస్తావించారు. కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు సూత్రప్రాయ అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు.

అమిత్‌షా లేఖ తప్పుల తడక

భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా రాసిన లేఖ పూర్తి అసత్యాలతో తప్పుల తడకగా ఉందని సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ లేఖ ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడు హోదాకి తగిన విధంగా లేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు, చేసిన చట్టాలను అమలు చేయమని రాష్ట్ర ప్రజలు ఆందోళన చేస్తుంటే దానిపై స్పందించకుండా ఎదురు దాడి చేసేలా యత్నించడాన్ని తప్పుబట్టారు. ఏపీకి ఏం చేశారో చెప్పకుండా, ఏ రాష్ట్రానికీ చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సాయం చేశామని అమిత్‌షా మళ్లీ పాత పాటే పాడారని ఎద్దేవా చేశారు.

- చాలా చేశాం కాదు, ఏం చేశారో చెప్పండి
- ఏపీకి కాంగ్రెస్ కంటే బీజేపీ చేసిన మోసమే ఎక్కువ
- తెలంగాణాలో ఎవరికి చెప్పి మాతో విడిపోయారు
- మిత్రధర్మానికి తూట్లు పొడిచిందెవరో ప్రజలకు తెలుసు
- హోదాతో సహా విభజనాంశాలన్నీ అమలు చేయాల్సిందే
- బీజేపీ వైఖరిపై అసెంబ్లీలో నిప్పులు చెరిగిన సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అమిత్‌షా లేఖలో పేర్కొన్నవన్నీ వక్రీకరణలేనని, ప్రతిచోటా ప్రభుత్వాన్ని తప్పుపట్టడానికే అమిత్‌షా ప్రయత్నించారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసన సభలో శనివారం అమిత్‌షా రాసిన లేఖపై తీవ్రంగా స్పందించారు. ఆ లేఖలోని ప్రతి అంశాన్ని ముఖ్యమంత్రి సభలో చదువుతూ గతంలో తాను రాసిన లేఖలో పేర్కొన్న విషయాలతో పోలుస్తూ కేంద్రాన్ని గట్టిగా నిలదీశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం చేసిందేమిటీ, ఎప్పుడైనా పట్టించుకున్నారా అని నిలదీశారు. ప్రత్యేక హోదా అడిగితే అందుకు సమానమైన నిధులు, సాయం చేస్తామంటూ అర్ధరాత్రి ప్రకటన చేశారని గుర్తు చేశారు. ప్రాధాన్యతా క్రమంలో అనేక అంశాలను పక్కదారి పట్టించేందుకే తెలివిగా ఈ లేఖ రాశారన్నారు. ప్రజల్ని మభ్యపెట్టేందుకే బీజేపీ ఈ విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఆర్థిక సంఘం ఇచ్చినవి కూడా కేంద్రమే ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటోందని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదాకు సమానంగా సాయం అందిస్తామని చెప్పడం వల్లే ప్రత్యేక సాయానికి ఒప్పుకున్నామన్నారు. ఆర్థికంగా బలోపేతంగా ఉంటే కేంద్రాన్ని నిధులు అడగాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కాంగ్రెస్ కంటే బీజేపీనే తమకు ఎక్కువ అన్యాయం చేసిందనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందని చంద్రబాబు గుర్తు చేశారు. హోదా విషయాన్ని తేల్చాల్సిందేన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో సమానంగా ఎదగాలంటే తమకు మరో పదేళ్లు పడుతుందని అన్నారు. చట్టంలో ఇచ్చిన హామీల నెరవేర్చే విషయంలో వాస్తవాలను ప్రజలకు చెప్పే ధైర్యం బీజేపీకి ఉందా అని సవాల్ విసిరారు. హోదా కలిగిన రాష్ట్రాలకు ఇచ్చిన పారిశ్రామిక రాయితీలు, ప్రభుత్వ పథకాలకు ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఇవ్వాలని డిమాండు చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు నిధులు విడుదల చేయాలని నీతిఆయోగ్ సిఫార్సు చేశాక కూడా మళ్లీ ఆ డబ్బులు వెనక్కి తీసుకోవడం బాధాకరమన్నారు. ఇలా ఇప్పటివరకు దేశ చరిత్రలో ఎక్కడా జరగలేదన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం అంటే కేంద్ర ప్రభుత్వానికి లెక్కలేదా అని ప్రశ్నించారు. హోదాతో సమానంగా ఇస్తామన్న ప్యాకేజీ ఏమైందని, చట్టంలో పెట్టిన అంశాలు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. తొలి రోజు నుంచీ ఏపీ పట్ల దురుద్దేశంతోనే ఉన్నారని, రాష్ట్రానికి మంచి చేయాలని ఒక్క రోజైనా కేంద్రం ఆలోచించలేదన్నారు. కేంద్రం మనకేదో ఉదారంగా ఇచ్చినట్లు చెబుతోంది. ప్రజలు కట్టిన పన్నుల్లోంచే రాష్ట్రానికి వాటా ఇస్తున్నారన్న విషయం గ్రహించాలన్నారు. ఆ విధంగా చూసినా ఏపీకి కేంద్రం అన్యాయం చేసిందన్నారు. ఏ రాష్ట్రానికి ఎంత నిధులిచ్చారో చర్చ జరిగితే అన్ని విషయాలు తేలతాయన్నారు. కేంద్ర విద్యాసంస్థలకు రూ.11,672 కోట్లు అవసరమైతే 576 కోట్లు ఇచ్చారని, ఇలా అయితే వచ్చే 30 ఏళ్లకైనా పూర్తవుతాయా అని ప్రశ్నించారు. కేంద్ర విద్యాసంస్థలకు రూ.11,584 కోట్ల విలువైన భూములు ఇచ్చామని ఈ సందర్భంగా బాబు గుర్తు చేశారు.

ఏపీ వైపో, కేంద్ర వైపో తేల్చుకోండి

విభజన చట్టం అమలు కోసం ఏపీలో ప్రజలంతా సమైక్యంగా పెద్దఎత్తున ఉద్యమిస్తున్నా కేంద్రం లెక్కచేయకుండా ఈశాన్య రాష్ట్రాలకు తాజాగా రూ.3 వేల కోట్లు నిధులు ప్రత్యేక సహాయం కింద విడుదల చేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర బీజేపీ నేతలు కేంద్రాన్ని నిలదీసి రాష్ట్ర ప్రజల వైపు నిలబడతారా లేక చరిత్రహీనులుగా మిగిలిపోతారా తేల్చుకోవాలని హెచ్చరించారు. గతంలో ఇలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజల మనోభావాలు లెక్క చేయకుండా వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తే కనీసం డిపాజిట్ కూడా రాని పరిస్థితిని గుర్తు చేసుకోవాలని, లేకుంటే మీకు కూడా ఆ శాస్తి తప్పదని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి మాట్లాడుతూ మిత్రధర్మం పాటించి చంద్రబాబు అనేక అవమానాలు భరించి నాలుగేళ్లు ఎదురుచూశారని, అయినా మార్పు లేకపోవడంతో రాష్ట్ర ప్రయోజనాల కోసం బైటకొచ్చారని చెప్పారు. విప్ కూన రవికుమార్ మాట్లాడుతూ అమిత్‌షా లేఖలో వాడిన పదజాలం ఏపీ ప్రజలను అవమానించేలా, అభ్యంతరకరంగా ఉందన్నారు.

మిత్రధర్మానికి దెబ్బకొట్టింది బీజేపీనే

ఎన్నికలకు ముందు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్నాం. కానీ తర్వాత తెలంగాణలో ఎవరిని అడిగి మాతో తెగదెంపులు చేసుకున్నారని చంద్రబాబు ప్రశ్నించారు. మిత్ర ధర్మాన్ని దెబ్బకొట్టింది బీజేపీయేనన్నారు. అలాగే మాది చిన్న పార్టీ అయినప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల కోసం సురేష్ ప్రభుకి రాజ్యసభ ఇచ్చి త్యాగం చేశామని గుర్తు చేశారు. అలాంటిది తాను మిత్రధర్మం విషయంలో తొందరపడ్డానని అమిత్‌షా అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో తొందరపడింది బీజేపీయేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విభజనాంశాలన్నీ తు.చ తప్పక అమలుకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు డిమాండు చేశారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు భయపడం

- రాజ్యాంగాన్ని గౌరవిస్తారా.. చరిత్ర హీనులవుతారా..?
- అమిత్‌షాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ బహిరంగ లేఖ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : భారత పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు చేస్తారా.. లేకుంటే చరిత్ర హీనులుగా నిలిచిపోతారా తేల్చుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాకు లేఖ రాశారు. దాని సారాంశం ఇలా ఉంది. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక వ్యవస్థగా పేరుగాంచిన భారతదేశంలో సాక్షాత్తూ పార్లమెంటులో చెప్పిన అంశాలు అమలుకు నోచుకోకపోవడం విచారకరం. ఇది ప్రజాస్వామిక విలువలకు గొడ్డలిపెట్టు. 2014 ఫిబ్రవరి 20న పార్లమెంటులో చెప్పిన అంశాలను అమలు చేయమని మేము కోరుతుండగా మీరు వాటి విషయం తప్ప మిగతావన్నింటి గురించి మాట్లాడుతున్నారు. ఆనాడు పార్లమెంటు సాక్షిగా నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఏపీకి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి నిధులు, పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం, రెవెన్యూ లోటు, ఆస్తి పంపకాలు, విభజన బిల్లులో పొందుపరచిన అంశాలను అమలు చేస్తామని ప్రకటించారు. పార్లమెంటులో ఏపీకి ఇచ్చిన హామీల అమలు తీరు గురించి మీరు మాట్లాడకుండా పదేపదే కప్పదాటు వైఖరి ప్రదర్శిస్తున్నారు. గత నాలుగేళ్లుగా మీరు రాష్ట్రానికి అన్యాయం చేసింది చాలక, మా మీద పెత్తనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పైగా యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇవ్వలేనందున నిధులు కేటాయించలేదని రాష్ట్ర ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నారు. యూసీలు ఇవ్వకపోవడానికి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించడానికి ఏం సంబంధమో రాష్ట్ర ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మీపై ఉంది. రాష్ట్రంలో అవినీతి జరుగుతుందంటూ బీజేపీ నాయకులు ఇప్పుడు మాట్లాడుతున్నారు. మీకు మిత్రపక్షంగా ఉంటే అవినీతి జరిగినా పరవాలేదా. నిజంగా అవినీతి జరుగుతుంటే ఇన్నాళ్లూ కేంద్ర ప్రభుత్వం కళ్లు మూసుకుని పాలన సాగిస్తోందా. అవినీతిపై చర్యలు తీసుకోకుండా కేంద్రాన్ని ఎవరు ఆపారు. దీనిని బట్టి మీరు బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారనేది స్పష్టంగా అర్థమవుతోంది. అవినీతి జరిగి ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నాం.

నాలుగు సంవత్సరాలుగా ప్రతి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయమే చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనానంతరం 2014 ఎన్నికలకు ముందు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఏపీకి 10 ఏళ్ళపాటు ప్రత్యేక హోదా ఇస్తామని పొందుపరిచారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మీ పార్టీ నేతలు మాటలు మారుస్తూ రోజుకో కొత్త ప్రకటన చేస్తూ కాలయాపన చేశారు. రాష్ట్ర ప్రజల నుండి తీవ్రమైన నిరసనలు వెల్లువెత్తగా ప్రత్యేక హోదా ఇవ్వలేమని చెప్పి ఏపీని నట్టేట ముంచారు. ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్నారు. మీరు ఇస్తామన్న ప్రత్యేక ప్యాకేజీ కూడా తగినన్ని నిధులు విడుదల చేయకుండా తాత్సార వైఖరి అవలంభించారు. ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేమన్న మీరే ప్రత్యేక హోదా కల్పించబడిన రాష్ట్రాలకు మరో 10 ఏళ్లు పొడిగించారు. ఇది కేంద్ర ప్రభుత్వ రెండు నాల్కల ధోరణికి అద్దం పడుతోంది. నాడు అర్థాంతరంగా విభజించబడిన ఆంధ్రప్రదేశ్‌ను మరింత అంధకారంలోకి నెట్టి తీరని ద్రోహం చేశారు.

రాష్ట్ర విభజన అనంతరం రెవెన్యూ లోటు రు.16 వేల కోట్లు ఉండగా, ఇప్పటికి కేంద్రం రు.3,979 కోట్లు మాత్రమే ఇచ్చింది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికిగాను రూ.24,350 కోట్లు అవసరమవ్వగా, కేంద్రం కేవలం జిల్లాకు ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున గత మూడేళ్లలో రూ.1,050 కోట్లు మాత్రమే విదిలించింది. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి 2019కల్లా పూర్తిచేస్తామని చెప్పారు. 2014-15 అంచనాల ప్రకారం రూ.54 వేల కోట్లు ఖర్చయ్యే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఇప్పటికి రూ.4,662 కోట్లు ఇచ్చింది. నిర్వాసితుల పునరావాసం కింద రూ.33 వేల కోట్లు చెల్లించాల్సి ఉండగా, కనీసం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. అరకొర నిధులతో 2019 కల్లా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తవ్వడం ఎలా సాధ్యమో మీరే చెప్పాలి. అన్నివిధాలా మెరుగైన అవకాశాలు ఉన్నప్పటికీ విశాఖ రైల్వే జోన్ ప్రకటించలేదు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం తీవ్రమైన ఉద్యమాలు సాగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో కేంద్ర విద్యాసంస్థలు ఏర్పాటుకు రు.11,670 కోట్ల నిధులు అవసరమవ్వగా, కేవలం రూ.520 కోట్లు మాత్రమే కేటాయించారు. అమరావతిలో రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.1,500 కోట్లు మాత్రమే విదిలించారు. ప్రకాశం జిల్లా రామాయపట్నంలో కొత్త సీపోర్టు, చెన్నై-వైజాగ్ కారిడార్, అనంతపురం జిల్లాను చేర్చి చెన్నై-బెంగళూరు కారిడార్ ఏర్పాటుపై ప్రాథమికమైన చర్యలు కూడా లేవు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తామన్న హామీలు అమలుకు నోచుకోలేదు. ఇలా ఏపీకి చెందవలసిన అన్ని హామీలను అటకెక్కించిన ఘనత బీజేపీకే దక్కుతుంది. పైగా ఇప్పుడు బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరలేపారు. ఇటువంటి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు భయపడి చేతులు ముడుచుకు కూర్చునే స్థితిలో ఆంధ్రులు లేరనే విషయాన్ని గమనంలో ఉంచుకోండి. ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి, పార్లమెంటు నిర్ణయాల పట్ల గౌరవం ఉంటే తక్షణమే ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించండి. విభజన బిల్లులో పొందుపరచిన అంశాల అమలుకు పూనుకోండి. లేని పక్షంలో బీజేపీ వారు చరిత్ర హీనులుగా మిగిలిపోవడం తథ్యమని రామకృష్ణ లేఖలో హెచ్చరించారు.

టీడీపీ గట్టిగా అడగదు... బీజేపీ ఇవ్వదు

త్వరలో వామపక్షాలతో భేటీ : పవన్



అమరావతి : బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖలోని అంశాలు దానికి ప్రతిగా చంద్రబాబు వివరణ ఇవ్వటం వంటి పరిణామాలను పరిశీలిస్తుంటే ప్రత్యేక హోదా ఈ రెండు పార్టీల వల్ల సాధ్యం కాదన్నది స్పష్టమైందని జనసేన అధిపతి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు

'అమిత్ షా లేఖ ద్వారా బీజేపీ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వదని తేలిపోయింది. రాష్ట్రానికి కోట్లాది సాయం ఇచ్చామని పాడినపాటే అమిత్ షా మళ్లీ పాడగా.. ఎప్పటిలాగే కేంద్రం మోసం చేసిందంటూ చంద్రబాబు చెబుతున్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు ఒకరిపై ఒకరు నిందలేసుకుంటున్నారు. ఇంకా ఎంత కాలం ఈ దాగుడు మూతలు, ప్రత్యేక హోదా కోసం టీడీపీ పోరాడదని, సాధించే స్థితిలో ఏ మాత్రం లేదని ప్రజలు అర్థం చేసుకున్నారు. విసిగిపోయిన ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టే పరిస్థితులను కల్పించకండి ' అని ఓ ప్రెస్ నోట్‌లో పవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటిదాకా అందిన నిధుల అధికారిక లెక్కలపై కమిటీ వేయటమో.. లేక జనసేన చొరవతో ఏర్పాటైన జాయింట్ ఫాక్ట్ ఫైండింగ్ కమిటీ అధ్యయనంలో వెల్లడైన విషయాలను పరిగణలోకి తీసుకుని కేంద్రాన్ని నిలదీయొచ్చుగా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని పవన్ సూటిగా ప్రశ్నించారు. బీజేపీ, తెలుగుదేశం పార్టీల కారణంగా ఏపీలో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితిపై త్వరలో వామపక్ష నాయకులతో జనసేన పార్టీ చర్చిస్తుందని.. ఆ తర్వాత ఏం చేయాలన్న దానిపై లోక్‌సత్తా జయప్రకాశ్ వంటి అనుభవజ్ఞులతో, మేధావులతో సమాలోచనలు జరుపుతామని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

రేపు శాసనసభకు సెలవు

విశాలాంధ్ర-అమరావతి : శాసనసభ, శాసనమండలికి సోమవారం సెలవు ప్రకటించారు. శ్రీరామనవమి సందర్భంగా సెలవు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించటంతో సోమవారం సభలకు సెలవు ప్రకటించినట్లు లెజిస్లేచర్ కార్యదర్శి ఎం.విజయరాజ్ తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు శాసనసభ, 10 గంటలకు మండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. 26న జరగాల్సిన శాసనసభ్యుల క్రీడోత్సవాలు కూడా వాయిదా పడ్డాయి.

సర్క్యులర్ నెంబరు 07ను రద్దు చేయాలి : ఆర్టీసీ ఈయూ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) సిబ్బంది తగ్గించేందుకు ఇచ్చిన సర్క్యులర్ నెంబరు 07ను తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధపడతామని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) నేతలు హెచ్చరించారు. నష్టాలకు కార్మికులు కారణం కాకపోయినప్పటికీ బస్సుల కుదింపు, సిబ్బంది తగ్గింపుతోనే నష్టాలను తగ్గించేందుకు సంస్థ కుట్రలు పన్నుతోందని నేతలు విమర్శించారు. ఈమేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు, కార్యదర్శి కె.పద్మాకర్, అదనపు కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, వర్కింగ్ ప్రసిడెంట్ ఎం హనుమంతరావు, చీఫ్ వైస్ ప్రసిడెంట్ పి సుబ్రహ్మణ్యరాజు శనివారం సంయుక్తంగా ప్రకటన చేశారు. కార్మికుల తగ్గింపు యోచన విరమించుకోవాలని ఇప్పటికే యాజమాన్యానికి లేఖ ఇచ్చామన్నారు. మొదటి దశ ఆందోళనలో భాగంగా ఈనెల 28వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 128 డిపోలు, నాలుగు జోన్ల వర్క్‌షాపుల వద్ద ధర్నాలు, నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) 2016లో అధికారంలోకి వచ్చిన సమయంలో ఆర్టీలో 59,372 మంది సిబ్బంది ఉండేవారని, ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నాటికి వీరి సంఖ్య 54,489కి చేరుకుందన్నారు. అలాగే 12,256 బస్సులకు గాను 11,756 బస్సులు ఉన్నాయని, తద్వారా 500 బస్సులు తగ్గిపోయినట్లు తెలిపారు. తాజాగా ఈనెల 20 సంస్థ జారీ చేసిన సర్క్యులర్ నెంబరు 07 ద్వారా 1910 మంది సిబ్బందిని తగ్గించేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. యాజమాన్యంతో ఎన్ఎంయూ చీకటి ఒప్పందం చేసుకోవడం ద్వారా ఎన్నికల్లో గెలవాలని చూస్తోందని ఈయూ నేతలు విమర్శించారు.

ఇద్దరు చంద్రుల రాజకీయ విన్యాసం: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హైదరాబాద్‌లో నిర్వహించబోయే సీపీఎం అఖిల భారత మహాసభల ప్రచారంలో బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్‌ల విధానాలను ఎక్కడికక్కడ ఎండగడతామని పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీర భద్రం అన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు కేసీఆర్, చంద్రబాబులు రాజకీయంగా పలు విన్యాసాలు చేస్తున్నారని విమర్శించారు. ఇద్దరి ఆర్థిక విధానాల్లో మార్పు లేదన్నారు. మహాసభలు వచ్చే నెల 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరగనున్న సంగతి విదితమే. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో తమ్మినేని మహాసభల పాటల సీడీని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మోడీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతోందని, నోట్లరద్దు, జీఎస్టీ, ధరల పెరుగుదల, మతోన్మాద చర్యలు, దళితులు, మైనారిటీలపై దాడులతో ప్రజలు విసిగిపోయారన్నారు. మొన్నటి వరకూ ఎన్డీఏతో పొత్తు పెట్టుకొన్న టీడీపీ బయటికొచ్చేసిందని తెలిపారు. పార్లమెంటులో మెజారిటీ ఉన్నప్పటికీ తాజా పరిణామాల దృష్ట్యా అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోడానికి బీజేపీ భయపడుతోందని అన్నారు. రాష్ట్రాల హక్కుల గురించి మాట్లాడుతున్న కేసీఆర్ రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల అధికారాలన్నింటినీ తన గుప్పెట్లో పెట్టు కున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య, టి.జ్యోతి, డీజీ నర్సింహారావు పాల్గొన్నారు.

టీడీపీ సెల్ఫ్‌గోల్
ఏపీ పార్టీలకు సత్తా లేదు : తలసాని

విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్ : ప్రత్యేక హోదాపై ఏపీలో రాజకీయ పార్టీలు పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ విషయంలో టీడీపీ సెల్ఫ్‌గోల్ చేసుకుంటుందని ఆరోపించారు. దిగజారుడు రాజకీయాలతో ప్రజలను పిచ్చివాళ్లుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యా నించారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎవరిని కలిశారు... ఎవరెవరిని కలుస్తారు అనేది టీడీపీకి ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఆ విషయాలపై టీడీపీ ఆరోపణలు దురదృష్టకరమన్నారు. శనివారం ఆయన అసెంబ్లీ వద్ద విలేకరులతో ఏపీ రాజకీయాలను ప్రస్తావించారు. అవిశ్వాస తీర్మానంతో ఏపీకి వచ్చే ప్రయోజనమేమీ లేదన్నారు. హోదా సాధనకు వివిధ రకాల వేదికలు ఉన్నాయన్నారు. రిజర్వేషన్ల కోసం టీఆర్ఎస్ చేస్తున్న పోరాటంలో న్యాయముందన్నారు. ఏపీ పార్టీలు టీఆర్ఎస్‌ను నిందించడం తగదన్నారు. 25 మంది ఏపీ ఎంపీలు మూకుమ్మడి రాజీనామాలు చేస్తే ఫలితం ఉంటుందని సలహా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామాల ద్వారానే ఒత్తిడి పెరిగిందని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని చూసైనా ఏపీ పార్టీలు నేర్చుకోవాలన్నారు. ప్రత్యేకహోదా సాధించడం చేతకాకపోతే ఆ సమస్యను ప్రజ లకు వదిలేయాలని ఏపీ పార్టీలకు తలసాని సూచించారు. తెలంగాణ ఉద్యమం దశల వారీగా జరిగిందని, తమ ఉద్యమాన్ని చూసి కూడా చంద్రబాబు ఏమి నేర్చుకోపోవడం విచారకరమన్నారు. ప్రత్యేక హోదాపై నాలుగేళ్లుగా కేంద్రంపై ఒత్తిడి పెంచకుండా చంద్రబాబు ఏమి చేశారని ప్రశ్నించారు.

సంపాదకీయం

కేవలం వాగాడంబరమే

"మంత్రాలకు చింతకాయలు రాలవు" అన్నట్లుగా కేవలం వాగాడంబరంతో ఆశించిన ఫలితాలు ఒనగూరవన్నది వాస్తవం. ఇటీవల జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) 84వ ప్లీనరీ సమావేశం వాగాడంబర ప్రదర్శన తప్ప మరొకటి కాదు. రాజకీయవేత్తగా మారిన క్రికెటర్ నవజ్యోత్‌సింగ్ సిద్ధూ తన టీవీ ప్రదర్శన నైపుణ్యతనంతా ఉపయోగించడం మాత్రమే కాదు, నూతనంగా ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పట్ల తమ విధేయత వ్యక్తపరచడానికి ఇతరులు కూడా పోటీపడ్డారు. ఇది వ్యక్తి ఆరాధన తప్ప మరొకటి అనిపించుకోదు. కాంగ్రెస్ అధ్యక్ష పదవిని తనకు కట్టబెట్టిన తన తల్లి సోనియా గాంధీని రాహుల్ ఆకాశానికెత్తేశారు. యువతరం శక్తితో పార్టీని పటిష్టపరిచే సమయంలో వారి అనుభవాలను ఉపయోగించు కొంటానని చెప్పడం ద్వారా కాంగ్రెస్‌లోని పెద్దలను సంతృప్తిపరచడానికి రాహుల్ ప్రయత్నించారు. అంతకు మించి ఏమీ లేదు. ప్రతిపక్షంలో వున్న పెద్ద బూర్జువా పార్టీ అనుసరించబోయే ఆర్థిక విధానా లను రేఖామాత్రంగానైనా స్పష్టీకరించడంలో విఫలమైన ఏఐసీసీ మొదటి ప్లీనరీ సమావేశం ఇదే. నయా-ఉదారవాద విధానాలను నిసిగ్గుగా రుద్దడం ద్వారా ఆర్థిక ఇబ్బందులతో దుస్థితిలో వున్న ప్రజల ఆశలు ఆకాంక్షలను తీర్చాలని నిజంగా కోరుకున్నట్లయితే ఆత్మపరిశీలన చేసుకొని, తన గమనాన్ని దిద్దుబాటు చేసుకోవ లసిన అవసరం వుంది. ఆర్థిక సంస్కరణల ముసుగులో ప్రపంచీకరణ, ప్రయివేటీ కరణ, సరళీకరణగా పిలువబడే నయా-ఉదారవాదాన్ని పీవీ నరసింహరావు, డా॥ మన్మోహన్‌సింగ్ నాయకత్వంలో కాంగ్రెస్ ఆచరించినందువల్ల ఇప్పుడు ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరం... బాధ్యత తప్పకుండా వుందన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అప్పటి నుండి కొన్ని పరిమితులతోనైనా కేంద్రంలో అధికా రంలో వున్న ప్రభుత్వాలన్నీ నయా-ఉదారవాద విధానాలనే అనుసరిస్తూ వచ్చాయి. నయా-ఉదారవాద శేష అజెండాను సంపూర్ణంగా విధించడాన్ని పూర్తి చేసే కర్తవ్యాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపట్టింది. వాస్తవంగా, దీనికోసం కార్పొరేట్ పెట్టుబడి ద్వారా మోడీ సర్కారు కథ నడిపింది. గత నాలుగేళ్లలో తనకు అప్పగించిన కర్తవ్యాన్ని పూర్తి చేయడానికి అది చేయవలసిందంతా చేసింది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ నిశ్చలత్వంలో వుంది. గత ఏడు దశాబ్దాల్లో నిర్మించుకున్న ప్రతి వ్యవస్థను నాశనం చేయడానికి సకల ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వరంగం నిర్వీర్యం చేయబడుతున్నది. బ్యాంకులు దివాలాటంచులకు చేరాయి. ఆర్థిక వ్యవస్థలోని కీలకరంగాలన్నీ విదేశీ పెట్టుబడికి అప్పగించబడుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఆర్థిక భారంతో తీవ్ర ఇబ్బందులతో ప్రజలు బాధపడుతున్నారు. వీధుల్లోకి వచ్చి నిరసన తెలుపని జనాభాలోని ఏ వర్గమూ లేదంటే అతిశయోక్తికాదు. వివిధ రాష్ట్రాల్లో ఐక్య లాంగ్‌మార్చ్‌లు, ధర్నాలు, ఇతర నిరసన చర్యలు నిర్వహించడం ద్వారా అన్నదాతలైన రైతులు చరిత్ర సృష్టిస్తున్నారు. కేవలం రుణాలరద్దు మాత్రమే వారి డిమాండు చేయడం లేదు. తమ ఉత్పత్తులకు గిట్టుబాటుధరలు కల్పించాలని కోరుతున్నారు. వారిలో ఆదివాసీలు తాము ఉపయోగించుకొంటున్న, తరతరాలుగా సేద్యం చేసుకొంటున్న భూమిపై హక్కులకు హామీ కల్పించిన అటవీ చట్టాన్ని తుచ తప్పకుండా అమలు చేయాలని డిమాండు చేస్తున్నారు. పెరుగుతున్న నిరుద్యోగ సమస్య యువతలో ఆగ్రహాన్ని రగిల్చింది. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాల వాగ్దానం నెరవేర్చడానికి బదులు ప్రభుత్వం ఖాళీగా వున్న పోస్టుల రిక్రూట్‌మెంట్ నిషేధించబడం ద్వారా వాస్తవంగా ఉద్యోగాలను కుదిస్తోంది. విద్యా వ్యవస్థను ప్రయివేటీకరించి, వాణిజ్యీకరణ చేయడం ద్వారా సామాన్య ప్రజలకు విద్య అందుబాటులో లేకుండా చేసింది. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ ప్రయివేటీకరణ ఒక వ్యాపారంగా మారిపోయింది. మైనారిటీలు, దళితులు, ఇతర బలహీనవర్గాలపై దాడులు నిత్యం జరుగుతూనే వున్నాయి. ఏఐసీసీ సమావేశంలో ఎట్టి నిర్దిష్ట ప్రతిపాదన లేకుండా ఈ అంశాలన్నీ లేవనెత్తబడ్డాయి. పెద్దనోట్ల రద్దు, తొందరపాటుతో వస్తుసేవల పన్ను (జీఎస్టీ) అమలు వంటి వినాశకర నిర్ణయంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి డా॥ మన్మోహన్‌సింగ్, తదితరులు మాట్లాడారు. అయితే ఇది స్వయంగా కాంగ్రెస్ అనుసరించిన ఆర్థిక విధాన గమనం సహజ ఫలితమన్న విషయాన్ని ప్లీనరీ సమావేశం గమనంలోకి తీసుకోకపోవడం దురదృష్టకరం. ప్రపంచ వ్యాపితంగా తన రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని విధించ డానికి అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ముందుకు తీసుకువచ్చిన నయా ఉదారవాదం ఒక్కటే అభివృద్ధికి మార్గమని నమ్మబలకడం కారణంగా జరిగిన వినాశనాన్ని పరిశీలించడానికి జాతీయ, ప్రాంతీయ బూర్జువా రాజకీయ పార్టీలు ఇప్పటికే సిద్ధంగా లేవన్న వాస్తవం మిగిలేవుంది. ద్రవ్య పెట్టుబడి ప్రచారకులు ప్రతిపాదించిన నూతన ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీ పద్ధతుల ద్వారా పరిష్కారం కానంత తీవ్రంగా కొన్ని దశాబ్దాలలోనే ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. ఈ విషయాన్ని కూడా గమనంలోకి తీసుకోవడంలో ఏఐసీసీ ప్లీనరీ విఫలమైంది. 2019 పార్లమెంటు ఎన్నికలపై చర్చకు వేదికగా మాత్రమే ప్లీనరీ మారింది. అయితే, ఆర్థిక రంగానికి సంబంధించి కొన్ని నిర్దిష్టమైన ప్రతిపాదనలు చేయకుండా ప్రజల మనోభావాల్లో మార్పు తీసుకురాగలమని కాంగ్రెస్ భావిస్తే అది అత్యాశే అవుతుందని ఆపార్టీ గుర్తెరగాలి. కనీసం, నిరుద్యోగిత, విద్య, ప్రభుత్వ ఆరోగ్యం, వ్యవసాయ సంక్షోభం, నిరంతరాయంగా పెరుగుతున్న ధరలను అదుపు చేయడానికి సంబంధించిన ప్రశ్నలకు ఆ పార్టీ సమాధానం చెప్పాలి. ఆ పని చేయకుండా, లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల విశాల ఐక్యతకు తమ పార్టీ సిద్ధమని ప్రకటించినప్పటికీ, మిత్రపక్షాలను కూడగట్టడంలో ఇబ్బంది ఎదుర్కోవలసి వస్తుందని గ్రహించి, గతంలో అనుసరించిన విధానాలను త్యజించి ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్‌పార్టీ చూరగొనవలసి వుంటుంది.

చురక

ఆమ్ ఆద్మీ ఎమ్మెల్యేల
అనర్హత వేటు రద్దు
సత్యమై విచ్చుకుంది
కోర్టులోన తీర్పు పొద్దు

బీజేపీ ప్రజాస్వామ్య
భజనలు చేస్తున్నది
కక్షలతో రాజకీయ
కత్తులు దూస్తున్నది

- వేల్పుల నారాయణ

భవిష్యత్తు సౌరశక్తిదే
భాగం 8

పరిశ్రమల్లో సౌర ఉష్ణ శక్తి



మర్ల విజయ కుమార్

ప్రపంచవ్యాప్తంగా, పారిశ్రామిక అవసరాలకు వాడే బొగ్గు, పెట్రోలియమ్ ఉత్పత్తులు, విద్యుత్ శక్తిలో సగానికి సగం ఉత్పత్తి క్రమంలో, నీటిని, గాలిని, ఇతర పదార్థాలను వేడి చేయటానికి గాని, లేదా చల్లబరచటానికి వాడుతున్నారు. దాదాపుగా ప్రపంచ శక్తివినియోగంలో పరిశ్రమల అవసరాలు మూడవ వంతుగా ఉన్నాయి. సాధారణంగా అనేక పరిశ్రమల్లో వేడినీరు అవసరం ఉంటుంది. ముఖ్యంగా ఫుడ్ ప్రాసెస్సింగ్ పరిశ్రమలలో వేడి నీటికి, ఉత్పత్తులను ఆరబెట్టటానికి, వేడి అవసమరవుతుంది. ఇందుకోసం డీజల్ ను గాని, విద్యుత్తును గాని సాధారణంగా వాడుతుంటారు. కొన్ని పరిశ్రమల్లో బాయిలర్లలో కట్టెలను గాని, బొగ్గును గాని కాల్చి, వేడినీటిని ఉత్పత్తి చేయటం జరుగుతున్నది. ఉదాహరణకు వేడిగాలి 70-80 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద, వేడినీరు 80-120 డిగ్రీల సెంటిగ్రేడ్ మధ్యన సాధారణంగా అనేక పరిశ్రమల్లో వాడటం జరుగుతుంటుంది. రిఫ్రీజిరేషన్ కు విద్యుత్తు పెద్ద స్థాయిలో వాడవలసి వస్తుంది. ఫ్యాక్టరీల పైకప్పుపై ప్రసరించే సూర్యకాంతిని ఉపయోగించుకుని, ఈ వేడి గాలి, నీటి అవసరాలను గాని తీర్చగలిగితే, మనం మన పెట్రోలియమ్ ఉత్పత్తుల, విద్యుత్తు వినియోగాన్ని గణనీయంగా తగ్గించగలుగుతాము. తద్వారా వేలకోట్ల రూపాయల పెట్రోలియమ్, బొగ్గు దిగుమతులను తగ్గించటానికి సాధ్యపడుతుంది. సూర్య కాంతిలో అధికభాగం శక్తి వేడిమి రూపంలో ఉంటుందని మనం ఇంతకు ముందు చర్చించుకున్నాము. ఒక చదరపు మీటరు వైశాల్యంలో లభించే ఫొటో వోల్టాయిక్ శక్తి కన్నా, సోలార్ ఉష్ణ శక్తి మూడు రెట్లు ఎక్కువ లభిస్తుంది. ఎందుకంటే, పి.వి. సెల్స్ సామర్థ్యం 15 శాతానికి మించి ఉండదు. పైగా, మన ఉపయోగంలోకి వచ్చేసరికి మరొక 1 - 2 శాతం శక్తి వృధా అయిపోతుంది. కాని ఉష్ణ శక్తిని గాని ఉపయోగించుకుంటే, అదే సోలార్ ప్యానెళ్ళ వైశాల్యంలో మనకు 50 శాతం కంటే హెచ్చు సామర్థ్యంతో, మూడురెట్ల శక్తి అందుబాటులో ఉంటుంది. థెర్మోడైనమిక్స్ సూత్రం ప్రకారం, శక్తిని ఒక రూపం నుండి మరొక రూపంలోకి మార్చే ప్రక్రియలో, అంటే విద్యుత్తును వేడిగాను, లేదా వేడిని విద్యుత్తుగాను మార్చే ప్రక్రియలో చాలా శక్తి నిరుపయోగమవుతుంది. ఆకారణంచేత, సూర్యుని నుండి లభించే ఉష్ణ శక్తిని నేరుగా ఉపయోగిస్తే, మనకు హెచ్చు స్థాయి శక్తి చవుకగా లభించటమే కాకుండా, పర్యావరణానికి ఎంతో మేలు చేసినవాళ్ళమవుతాము. శక్తి వృధాకాకుండా నివారించగలుగుతాము.

సర్వసాధారణంగా ఇంటి డాబాలపై సోలార్ హీటర్లు పెట్టి, స్నానికి వేడినీళ్ళ ఏర్పాటు చేసుకుంటారు. నీరు 55 డిగ్రీలకు వేడిచేయటానికి ఎలక్ట్రిక్ హీటరు గాని వాడితే, బకెట్ నీళ్ళకి 1.2 యూనిట్ల విద్యుత్తు అవసరమవుతుంది. ఇంటిలో నలుగురు మనుషలు ఉంటే, మనకు రోజుకు 5 యూనిట్ల వరకూ స్నానాలకు ఖర్చు అవుతుంది. ఈ ఖర్చు నెలకు 1000 రూపాయల వరకూ ఉండవచ్చును. అదే సోలార్ హీటరుతో 55 డిగ్రీలవరకూ వేడి నీరు తయారయి, విద్యుత్తు ఖర్చును ఆదా చేయయగలదు. ఈవిధమైన సోలార్ హీటర్లను ఫ్లాట్ ప్లేట్ కలక్టర్లుగా వ్యవహరిస్తారు. కాని పరిశ్రమలలో వాడే వేడి నీరు 60 డిగ్రీల నుండి, 160 డిగ్రీల వేడిమి వరకూ అవసరమవుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా వేక్యూమ్ ట్యూబ్ కలక్టర్లను ఉపయోగిస్తారు. ఇవి వరుసగా అమర్చిన ట్యూబ్ లైట్లలాగా ఉంటాయి. దాదాపు 80 శాతం సామర్థ్యంతో 120 డిగ్రీలవరకూ వేడి నీటిని ఇవి సరఫరా చేయగలవు. ఉదాహరణకు 20000 చదరపు అడుగుల వైశాల్యం కలిగిన వేక్యూమ్ ట్యూబ్ కలెక్టర్లతో మనకు గంటకు 1300 విద్యుత్ యూనిట్ల శక్తికి సమానమైన వేడినీరు లభించగలదు. ఇవి ఎక్కువ బరువు ఉండవు కావున, ఫ్యాక్టరీ చూరుపైన అమర్చవచ్చును. అయితే, ఇవి గాజుతో తయారవుతాయి కనుక అతినాజూకైనవి. పొరపాటున రాయి పడినా, ఆ ట్యూబుకు బదులుగా కొత్త ట్యూబును అమర్చవలసి ఉంటుంది. వీటిపై ఇనుప లేదా అల్యూమినియమ్ జాలీగాని వాడితే, వాటి ఉత్పత్తి తగ్గిపోతుంది. ఆకారణంచేత మనం స్పేరు ట్యూబులను ఉంచుకోవలసి వస్తుంది. కాని ఈ ట్యూబు కలెక్టర్లు సమర్థవంతంగా 30 ఏళ్ళకు పైగా పనిచేయగలవు. ప్రతి చదరపు మీటరు వైశాల్యానికి ఈ ట్యూబు కలక్టర్లు సూర్యకాంతి ప్రసరించే సమయంలో గంటకు 0.7 యూనిట్ల ఉష్ణ శక్తిని ఇవ్వగలవు. పైగా, ఫోటో వోల్టాయిక్ ప్యానెళ్ళ ఉత్పత్తి ఆకాశం మేఘావృతమైనప్పుడు 80 శాతానికి పైగా తగ్గిపోతుంది. కాని ట్యూబు కలక్టర్లలో భారీ వర్షపు రోజులలో తప్ప, మిగతా మేఘావృతమైన దినాలలో కూడా 50 శాతం వరకూ వేడిమిని ఉత్పత్తి చేయగలవు. ఎందుకంటే, సూర్యకిరణాల్లో వెలుతురేకాక, ఇతర ఫ్రీక్వెన్సీలలో లభించే రేడియేషన్ లో 70 శాతం వరకూ శక్తి లభిస్తుంది. పైగా, ఈ ఫ్రీక్వెన్సీలను మేఘాలు ఆపలేవు. మామూలు ఫొటో వోల్టాయిక్ ప్యానెళ్ళు సంవత్సరం లోని 365 రోజులలో, 300 రోజులు మాత్రమే విద్యుత్తు ఉత్పత్తిని చేయగలవు. మిగతా 65 దినాలను వర్షపు, మేఘావృతమైన రోజులుగా లెక్కవేస్తారు. ఎడారి ప్రాంతాలలో మరికొన్ని ఎక్కువరోజులు ఉత్పత్తి జరగవచ్చును. కాని ట్యూబు కలెక్టర్లతో ఏడాదికి 330 రోజులకు పైగా ఉష్ణ శక్తి లభిస్తుంది. ఎండ పడే 8 గంటలలో అది సరఫరా చేసిన వేడినీటిని ఇన్సులేషన్ అమర్చిన, స్టైన్ లెస్ స్టీల్ టాంకులలో నిల్వ ఉంచితే, రోజుకు రెండు షిఫ్టులలో ఫ్యాక్టరీ అవసరాలకు వాడుకొనవచ్చును.

ఈవిధంగా ఆయిల్, విద్యుత్తు పై చేసే లక్షల రూపాయల ఖర్చును ఆదా చేయగలుగుతాము. అట్లాగే టాంకులోని వేడి నీరును సూర్యరశ్మి లభించని వర్షపు దినాలలో కూడా వాడుకొనవచ్చును. మనదేశంలో అనేక పరిశ్రమలలో విద్యుత్తు కొరత కారణంగా ఉత్పత్తి తగ్గిపోతుంటుంది. ముఖ్యంగా ఎండా కాలంలో ఎక్కువ ఉత్పత్తి చేయవలసిన ఫ్రూట్ జ్యూస్ కంపెనీలు, విద్యుత్తు సరఫరా లేక ఉత్పత్తిని తగ్గించుకుని, నష్టపోతుంటాయి. ఈ సోలార్ హీటర్లతో, కరెంటు సప్లై ఉన్నా లేకపోయినా పూర్తిస్థాయి ఉత్పత్తి సాధ్యపడుతుంది. ఫ్యాక్టరీ నడపడంకోసం హీటర్లకు డీజల్ జనరేటర్ నుగాని వాడితే, యూనిట్‌కు 15-20 రూపాయల పైగా ఖర్చుఅయి, తడిసి



పరావలయ కలెక్టర్



ఫ్లాట్ ప్లేట్ కలెక్టర్



వాక్యూమ్ ట్యూబ్ కలెక్టర్

మోపెడు అవుతుంది. ఈవిధంగా సౌర ఉష్ణశక్తి వాడితే లక్షల రూపాయల కరెంటు బిల్లే కాక, డీజల్ ఖర్చు కూడా ఆదా అవుతుంది. దాదాపు రెండు, మూడేళ్ళలో మనకు పెట్టిన ఖర్చు తిరిగి వస్తుంది. ఆ తరువాత, కరెంటు, డీజల్ ఖర్చు ఆదా కావటంతో, వ్యాపారం లాభసాటి కాగలదు. అయితే, కొన్ని పరిశ్రమలలో అధిక వత్తిడితో 300 డిగ్రీల వరకూ వేడినీరు పెద్ద మొత్తంలో అవసరముంటుంది. అటువంటి పరిశ్రమలకు వేక్యూమ్ ట్యూబ్ కలక్టర్ లు సరిపోవు. దానికోసం పరావలయ కలక్టర్లు వాడవలసి ఉంటుంది. దాదాపు 360 డిగ్రీలవకూ ఉష్ణోగ్రతలను ఈ కలక్టర్లతో పొందవచ్చును. వేల మందికి వంటవండే కిచెన్లు, ఫుడ్ ప్రాసెస్సింగ్, లోహ పరిశ్రమలకు ఈ ఏర్పాటు అవసరమవుతుంది. కలెక్టర్లలో గ్లైకాల్ తో కలిపిన డిస్టిల్డ్ వాటరును వాడటంద్వారా, మనకు లభించే వేడి నీటిని, పరిశ్రమ వాడకానికి ఉపయోగించే నీటిని వేడి చేయటానికి హీట్ ఎక్స్చేంజర్లను ఉపయోగిస్తారు. ఉదాహరణకు వేక్యూమ్ ట్యూబ్ కలక్టర్ లో 100 డిగ్రీల వేడి నీరు తయారయితే, మన వాడకానికి 80 డిగ్రీల వేడిమి మాత్రమే లభిస్తుంది. స్టోరేజి టాంకులో రోజుకు 3-5 శాతం ఉష్ణ శక్తి వృధాకావచ్చును. వెరసి, మనకు దాదాపు కలెక్టర్లపై ప్రసరించే సూర్య రశ్మిలో 50 శాతం వరకూ వాడకానికి లభిస్తుంది. ఫొటో వోల్టాయిక్ కలెక్టర్లతో పోలిస్తే, ఇది 5 రెట్లు ఎక్కువ. ఫోటో వోల్టాయిక్ కలెక్టర్‌ల కంటే ఈ వేక్యూమ్ ట్యూబ్ కలెక్టర్ల, పరావలయ కలెక్టర్ల ధరలు ఎక్కువైనా, మూడు నాలుగేళ్ళలో మనకు పెట్టుబడి తిరిగి వస్తుంది. అదే ఫొటో వోల్టాయిక్ కలెక్టర్లకు పెట్టే పెట్టుబడి తిరిగి రావటానికి 7-8 సంవత్సరాలు పట్టవచ్చును. 20 సంవత్సరాల వాడకంలో వచ్చే రాబడిని గాని లెక్కవేస్తే, సోలార్ ఉష్ణశక్తి పరికరాలు అనేక రెట్లు లాభదాయకమవుతాయి. బొగ్గు ఆధారిత ఉష్ణ విద్యుత్ కేంద్రాలలో బాయిలర్లకు చల్లని నీటిని, కండెన్సర్ నుండి వచ్చే నీటికి అదనంగా ఇవ్వవలసి ఉంటుంది. అంటే, ఆ పవర్ ప్లాంటులో వాడే బాయిలర్ నీటిలో దాదాపు 10 శాతం కొత్తనీటిని 40 డిగ్రీల వేడిమితో సప్లై చేయబడుతుంది. కాని ఆ నీటిని గాని పరావలయ సోలార్ కలెక్టర్లు ఉపయోగించి వేడిచేసి, బాయిలర్ కు పంపితే, బొగ్గు ఖర్చును గణనీయంగా తగ్గించగలుగుతాము. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో లభించే సౌర శక్తిలో తేడాలు ఉంటాయిగాని, ఆయా ప్రాంతాన్ని బట్టి మనకు 500 నుండి 1100 ఉష్ణ శక్తి యూనిట్లు ప్రతీ మీటరు వైశాల్యం గలిగిన కలెక్టర్లకు ఒక ఏడాదిలో లభిస్తుంది. ఉదాహరణకు ఒక ప్రదేశంలో 1900 చదరపు మీటర్ల వైశాల్యం గలిగిన పరావలయ కలెక్టర్లు రోజుకు 900 కిలోవాట్ల ఉష్ణ శక్తిని 250 డిగ్రీల కంటే ఎక్కు స్థాయిలో వేడిమిని అందించగలవు. ఈవిధంగా లభించిన వేడినీటిని పరిశ్రమల ఉష్ణ శక్తి అవసరాలు తీర్చటానికి వినియోగించుకోవచ్చును. 2000 చదరపు మీటర్ల వైశాల్యం సాధారణంగా ఫ్యాక్టరీ బిల్డింగ్ పైన గాని, పరిసరాలలోని ఖాళీ ప్రదేశంలో గాని లభిస్తుంది. ఈవిధంగా రోజుకు 60,000 రూపాయలకు పైగా కరెంటు ఖర్చును ఆదా చేయటానికి వీలుపడుతుంది. ఈవిధంగా పర్యావరణానికి మేలు చేయటమే కాకుండా, సూర్య రశ్మిలోని వేడిమిని లాభదాయకంగా వినియోగించుకోగలుగుతాము.

పరిశ్రమలలో వేడి గాలి కూడా అవసరమవుతుంది. ముఖ్యంగా ఫుడ్ ప్రోడక్ట్స్ లో పండ్లను, ఇతర రెడీ టు ఈట్ ఆహార పదార్థాలను తయారుచేయటానికి ఈ వేడిగాలిని విరివిగా వినియోగిస్తారు. నీటిని వేడిచేయటం కంటే గాలిని వేడి చేయటం సులువైన పని. పైగా, వేడిని ఒక మాధ్యమం నుండి మరొక మాధ్యమానికి మార్చవలసిన అవసరం లేకపోవటంతో, కలెక్టర్లలో వేడెక్కిన గాలిని నేరుగా వినియోగించుకోవచ్చును. ఆకారణం చేత వేడిగాలి తయారీలో సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. గ్రామాలలో మిరపలు, ధాన్యాలు తదితర వ్యవసాయోత్పత్తులను ఎండలో ఆరబెట్టటం వలన, దుమ్ము ధూళి చేరటం, పురుగులు పట్టటం, పక్షుల బెడద ఉంటాయి. అదే సోలార్ ఎయిర్ డ్రయ్యర్‌లతో 70-80 డిగ్రీలవద్ద వేడి గాలిని వినియోగిస్తే త్వరగా ఈ వ్యవసాయోత్పత్తులను మార్కెట్టుకు రైతు తరలించగలుగుతాడు. అదేవిధంగా పండ్లు, గింజలు తదితర వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ ఉంచటానికి వీలుగా వాటిని ఆరబెట్టటం, లేదా డ్రై ఫ్రూట్స్‌గా మార్చటం ద్వారా వాటి ఉపయోగాన్ని ఏడాది పొడవునా పొడిగించటం చేయగలుగుతాము. ఇటువంటి డ్రయ్యర్లను గ్రామీణ ప్రాంతాల లోనే నిరుద్యోగ యువకులు తయారు చేయవచ్చును.. ఇందుకు విద్యుత్తును వాడితే ఖర్చు చాలా ఎక్కువ అవుతుంది. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలను పెంపొందించటమే కాకుండా, రైతుల ఆదాయాలను ఇనుమడింపచేయటానికి ఈ విధమైన పునరుత్పాదక శక్తిని వినియోగించే పరికరాలను ప్రవేశపెట్టటం ద్వారా, డీజల్, విద్యుత్తుపై అయ్యే వ్యవసాయ ఖర్చులను ఆదా చేయగలుగుతాము. అంతకు ముందు వివరించినట్లుగా, సోలార్ ఫొటో వోల్టాయిక్ ప్యానెళ్ళకంటే, పవన శక్తిని నేరుగా ఉపయోగించి, నీటి పంపులను నడపటంద్వారా తక్కువ ఖర్చులో పంపులు ఏర్పాటు కావటమే కాకుండా, గ్రామీణ యువకులే ఈ పంపులను తయారుచేసి అమర్చ గలుగుతారు.

గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా అంతంత మాత్రమే. ముఖ్యంగా వ్యవసాయానికి పగటిపూట విద్యుత్ సరఫరా ఉండదు. అర్ధరాత్రి ఎప్పుడో ఒకటి, రెండు గంటలపాటు లభించే విద్యుత్తు కోసం రాత్రి అంతా రైతు పొలంలో జాగారం చేయాలి. పైగా లో వోల్టేజ్ సమస్యతో పంపుసెట్లు కాలిపోతుంటాయి. ఇందుకు పరిష్కారం పునరుద్పాదక వనరులను వ్యవసాయంలో విరివిగా ఉపయోగించుకోవటమే. రైతుకు ఈ పరికరాలను అమర్చుకునేందుకు బ్యాంకులు సహాయం అందజేయవలసి ఉండగా, గ్రామీణ అవసరాలను నిర్లక్ష్యం చేసి, బ్యాంకులు బడా పెట్టుబడి దారులకు నిరర్థక అప్పులుగా ధారపోస్తున్నాయి. గ్రామీణ యువతకు పునరుత్పాదక శక్తిని వినియోగించుకునే పరికరాల తయారీకి తరఫీదు నిచ్చి, వారు చిన్న చిన్న వ్యాపారాలు గ్రామీణ ప్రాంతాలలోనే నెలకొల్పుకునేటట్లుగా చేయటం ద్వారా మాత్రమే మనం నిరుద్యోగ సమస్యకు కొంతలో కొంత పరిష్కారం చూపగలుగుతాము. పైగా, ఈ విధమైన పరిష్కారాల మూలంగా విలువైన పెట్రోలియమ్, బొగ్గు వనరులపై ఆధారపడటాన్ని తగ్గించగలిగితే, పర్యావరణానికే గాక, దేశ ఆర్థిక వ్యవస్థపై పెనుభారాన్ని తగ్గించినవాళ్ళమవుతాము. అంతకు ముందు వివరించినట్లుగా, సోలార్ ఫొటో వోల్టాయిక్ ప్యానెళ్ళకంటే, పవన శక్తిని నేరుగా ఉపయోగించి, నీటి పంపులను నడపటంద్వారా తక్కువఖర్చులో పంపులు ఏర్పాటు కావటమే కాకుండా, ఆ గ్రామీణ యువకులే ఈ పంపులను తయారుచేసి అమర్చ గలుగుతారు.

ప్రపంచంలో తయారయ్యే సోలార్ కలెక్టర్లలో 80 శాతం చైనాలోనే తయారవుతున్నాయి. ప్రపంచంలో అత్యధిక స్థాయిలో సౌర ఉష్ణ శక్తిని వాడకంలోకి తెచ్చినదికూడా చైనాలోనే. వచ్చే 10, 15 ఏళ్ళలో చైనా, యూరప్‌లోని అనేక దేశాలు తమ శక్తి వినియోగంలో 50 శాతానికి పైగా సౌరశక్తి ఆధారితమయ్యేటట్లుగా చర్యలు తీసుకుంటున్నారు. ఉష్ణ శక్తిని చిన్న, మధ్యతరహా పరిశ్రమలలో వినియోగించుకోవటం ద్వారా, గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ గ్రిడ్ పై భారం మోపకుండా, లాభదాయకంగా ఆ పరిశ్రమల శక్తి అవసరాలను తీర్చగలుగుతాము. భవిష్యత్తులో ఇటువంటి టెక్నాలజీలు బహుళ ప్రాచుర్యంలోకి వస్తాయనటంలో ఏవిధమైన సందేహం లేదు.

(9వ భాగం వచ్చేఆదివారం)

- వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు. సెల్ : 09848933545

'దు:ఖదేశం'గా భారత్

జ్ఞాన్ పాథక్

ఏ ఏడాదికా ఏడాది భారతీయులు సంతోషాన్ని కోల్పోతున్నారు. ఐక్య రాజ్యసమితి ప్రతి ఏటా నిర్వహించే ప్రపంచ ఆనంద సర్వేల్లో భారతీయుల్లో నైరాశ్యం అధికంగా ఉందని, దేశప్రజలు ఆనందాన్ని కోల్పోతు న్నారని తేలింది. 2018లో జరిగిన సర్వే అధారంగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2017కిగాను 0-10 స్కేలుపై భారత్ స్కోరు 4.190. పాస్‌మార్క్ 3.3కన్నా కాస్త మెరుగైన ఫలితాన్ని భారత్ దక్కించుకుంది. ఈ క్రమంలో భారత్ ర్యాంకు పడిపోతోంది. 2016లో నాలుగు స్థానాలు దిగజారిన భారత్ 2017లో ఏకంగా 11 ర్యాంకులు కిందకు పడిపోయింది. మొత్తం 156 దేశాల్లో సర్వే నిర్వహిస్తే భారత్ కన్నా వెనుకంజలో ఉన్నది కేవలం 23 దేశాలు కావడం గమనార్హం. ప్రజల్లో నిరాశ, నిస్పృహ, ప్రశాంతత లేమి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని నిర్వహించిన ఈ సర్వేలో భారత్‌కు 133వ స్థానం దక్కింది. అంటే దాదాపు 86.61 శాతం దేశాలు మనకన్నా ఆనందంగానూ ఉల్లాసంగానూ ఉన్నాయన్న మాట.

2008 నుంచి 2010 వరకు చూస్తే భారత్‌లో సంతోష స్థాయి దిగజారుతూ వచ్చింది. 2015-17లో అది మరింతగా 0.698 పాయింట్లకు పడిపోయింది. నాడు 141 దేశాల్లో సర్వే నిర్వహించగా భారత్ 128వ స్థానంలో ఉంది. కానీ నేడు మరింత నైరాశ్యాన్ని మూటగట్టుకొని 133వ ర్యాంకుకు పడిపోయింది. ఆర్థిక, రాజకీయ, సామాజిక రుగ్మతల కారణంగానే కాకుండా పేట్రేగిపోతున్న నేరాలు, ఘోరాలు, ఘర్షణలు, ఆత్మహత్యలు, ఒత్తిళ్లు వంటి వాటిని బట్టి భారతీయులు మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారని ఈ సర్వే ద్వారా వెల్లడవుతోంది.

లక్ష మందిలో సగటున సుమారు 200 మంది పురుషులు, మహిళలు ఓపియాయిడ్ సంబంధిత రోగాల బారిన పడుతున్నారు. 2016లో లక్షమందిలో సగటున 400 మంది డిప్రెషన్‌కు లోనైనట్లు తెలుస్తోంది. క్రమంగా పెరుగుతున్న అసంతృప్తి, ఆందోళనల కారణంగా దేశం డిప్రెషన్ ఎపిడమిక్‌కు గురయ్యే స్థాయికి చేరుకుంది. పిన్నవయస్కుల్లో పెరుగుతున్న డిప్రెషన్ లక్షణాలు, ఆత్మహత్యల సంఖ్య దీనికి నిదర్శనం. ముఖ్యంగా యుక్త వయస్కులు డిప్రెషన్‌కు గురయ్యేందుకు నేటి ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంలో భాగమైన స్మార్ట్‌ఫోన్లు, వీడియో గేమ్స్, సామాజిక మాధ్యమాలు కారణమవుతున్నాయి. కొత్త టెక్నాలజీలకు బానిసలవుతున్న నేటి తరం ఒంటరితనానికి లోనవుతున్నారు. తీవ్ర స్థాయిలో ఆందోళనలకు గురవుతున్నారు. వీడియోగేమ్స్‌ది ఇందులో ప్రధాన పాత్ర. బ్లూవేల్ వంటి మృత్యుక్రీడల బారిన పడి మానసిక ప్రశాంతతను కోల్పోయి.. పిన్న వయస్సులోనే బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వేర్వేరు అధ్యయనాల ద్వారా టెక్నాలజీలకు దాసోహమైన నేటి తరంలో ఆరు రకాల బానిసత్వ లక్షణాలు కనిపిస్తున్నాయి. అవి సాలియెన్స్, మూడ్ మాడిఫికేషన్, టాలరెన్స్, విత్‌డ్రాల్, కాంఫ్లిక్ట్, రీలాప్స్.

ఫేస్‌బుక్‌ను అతిగా వాడడం కూడా మానసిక రోగా లకు దారితీస్తోందని సర్వేలు చెబుతున్నాయి. తరచూ ఫేస్ బుక్‌లో వచ్చే పరిణామాలు అంటే తమ ఫొటోలకు ఎన్ని లైక్స్, షేర్స్, కామెంట్స్ వచ్చాయన్న కుతూహలం వల్ల యువత మానసిక ఆందోళనకు గురవుతున్నారని, తద్వారా ప్రశాంతతను కోల్పోతున్నారని మానసిక వైద్యులు అంటు న్నారు. అంతే కాకుండా సెల్స్, ట్యాబ్స్, కంప్యూటర్స్ వంటి పరికరాలకు అతుక్కుపోయి తమ చుట్టుపక్కల ఏం జరుగుతున్నదో గమనించే స్థితిలో యువత లేరని, వారు తమలో ఓ ప్రపంచాన్ని తయారుచేసుకొని అందులోనే ఉండిపోవడం వల్ల కుటుంబ సంబంధాలకు సైతం దూరమవుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

ప్రపంచంలో ఎనిమిది రకాల దు:ఖాలున్నాయని బుద్ధుడు చెప్పాడు. బుద్ధుడి సిద్ధాంతం ప్రకారం ఓ వ్యక్తి తన జీవితంలో ఎంత ఆనందంగా ఉన్నది ఆమె/అతని జీవితశైలిని, ప్రవర్తనను బట్టి చెప్పవచ్చు. ఈ క్రమంలో వ్యక్తి జీవితంలో ఉన్న ఆనందాన్ని కొలిచేందుకు తన ఇష్టాయిష్టాలకు తగినట్లుగా స్వేచ్ఛగా జీవించడం, ఔదార్యం, దాతృత్వం, అవినీతి, స్థానభ్రంసం, రుణాలు, ఆత్మవిశ్వాసం స్థాయి, జీడీపీ, సామాజిక మద్దతు, ఆరోగ్యవంతమైన జీవిత అంచనా వంటి వాటిని పరిగణనలోకి తీసుకొంటుంటారు. అయితే మన దేశంలో ఆయా అంశాల్లో కేవలం పాస్‌మార్కులు దక్కడం కూడా కష్టసాధ్యమైన విషయంగా మారింది. తత్ఫలితంగా భారతదేశం దు:ఖదేశంగా మారిపోతోంది.

2006లో భారత్ స్కోర్ 5.348 పాయింట్లు కాగా 2014లో కేంద్రంలో నరేంద్ర మోడీ సర్కార్ వచ్చిన నాటి నుంచి అది మరింతగా దిగజారిపోయి 4.424కు పడిపోయింది. 2006లో 8.13 ఉన్న జీడీపీ 2017 నాటికి 8.76కి చేరుకొంది. సామాజిక మద్దతు స్కోరు సైతం 0.70 నుంచి 0.60కు పడిపోయింది. ఆరోగ్యవం తమైన జీవిత అంచనాలు 12 ఏళ్లలో 56.1 నుంచి 59.5కు, స్వేచ్ఛా జీవనం స్కోర్ 0.77 నుంచి 0.88కి పెరిగింది. ఇక భారతీయుల్లో ఔదార్యం విషయానికొస్తే 2013లో స్కోరు 0.07 కాగా అది దారుణంగా మైనస్ 0.05కు పడిపోయింది. అంటే ఈ ఐదేళ్లలో మనం మనలోని ఔదార్యాన్ని, దాతృత్వాన్ని కోల్పోయామని స్పష్టమవుతోంది. ఒక్క 2016లో కొంత మెరుగ్గా ఫలితాలు వెలువడ్డాయి. ఆ నాడు 2013 నాటి స్కోర్‌లో సగం అంటే 0.03 పాయింట్లు వచ్చాయి. ఏదిఏమైనా దు:ఖంతో పాటు దేశంలో అక్రమాలు, అవినీతి కూడా పేట్రేగిపోతుండడం బాధాకరం. ఏడేళ్లలో దేశ పరిస్థితి చాలా క్షీణించిందనడంలో ఎలాంటి సందేహం లేదు. 2011లో భారత్ స్కోర్ కొంత మెరుగ్గా 0.90 ఉండగా అది 2017 నాటికి 0.78కి పడిపోయింది. సానుకూల ప్రభావం (పాజిటివ్ ఇంపాక్ట్) స్కోర్ కూడా 2014 నుంచి గణనీయంగా తగ్గుతూ వచ్చింది. 2014లో 0.71 ఉండగా ప్రస్తుతం 0.68గా నమోదైంది. వ్యతిరేక ప్రభావం (నెగెటివ్ ఇంపాక్ట్) స్కోరు 2013లో 3.33 కాగా 2017లో 0.31గా ఉంది.

ప్రభుత్వంలో ఆత్మవిశ్వాసం స్కోరు 2013లో 0.53 నుంచి 2017లో 0.83కి చేరుకుంది. 2016లో ప్రజాస్వామ్య నాణ్యత (డెమొక్రటిక్ క్వాలిటీ) స్కోరు మైనస్ 0.27 కాగా 2017 స్కోర్ తెలియలేదు. అయితే, అది 2013లో మైనస్ 0.39గా ఉంది. డెలివరీ క్వాలిటీ స్కోరు కూడా మైనస్‌లో ఉంది. 2013లో మైనస్ 0.30 కాగా 2016లో మైనస్ 0.14గా రికార్డయింది. జీఐఎన్ఐ సూచీ ప్రకారం కుటుంబ ఆదాయం కూడా 2009లో 0.62 నుంచి 2014లో 0.42కు పడిపోయింది. 2017లో 0.38కి దిగజారింది. డిస్టోపియా స్కోరు కూడా నిరాశాజనకంగా ఉంది. రెసిడ్యుయల్స్ స్కోరు 1.43 మాత్రమే. ప్రపంచంలోనే దు:ఖ దేశాల జాబితాలో భారత్ 133వ స్థానంలో నిలవడం దేశంలో అత్యంత నిరాశాజనక పరిస్థితులు ఉన్నాయనడానికి నిదర్శనం.

విశాలాంధ్ర
బతుకు
The Life
ఆదివారం
25 మార్చి 2018





ఊహ తెలిసీ తెలియని వయస్సు నుంచీ ఉద్యమమే ఆమె జీవితం అయిపోయింది. కష్టాలనే ఇష్టంగా అలవర్చుకుని జీవించడమే అలవాటయిపోయింది. అందులో ఆనందాన్నే ఆమె చూసుకుంది. పదిమంది మంచికోసం శ్రమించాలని, ఆ శ్రమైక జీవనంలోనే సంతృప్తి, ఆనందం ఉందని మనసా వాచా నమ్మి, కమ్యూనిస్టు ఉద్యమానికే అంకితమైన తన భర్తకి చేదోడు వాదోడుగా నిలిచిందామె......ఆమే శతాధిక వృద్ధురాలు కడియాల రాజరత్నమ్మ. ఇప్పడామె వయస్సు 105 సంవత్సరాలు. ఈ వయస్సులోనూ దాదాపు డబ్బై, ఎనబై ఏళ్ల క్రిందటి కమ్యూనిస్టు ఉద్యమ, నాటి స్వాతంత్ర్య పోరాట పరిస్థితులను, వామపక్ష ఉద్యమాలపై నాటి నిషేధాలను, నిర్బంధాలను, పార్టీ నాయకుల, వారి కుటుంబాల త్యాగాలను, పడ్డ కష్టాలను ఆమె ఇలా చెప్పకొచ్చారు.

కమ్యూనిస్టు ఉద్యమశీలికి తోడు నీడగా...

కడియాల రాజరత్నమ్మ

అదో ఉమ్మడి సమాజం!

'ఇప్పటి పరిస్థితులతో పోల్చుకుంటే అప్పటి సమాజం చాలా ఉమ్మడిగా అనిపిస్తుంది. కులాలు మతాలు ఉన్నా ఇన్ని వైరుధ్యాలుండేవికావు. హెచ్చుతగ్గులూ అంతగా అనిపించేవి కావు. అప్పటి వారిలో మనమంతా ఒక ఊరివాళ్లం, ఒక ఉద్యమం కోసం పనిచేస్తున్న వాళ్లం అనే ఒక రకమైన అనుబంధం ఉండేది. ఇప్పటి ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా, ఇందుపల్లిలో మా నాన్న మానికొండ శ్రీరాములు వ్యవసాయ దారుడు. ఆయనకి రాజకీయాలు లేవు. భూమిని నమ్ముకుని కష్టించి పనిచేసే మనిషి. ఆయనకు తగ్గట్టుగానే మా అమ్మ సరస్వతి ఉండేది. ఆతిథ్యం ఇవ్వడమంటే అప్పట్లో వాళ్లు చాలా ఆనందంగా



భావించేవారు. మా నాన్నకి మేం ముగ్గురు ఆడపిల్లలం, నేను మూడోదాన్ని. నేను 1 జులై, 1914లో పుట్టాను. అప్పట్లో ఆడపిల్లలకి దాదాపుగా చదువులుండేవి కావు. కానీ నేను మా ఊరు ఇందుపల్లిలోనే ప్రాథమిక విద్య ఆరో తరగతి వరకూ చదువుకున్నాను. అక్కడ అప్పట్లో హైస్కూలు లేదు ఆరోజుల్లో చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసేవారు. దాంతో నాకూ 1928 సంవత్సరంలో, 14 ఏళ్ల వయస్సులోనే కృష్ణాజిల్లా కాటూరుకు చెందిన కడియాల గోపాలరావుగారితో పెళ్లి చేశారు. అప్పటికే ఆయన కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. స్వాతంత్ర పోరాటం జరుగుతున్న రోజులవి. నాపెళ్లయ్యాక విదేశీవస్తు బహిష్కరణ వంటి ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నప్పుడు నేనూ వారికి సాయంగా నిలిచాను. మావారు గోపాలరావుగారు బందరులో స్కూలు ఫైనల్ (ఎస్.ఎస్.ఎల్.సి) చదివారు. ఆయనను లాయర్ చదివించాలని మా మామగారు ఉబలాటపడ్డారు. అయితే అప్పటికే ఆయన రాజకీయాలవైపు మొగ్గడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. మావారు 20 ఏళ్ల వయసులో ఉన్నప్పుడే ఆస్తులు పంచుకున్నారు. తన అక్కకి కూడా ఆస్తిలో తమతోబాటు సమంగా ఆస్తి పంపకాలు చేయించారు. ఇది ఒకరకంగా మావారు చూపిన ఆదర్శం అని కచ్చితంగా చెప్పగలను. ఎందుకంటే అప్పట్లోనే కాదు చాలా కాలం వరకు ఆడపిల్లలకు ఆస్తిలో వాటా ఇచ్చేవారు కాదు. తరువాత అందుకు సంబంధించిన చట్టం వచ్చిందని నాకు గుర్తు......

నెహ్రూ కుటుంబంతో....

'గోపాలరావుగారు తన పార్టీ కార్యకలాపాలలో భాగంగా మహిళాభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టేవారు. వాళ్లకి హిందీక్లాసులు నిర్వహించడం, ఇతరత్రా విద్యావకాశాలు కల్పించడం వంటి పనులు చేసేవారు. అవేమీ నాకు ఇబ్బంది కలిగించేవి కావు. నేను సమర్థించేనేకానీ, ఏనాడూ వ్యతిరేకించలేదు. అలా కార్యకలాపాల్లో ఒక్కోసారి నన్ను పుట్టింట్లో వదిలి వెళుతుండేవారు. 1932 సంవత్సరంలో హిందీ టీచర్ ట్రైనింగ్ కోర్సు చేయించడానికి నన్ను అలహాబాద్ తీసుకెళ్లారు. అలహాబాద్‌లో మేం సంవత్సరం ఉన్నాం. ఐదేళ్లు చేయాల్సిన ఆ కోర్సును, నాకు టీబీ రావడంతో నేను పూర్తి చేయలేకపోయాను. అయితే అలహాబాద్ వెళ్లడం నా జీవితంలో మరచిపోలేని సంఘటన జరిగింది. అది జవహర్‌లాల్ నెహ్రూ కుటుంబాన్ని కలుసుకోవడం! నేనూ, గోపాలరావుగారూ ఒక రోజు నెహ్రూగారిని చూద్దామని వారింటికి వెళ్లాం. ఆంధ్రానుంచి వచ్చారని నౌకరు చెప్పగా నెహ్రూగారు కుటుంబ సమేతంగా మేడమీదనుంచి క్రిందికి దిగి వచ్చి మమ్మల్ని ఆప్యాయంగా పలుకరించారు. నెహ్రూగారు, ఆయన భార్య కమలా నెహ్రూ, చెల్లెళ్లు విజయలక్ష్మి పండిట్, కృష్ణ, నెహ్రూగారి తల్లి స్వరూపరాణి అంతా వచ్చి మాతో మాట్లాడ్డం నాకైతే చాలా ఆనందంగా అనిపించింది. 'హిందీలో మాట్లాడగలవా' అని నెహ్రూగారు నన్ను అడిగారు. నేను సమాధానంగా నవ్వి ఊరుకున్నాను. ఆయనా నవ్వేశారు. తరువాత అక్కడ ఒక స్కూలులో గ్రంథాలయం ప్రారంభోత్సవానికి నెహ్రూగారు కుటుంబంతో సహా వచ్చారు. అక్కడా ఆయనను కలిశాం. మరోసారి అలహాబాద్‌లోనే ఏదో కార్యక్రమానికి (అదేమిటో గుర్తుకు రావడం లేదు) నెహ్రూగారు వచ్చారు. అప్పుడూ ఆయనను కలిశాం. అలహాబాద్ నుంచి తిరిగి వచ్చి మదనపల్లిలోని టీ బి శానిటోరియంలో సంవత్సరంపాటు చికిత్స చేయించుకున్నాను. తరువాత నా నివాసం కృష్ణాజిల్లాలోని మా వారి ఊరు కాటూరుకు మారింది. ఆయన పార్టీ కార్యక్రమాలు మామూలే......హిందీ పరీక్షలు రాయలేకపోయానుగానీ హిందీ చదవడం, రాయడం బాగా వచ్చు. అంతేకాదు అప్పట్లో హిందీ సాహిత్యంలో వచ్చిన మంచి సాహిత్య పుస్తకాలను తెప్పించుకుని మరీ చదివాను. మహిళలతో వాటి గురించి చర్చలు కూడా జరిపేదాన్ని....కాటూరు వచ్చాక నాలో మార్పు వచ్చింది కూడా...

గాంధీగారినీ చూశాను....

'మా జిల్లాలోని ముదునూరుకు గాంధీగారు వస్తున్నారని తెలిసి, నేనూ, గోపాలరావుగారూ, ఇంకా చాలామంది తెల్లవారుఝామున మూడుగంటలకు లేచి ఎనిమిది కిలోమీటర్లమేర నడుచుకుంటూ వెళ్లాం. ఆంధ్రావైపు వచ్చిన గాంధీగారిని అన్నె అంజయ్యగారని కాంగ్రెస్ నాయకులు ముదునూరు తీసుకొచ్చారు. అప్పట్లో గోపాలరావుగారు, కాకాని వెంకట్రత్నం, రాధాకృష్ణ, అన్నె అంజయ్య, పిడికిటి రామకోటయ్య, జిల్లాలో బలమైన కాంగ్రెస్ నాయకులుగా ఉండేవారు. ఆ విధంగా మహాత్మా గాంధీ గారిని చూసే అవకాశం లభించింది.......తరువాత జరిగిన కొన్ని రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ నుంచి కొందరు విడిపోయి సోషలిస్టు పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. తరువాత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావంతో దానినుంచి కొందరు కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చేశారు. అలా గోపాలరావుగారితో సహా చాలామంది కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చేశారు. అప్పుడు బెనారస్ విశ్వవిద్యాలయంలో మెడిసిన్ మూడవ సంవత్సరం చదువుతున్న చంద్ర రాజేశ్వరరావుగారు కూడా చదువు వదిలేసి పార్టీలోకి వచ్చేశారు.

సి.ఆర్. నేతృత్వంలో శిక్షణా తరగతులు

'సరిగ్గా నాకు గుర్తులేదుగానీ, బహుశా 1938 ప్రాంతాల్లో అనుకుంటాను చంద్ర రాజేశ్వరరావుగారు మా ఊరు వచ్చి, మా ఇంట్లో నెలరోజులుండి, మహిళలకు మిలట్రీ పద్ధతిలో డ్రిల్లు క్లాసులు నిర్వహించారు. పార్టీ కార్యకర్తల, నాయకుల జాడ చెప్పమని ఆనాడు పోలీసులు మహిళలను హింసించేవారు. వారి దాడులను తట్టుకునేందుకు తప్పించుకునేందుకు చంద్ర రాజేశ్వరరావుగారు ఈ రకమైన శిక్షణ ఇచ్చారు. ఆ శిక్షణలో నేనూ పాల్గొన్నాను. అలాగే మహిళల్లో రాజకీయ చైతన్యం కలిగించేందుకు సమావేశాలు కూడా నిర్వహిస్తూండేవారు. ఆ సమావేశాల్లో నేనూ పాల్గొనేదాన్ని. ఈ కార్యకలాపాలన్నింటికీ మా ఇల్లే కేంద్రస్థానంగా ఉండేది. ఆనాడు మహిళలు బయటకు వెళ్లినా, రాజకీయాలు మాట్లాడినా చాలా తప్పుపట్టేవారు. నానా మాటలూ అనేవారు. నేనూ అలాంటి వాటిని చాలా ఎదుర్కొన్నాను. ఆ సమయంలో చంద్ర రాజేశ్వరరావుగారు మాకు ధైర్యం చెప్పేవారు. అలాగే గోపాలరావుగారు కూడా మా ఊళ్లోను,చుట్టు ప్రక్కల ఊళ్లల్లోనూ గ్రూపులుగా విభజించి మహిళలకు హిందీ తదితర క్లాసులు నిర్వహించేవారు. మానికొండ సూర్యావతి, నాగళ్ల రాజేశ్వరమ్మ, చంద్ర సావిత్రమ్మ, నేనూ, తదితరులం ఆ తరగతులకు హాజరయ్యేవాళ్లం. 1943ప్రాంతంలో ఒక ప్రక్క స్వాతంత్ర్య పోరాటం, మరో ప్రక్క ఉధృతంగా సాగుతున్న పార్టీ కార్యకలాపాలు, ఇంకోప్రక్క పార్టీ కార్యకలాపాల్లో భాగంగా శిక్షణా తరగతులు జోరుగా సాగాయి. పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, గోపాలరావుగారు, మద్దుకూరి చంద్రం, చలసాని వాసుదేవరావు తదితర పార్టీ నాయకులు ఆ శిక్షణా తరగతుల్లో రాజకీయ, సామాజిక అంశాలు బోధించేవారు. అప్పట్లో ప్రధాన రాజకీయ శిక్షణా తరగతులు విజయవాడలో జరిగాయి.

> **కమ్యూనిస్టు పార్టీ శాఖ ఏర్పాటు**
>
> '1937లో కొత్తపట్నంలో రాజకీయ పాఠశాల సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ శాఖ (కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ) ఏర్పాటు జరిగింది. గోపాలరావుగారు ఆ పాఠశాలకు వెళ్లారు. తిరిగి 1938 మంతెనవారిపాలెంలో రాజకీయ శిక్షణా తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ శాఖకు జోశ్యభట్ల సత్యనారాయణగారు ఇన్‌చార్జిగా నియమితులయ్యారు.

పార్టీపై నిషేధం.....జైలు జీవితం

'రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 1939లో అనుకుంటాను.....బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై తీవ్ర ఆంక్షలు విధించింది. అయితే ప్రపంచ



యుద్ధానికి తాము మద్దతు ఇవ్వబోమని, భారతస్వాతంత్ర పోరాటానికి మాత్రం తమ మద్దతు ఉంటుందని కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. అయితే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినతరువాత 1948లో కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో పెద్ద నాయకులతో సహా మేమంతా అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. బందరులో ఒకరహస్య ప్రాంతంలో మేం తలదాచుకున్నాం. అక్కడే గోపాలరావుగారిని అరెస్టు చేశారు. ఆయనతోబాటు నన్నూ జైలుకు తీసుకెళ్లారు. అప్పుడు మా అమ్మాయి సుగుణకి రెండేళ్ల వయస్సు. మమ్మల్ని బందరు సబ్‌జైలులో ఉంచారు. తరువాత గోపాలరావుగారిని డిటెన్యూగా కడలూరు జైలుకు తరలించి, నన్ను వదలేశారు. ఎన్నాళ్లు జైలులో ఉన్నానో నాకు సరిగాగుర్తు లేదు. బహుశా నెలరోజులున్నా ననుకుంటాను. ఆయన ఒక సంవత్సరం పైనే కడలూరు జైలులో ఉన్నారు. ఈ నిషేధ సమయంలో కాటూరు, ఎలమర్రు గ్రామాల్లో కమ్యూనిస్టులను మూలమూలల్లోనూ వెతికి మరీ పట్టుకుని గాంధీ విగ్రహం చుట్టూ తిప్పి హింసించారు. మలబార్ పోలీసులతో గుడివాడలోని పళనియప్ప క్యాంపులో దారుణంగా కొట్టించారు. జైలు నుంచి గోపాలరావుగారు బయటకు వచ్చాక పార్టీ హోల్‌టైమర్‌గా రైతు సంఘంలో పనిచేశారు. మరోవైపు మహిళా కార్యకర్తలను పార్టీకి అంకితభావంతో పనిచేసేలా తీర్చిదిద్దడంలో ఆయన బాగా శ్రమించారు. అలా ఆయన నాగళ్ల రాజేశ్వరమ్మ,, మా అక్క కూతురు మానికొండ సూర్యావతి తదితరులను తీర్చిదిద్దారు. కృష్ణాజిల్లాలో కమ్యూనిస్టుపార్టీ బలపడడానికి, కార్యకర్తలను ఆదుకోవడానికి కొన్ని కుటుంబాలు తమ ఆస్తులను సహితం త్యాగం చేసిన సందర్భాలున్నాయి. అలాంటి కుటుంబాలలో మా కుటుంబం, మానికొండ సూర్యావతి కుటుంబాలు కూడా ఉన్నాయని నేను గర్వంగా చెప్పుకోగలను......



పార్టీ అభ్యర్థుల గెలుపు

'మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొట్టమొదటి సారిగా 1952లో జనరల్ ఎన్నికలు జరిగాయి. గుడివాడ పార్లమెంటరీ నియోజక వర్గం నుంచి గోపాలరావుగారు కమ్యూనిస్టు అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. అంతేకాదు పార్టీ అభ్యర్థులు చాలా మంది ఎమ్మెల్యేలుగానూ గెలిచారు. అప్పుడు పార్టీ చాలా బలంగా ఉండేది. పార్టీకి ఎంతోమంది నిబద్ధత కలిగిన కార్యకర్తలు ఉండేవారు. కుటుంబాలను సైతం పణంగాపెట్టిపార్టీ కోసం పనిచేసేవారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక హైదరాబాద్‌లో రాష్ట్రకమ్యూనిస్టు సమితి ఆఫీసుని ఏర్పాటు చేయగా అక్కడ పనిచేయడానికి ఆయన వెళ్లారు. అప్పట్లో పార్టీ 'సందేశం' అనే పత్రికను నడిపేది. దాని సంపాదకవర్గ సభ్యులుగా కూడా గోపాలరావుగారు పనిచేశారు. అయితే 1965లో మన దేశంతో చైనా జరిపిన యుద్ధం సందర్భంగా కమ్యూనిస్టు పార్టీలో అభిప్రాయ భేదాలు రావడం, పార్టీ చీలిపోవడంతో ఆయన తటస్థంగా ఉండిపోయారు. ఒక రకంగా చెప్పాలంటే పార్టీ చీలడంతో ఆయనతోబాటుగా చాలామంది మానసికంగా కృంగిపోయారని నేను అర్థం చేసుకున్నాను. తరువాత ఆయన 'విప్లవ సందేశం' అనే పత్రికను ఒక సంవత్సరం పాటు నడిపారు. ఆర్థికపరమైన కారణాలతో దానిని ఆపేయాల్సి వచ్చింది. ఎప్పటికైనా పార్టీ కలసి ఉండాలన్నది ఆయన చిరకాల కోరిక. దీనికితోడు సోవియట్ యూనియన్‌లో జరిగిన కొన్ని పరిణామాల, స్టాలిన్‌పై అక్కడి నిరసనలు, అన్నీ ఆయనను మరింత మనస్తాపానికి గురిచేశాయి.

సేవా కార్యక్రమాలు.,....

'ఆ తరువాత గోపాలరావుగారు రాజకీయాలకు ఇంచుమించుగా దూరమయ్యారనే చెప్పాలి. హైదరాబాద్ నగరంలోని అమీర్‌పేటలోని నాగార్జున నగర్‌లో ఒక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఆయన నడుం బిగించారు. అందుకు చాలామంది విరాళాలు ఇచ్చారు. తమ్మారెడ్డి సత్యనారాయణ, దేవులపల్లి వెంకటేశ్వరరావు మరికొందరు స్థలాలు ఇచ్చారు. ఆయన తరువాత అక్కడే ఒక గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేసి గోపాలరావుగారి పేరే పెట్టారు. అనంతరం 1966 నాటికి ఆయన రాజకీయాలకు పూర్తిగా దూరమైపోయారు. 79 సంవత్సరాల వయస్సులో, 1991 సంవత్సరంలో గుండెపోటు రావడంతో గోపాలరావుగారు తనువు చాలించారు. పదిమందీ సంతోషంగా ఉండాలనే ఆయన ఎప్పుడూ కోరుకునేవారు. పిల్లలందరికీ ఆయన పార్టీ పెళ్లిళ్లే చేశారు. ఆయన రాజకీయాలలో క్రియాశీలకంగా ఉన్నరోజుల్లో మా ఇల్లు ఎప్పుడూ పార్టీ కార్యకర్తలతో, నాయకులతో సందడిగా ఉండేది. వాళ్లందరికీ వండి వార్చి పెట్టడంలో నాకు ఖాళీ ఉండేది కాదు. కానీ అదేదో కష్టంగానూ అనిపించేదీ కాదు. ఏదో తెలియని ఉత్సాహం, కమిట్‌మెంట్‌లా ఉండేది. ఇప్పుడు ఆ జ్ఞాపకాలే నాకు ఊపిరి పోస్తున్నాయి. ఇన్ని కష్టాలు అనుభవించామా అన్న ఆశ్చర్యానికీ అప్పుడప్పుడు లోనవుతుంటాను......

'మాకు ఇద్దరు పిల్లలు అబ్బాయి లక్ష్మణరావు, అమ్మాయి సుగుణ. ఉద్యోగస్తులుగా ఇద్దరూ రిటైరయ్యారు. మనవలూ, మనవరాంద్రతో కావలసినంత సందడి. వెనక్కి తిరిగి చూసుకుంటే నాకేమీ అసంతృప్తి లేదు......' అంటూ తన డెబ్బయిఅయిదేళ్ల వైవాహిక, ఉద్యమ జీవితాన్ని గుర్తు చేసుకుంటూ కడియాల రాజరత్నమ్మ వివరించారు.

తెలంగాణా సాయుధపోరాటంలో కడియాల గోపాలరావు గారు ఇతర నాయకులతోపాటుగా ప్రముఖపాత్ర పోషించారు. అయితే ఆ విషయాలేమీ వయస్సురీత్యా గుర్తుకు రాక రాజరత్నమ్మగారు చెప్పలేకపోయారు.

– సర్వజిత్

ఆదరణశీలి మా అమ్మ

మొదటినుంచీ మా అమ్మ రాజరత్నమ్మ బ్యాలెన్స్‌డ్ పర్సన్. ఏ ఒడిదుడుకులూ లేని నిండుకుండలా ఉండేది. అమ్మకి నేనూ, అన్నయ్యా ఆలస్యంగా పుట్టాం. మా పెద్దమ్మ కూతురు మానికొండ సూర్యావతిని దాదాపు మా అమ్మే పెంచి పెద్ద చేసింది. మా అమ్మ నాన్నకి చాలా చేదోడు వాదోడుగా ఉండేది. ఆస్తులు అమ్మేసి పార్టీకోసం ఖర్చుచేసినా ఏమీ అనేది కాదు. మా నాన్న అండర్ గ్రౌండ్‌లో ఉన్నప్పుడు నేనూ, అన్నయ్యా మా పెద్దమ్మ గారింటనేఉండేవాళ్లం. మా నాన్నగారు మమ్మల్ని ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదివించలేదు. 'మేము ఆంధ్రరాష్ట్రం కోసం పోరాడుతున్నప్పుడు మీరు ఇంగ్లీషు మీడియంలో ఎలా చదువుతారు? అది సరైన పద్ధతి కాదు' అని మమ్మల్ని తెలుగు మీడియంలోనే చదివించారు. మమ్మల్నే కాదు మా పిల్లల్ని కూడా ఇంగ్లీషు మీడియంలో చదవనివ్వలేదు. మా బావగారు (మానికొండ సూర్యావతి భర్త) సుబ్బారావుగారు, లావు బాలగంగాధరరావుగారు ముషీరాబాద్, చంచల్‌గూడ జైళ్లలో డిటెన్యూలుగా ఉన్నప్పుడు, వారిని చూడ్డానికి వచ్చే వారి కుటుంబాలను మా అమ్మే ఆదరించేది. అంతగా అరమరికలు లేకుండా మసలుకునేది. తొలినుంచీ మా అమ్మానాన్నా నాస్తికులుగానే ఉన్నారు. మేం మా చిన్నప్పుడు విశాలాంధ్ర, ప్రజాశక్తి పేపర్లు కట్టలు కట్టిన జ్ఞాపకం ఇప్పటికీ మా మనసులో మెదులుతుంది.

- సుగుణ, కుమార్తె

క్రమశిక్షణ అమ్మమ్మ సొత్తు

'మా అమ్మమ్మ రాజరత్నమ్మ దగ్గర నేర్చుకోవలసింది క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం. పదిమందికోసం పనిచేయడం ఆమె నైజం. ప్రతి పనికీ ఒక పద్ధతి పాటిస్తుంది. సాధ్యమైనంత వరకూ ఆ పని సజావుగా జరిగేట్లు జాగ్రత్త తీసుకుంటుంది. ఇంటి పనైనా అంతే, పార్టీ పనైనా అంతే. ఉదాహరణకు బర్ఫీ చెయ్యాలనుకుంటే కొబ్బరి తురుములో పిసరంత నలుపు తునక కూడా లేకుండా చూస్తుంది. అంత శ్రద్ధగా అమ్మమ్మ ఏ పనైనా చేస్తుంది. ఎప్పుడూ నవ్వుతూ ఉండాలన్నది అమ్మమ్మ సిద్ధాంతం. నిజానికి అదే మాకు ప్రేరణ అయింది.

- మానికొండ విజయవాణి,
(సూర్యావతి కుమార్తె) మనవరాలు





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

అబద్ధమైతే ఉత్ప్రేక్ష అనుకో! ఐనా వలపులో తొలిపలుకు మొగాడి పెదవుల్నించి వొలికితే ఒకటీ, ఆడదాని పెదవుల్నించి వొలికితే వొహటీనటే? ఇది పచ్చి బూర్జువా భావం కాదే, అక్కా?'అంది. ఆ మాటెక్కడబ్బిందే నీకు" అన్నా. "పాత భావాలన్నీ జూర్జువా భావం కాదే, అక్కా?" అంది. ఆ మాటెక్క డబ్బిందే నీకు" అన్నా. "పాతభావాలన్నీ బూర్జువా భావాలని కమ్యూనిస్టులంటున్నారు కదే? అంది. "నువ్వూ కమ్యూనిస్టు వేసేఁవిటే ఇదేంనేవిటి నువ్వు స్కూల్లో నేర్చు కుంటూన్నదీ?" అన్నా.

"సీతారాఁవుడి మెళ్ళో దండవేసింది. దమయంతి నలుడికి హంసచేత కబురంపించింది. రుక్మిణి యేకంగా తన్ను రాక్షస వివాహం చేసుకోమని కృష్ణుడి కాళ్ళావేళ్ళాపడింది. ఏం? వీళ్ళు బూర్జువాలా. కమ్యూనిస్టులా? నువ్వు బూర్జువావా, కమ్యూ నిస్టువా, అక్కా?" అనడిగింది. "నేను కమ్యూనిస్టుని అవునో కానో నాకు సరిగా తెలీదు కాని, బూర్జువా రక్తంమాత్రం నా వొంట్లో లేదే!

(నిన్నటి సంచిక తరువాయి)

మరి నీమాటో?" అన్నా నవ్వుతూనూ. "నేను కమ్యూనిస్టునే" అంది. "ఆ మాట అమ్మతోనూ, నాన్నతోనూ చెప్పావా?" అనడిగా. "నాన్నతో చెబితే ఆయనకి అర్థంగాక ఆగ్రహం వొస్తుంది. అమ్మతో చెబితే అమ్మకి అర్థంపూ అనుగ్రహం వొచ్చి ముద్దెట్టుకుంటుంది. వీళ్ళిద్దరికీ యెలా జత కలిసిందో నాకేం అర్థంకావడంలేదే!" అంది.

'ఏం మాటలే అవి!" అని దాని నోరుమూశా "నోరుమూశావు గాని, నా ప్రశ్నకి జవాబు చెప్పావు కావు. జనార్దనంగారితో నువ్వే నీ వలపు చెబితే చులకనై పోతావా? నాయనమ్మ ఖబుర్లు!" "పోనియ్యే, మీ స్కూల్లో శాస్తుర్లుగారినే అడగలేకపోయావా? మీ పాఠంలో పద్యం కదా?" అన్నా. "అమ్మో! ఆయన ముసలి తుక్కైనా 'కొక్కోకం', 'కళాశాస్త్రం' ఆయన పెదవులపైన నాట్యం చేస్తుంటాయే. ముసలి పెళ్లాంతో కలిసి అన్ని సినీమాలకీ హాజరవుతాడే. ఐనా మనలోమాట, ఆ ముసలి ముద్దలకి యవ్వనం, వలపూ అంటే యేఁవిటో తెలీదే – పుట్టెడు సంతానం గంపెడు సంసారఁవే అనుకో. ఐనా....." అని యేఁవిటో చెప్పబోయింది. "ఓసి నెరజాణా! పదిహేనేళ్ళొచ్చాయో లేదో, ఎంతలేసి భావాలూ ఎంతలేసి మాటలే! ఇహ నన్నొదిలిపెట్టవే! ఫో!" అని ముద్దు పెట్టుకు గదిలోఁచి తరిఁవేశా. నామనసులో భావాల్ని మాత్రం తరిఁవేయ లేకపోయా. ఈ కాలపు ఆడపిల్లలూ కూడా నన్ను మించిపోతున్నారే అనుకున్నా

2 అతడు

ప్రపంచం అంతా అయోమయంగా వుంది. నేను కట్టిన వంతెనల్ని కూల్చేయడవంటే – కన్న బిడ్డల్ని చేతులారా పీకనులవి చంపేస్తున్నట్టే అనిపిస్తుంది. జపాను వాడు మీదొచ్చి పడుతున్నా భూదగ్గం వొద్దంటూనే గాంధీగారు ఆగాఖాను భవనంలో కాలుపెట్టారు. ఆయన రంగంమీదనుంచి నిష్క్రమించారో లేనేలేదో, ఆయన పేరు మీదనే విధ్వంసన చర్యలు మొదలెడుతున్నారు కాంగ్రెస్ వాళ్ళు. నేను గవర్నమెంటు నౌఖర్ని. నేను మిలిటరీ ఆఫీసర్ని. మాతృదేశానికి స్వాతంత్ర్యం కావాలని నేనూ కోరుతున్నాను. బ్రిటిష్‌వాడి కింద బానిస చాకిరీ నా కక్కర్లేదు. ఆ మాట స్పష్టంగా చెప్పనే చెప్పాను చీఫింజనీరుతో. కాని, ఫాసిస్టు దుర్మార్గులు తుక్కుగా వోడిపోవాలనీ, సోవియట్ రష్యా జయం పొందాలనీ, నేను మనసారా కోరుకుంటున్నాను. అంచేత కాంగ్రెసు 'క్విట్టిండియా' నినాదం నాకు సుతరాఁవూ నచ్చడంలేదు. కమ్యూనిస్టుల వైఖరి అంతకంటే నచ్చడంలేదు. సోవియట్ విజయం కోరుతూనే కాంగ్రెను స్వతంత్రోద్యమంతో చేతులు కలపడానికి వాళ్ళకి వీల్లేదా? నాకు రాజకీయాలు అసలు తెలియవు. నా వంతెనలూ నేనూ తప్ప నాకంతా అంధకారంగా వుంది.... ఈ మధ్య సుభగారు యేదో పని పెట్టుకుని నా బంగాళాకి వాళ్ళ అమ్మాయిల్నీ వీళ్ళమ్మాయిల్ని వెంటబెట్టుకు వస్తున్నారు. ఆమె మొహం చూస్తే అంధకారంలో వెలుగు రేఖలు మెరిసినట్టే వుంటుంది. ఆ మాట ఆమెతో అనడానికి నాకు నోరు పెగల్దు.

ఆమెకి యిటు 'క్విట్టిండియా' ఉద్యమమంటే ఉత్సాహమూ, అటు కమ్యూనిస్టులంటే అభిమానమూ – రెండూ బలంగానే వున్నట్టున్నాయి. మొన్న వొచ్చినప్పుడు! సూరమ్మ పిన్నినీ, పిన్ని మాసినగుండుమీద సైనుపంచ ముసుగూచూసి: "వంటలక్కని తెప్పించారా యేమిటి, వూరు నుంచి." అంది సుభగారు. "వంటలక్క కాదండీ, మా సూరమ్మ పిన్ని, మా నాన్న యాయవార బ్రాహ్మడు. నాకు అన్నప్రాశన కాకుండానే మా నాన్న చనిపోయాడు. మా అమ్మా, మా అమ్మ నేస్తురాలు మా సూరమ్మ పిన్ని యిద్దరూ నీళ్ళబిందెలు మోసీ, పెళ్ళిళ్ళల్లోనూ అపరకర్మల్లోనూ ఆ యింటా, యీ యింటా వంటలూ వార్పులూ చేసీ, యెంగిళ్ళిపెట్టీ, యిళ్ళలికీ వాళ్ళింట్లో అప్పడాలు వొత్తీ, వీళ్ళింట్లో వొడియాలు పెట్టీ, వీళ్ళింట్లో ఊరపిండి రుబ్బీ, వాళ్ళింట్లో చిమ్మిలి దంచీ, వీళ్లింట నలుగుపెట్టీ, వాళ్ళింట తలంటిపోసీ – కాసులు కూడబెట్టి నన్ను చదివించారు: నేను వారింటా వీరింటా వారాలు చెప్పకు చదువుకున్నా. వారినీ వీరినీ ఆశ్రయించి లాగులూ లాల్చీలూ అడుక్కు తొడుక్కునీ, గావంచాలు సంపాయించి కట్టుకునీ బడికెళ్ళేవాణ్ణి. వీళ్లిద్దరి చెవట కష్టమే నన్నింత వృద్ధిలోకి తెచ్చింది. మా అమ్మ పోయింతరవాత సూరమ్మపిన్ని తప్ప నా అన్నవాళ్లు మరెవ్వరూ లేరు నాకీలోకంలో" – "మీరు తప్ప' అనాలని నోటి చివరిదాకా వొచ్చింది. కాని మరి నోరు తడారిపోయింది. గుండె గొంతుకలో కొచ్చేసి అడ్డుపడింది, ఎప్పుడో ఒహప్పుడు నాగురించి ఆమెతో చెప్పక తప్పదుకదా అనుకనీ, నలుగురులోనూ చెప్పడంలో నేను సిగ్గుపడాల్సిన అవసరంలేదని అనుకునీ గడగడ వాగేశా.

వాగుతున్నానేగాని ఆమె మొహం వంక చూడలేకపోయా. నా ధోరణి కట్టిపోయాక సుభగారు సూరమ్మపిన్నికి నమస్కారంచేసి: "జనార్దనంగారికి మీరు పిన్నిఅవుతే, నాకు మీరు అమ్మొమ్మగారు. అమ్మొమ్మగారూ! మిమ్మల్ని చూస్తే మా అమ్మొమ్మే జ్ఞాపకం వచ్చిందండీ! మీ అమృతహస్తాన్ని మీ అబ్బాయిగారికే కాకుండా మాక్కూడా రుచి చూపించరూ? ఈవేళకాదు లెండి. మేం ముగ్గురం అర్థాంతరంగా వచ్చాం యీవేళ. మీరూ మీ అబ్బాయిగారూ యెప్పుడు రమ్మంటే అప్పుడే వచ్చి భోజనం ఫలహారం చేసి మరీ వెళ్తాం సుమండీ!" అంది.

"దానికేం భాగ్యవమ్మా! మా అచ్చమ్మక్కయ్య చచ్చి యే స్వర్గాన్నుందో మొన్న చైత్రమాసానికి మమ్మల్నిద్దర్నీ వొదిలేసి వెళ్ళిపోయి ఆరేళ్ళయింది. అచ్చమ్మక్కయ్య దయవల్ల, అబ్బాయి చల్లవ్వల్ల కాటికి కాళ్ళు జాపుకు చంగ్రావుపేట కొంపలో పడి యేడవ్వలసిన ముండని, నన్నీ స్వర్గానికి తీసుకొచ్చి, నెత్తిమీద పెట్టుకుంటున్నాడు అబ్బాయి. వాడో యింటివాడవుతే చూసి సంతోషించి, అచ్చమ్మక్కయ్య దగ్గరికి యెప్పుడు వెళిపోదావా అనుంది తల్లీ! ఆడపిల్లలు మీ దగ్గిర అనకూడదుగాని నిక్షేపంలాంటి అబ్బాయి. కట్టుకున్నది సుఖపడుతుందమ్మా! అయ్యో నా మతి మండిపోను! వుండండుండండి. అబ్బాయికోసం శనివారం సాయంకాలపని వాసిన పోలి చేశాను. మీ ముగ్గురికీ అబ్బాయికీ సరిపోతుందిలెండి. ఆవకాయ పూట కలుపుకుని పెరుగుబిళ్ళ నాలికమీద వేసుకోండి అమ్మళ్ళూ!, "అంది సూరమ్మ పిన్ని....నేను యే నాడు సూర్యనమస్కారాలు చేసిన పాపాన పోకపోయినా, సూరమ్మ పిన్నికి వేయి నమస్కారాలు చేశా మనసులో.... సుభగారూ ఆమె నేస్తుడ్రాయింగు రూములో కూచుని తాంబూలం నవుల్తూండగా, "జనార్దనంగారూ! కొత్త వంతెల్లేవేనా కడుతున్నారా?" అందామె, నవ్వుతూనూ – ఎర్రటి పెదవులు విచ్చిన మందారరేకుల్లా కానవచ్చాయి.

"లేదండీ! పాతవి పడిపోతూంటే కొత్తవి డిజైను చేస్తున్నాం. కొత్తవాటి పునాదులకోసం పల్లవరంలో నల్లకొండలు పగులగొట్టిస్తున్నాం" అన్నాను. "కొండలు పిండిచేయడమే." అందామె ఆశ్చర్యపడుతూ. "పిండికాదండీ, చెక్కా ముక్కా దానివి 'బ్లాస్టింగ్' అంటారు" "బ్లాస్టింగు చేస్తే కొండలు శిధిలాలవుతాయా?" అనడిగిందామె. ఆడపిల్లలకి యేంతెలుస్తుంది – మరి! "ఇంక అడుగుతారు! బ్రహ్మాండమే బద్దలౌతుంది యేకంగా" అన్నా. "బ్లాస్టింగు ఎలా చేస్తారండీ?" అని అడిగిందామె కళ్ళు పెద్దవిచేసి. "కార్డెయిట్ ఎలా వుంటుందండీ! బజారులో కొంటారా?" అనడిగింది. "అబ్బే! అరవంకాయ కార్డెయిటు ఫ్యాక్టరీ నుంచి మాకు సప్లై అవుతుంది. అందుకు లైసెన్సువుండాలి" అన్నాను. "ఎలా వుంటుందో నాకు చూపించగలరూ? మీ మాటలు వింటుంటేనే నాక వొళ్ళు జలదరించిపోతూందండీ!" అంది. "ఆఫీసులో యెక్కడో మచ్చుముక్కలుండాలి. మొన్న తెప్పించాం. ఈసారి యింటికి తెప్పిస్తా" అన్నాను. "మీ యింటికి పిలవని పేరంటానికి వస్తావని అమ్మొమ్మగారితో చెప్పాంగా! రెండు మూడ్రోజుల్లో టెలిఫోను చేసి వస్తాం లెండి!" అందామె.

....సుభగారికి డైనమైటు గురించి యెందుకింత జిగ్న్యాసో? నాగురించి అన్నీ తెలుసుకోవాలనే ఆరాటమే అవుతుంది. నేను అదృష్టవంతుణ్ణి. ఐనా కాంగ్రెసు పెద్దలూ లక్షాధికార్లూ అయిన ఆ అమ్మాయి తల్లితండ్రులు గవర్నమెంటు నౌకరీ చేస్తూన్న నాకు-నీళ్ల బిందెలు మోసిన అచ్చమ్మ కొడుక్కి – అప్సరసలాంటి పిల్లని యిచ్చి పెళ్ళిచేస్తారా? ఐ.సీ. యస్సూ, కలక్టరూ మదనంగారు వాళ్ళ కళ్లెదుట తిరిగే అల్లుడుండగా! మొన్న సుభగారి పుట్టినరోజు పండక్కి వాళ్ళింటికి వెళ్ళినపుడు 'అల్లుడూ, మావా' వరసలు పెట్టి పిలుచుకోవడం వినవే విన్నాను. నేను వొట్టి పిచ్చివాణ్ణి. నాకు మతిపోతుంది. పోనీ – నేనే సుభగారితో మనస్సువిప్పి చెప్పితే? ఛా! ఎంతేనా, ఆడపిల్లలున్నవాళ్ళు మధ్యవర్తులు ద్వారా మాటలు జరిపించడం రివాజు. ఆ రివాజు జవదాటితే మొగాడు లోకానికీ లోకువే. నా మేజరుగిరీ, నా యింజనీరు పనీ యెవడిక్కావాలి? లోకానికీ సంఘానికీ సంప్రదాయం కావాలి. దానికితోడు లక్షలు కావాలి. అసలు లక్షలుంటే సంప్రదాయం అక్కర్లేదు. అంతస్తూ అక్కర్లేదు. సుభగారికీ అన్నీ వున్నాయి, వాళ్ళ నాన్నగారూ అమ్మగారూ 'కో అంటే కోటిమంది వస్తారు. వీళ్ళు వేలూ లక్షలూ కట్నాలూ ఇవ్వగలరు. అవతలి వాళ్ళు వేలూ లక్షలూ లాంఛనాలకీ వేడుకలకీ ఖర్చు పెట్టగలరు. మరి నేనో......

– ఇంకా వుంది.

పార్లమెంట్‌లో కొనసాగిన ప్రతిష్టంభన..అవిశ్వాసంపై సాగని చర్చ



జాతీయ వార్తలు వీక్లీ రౌండప్

కేంద్రప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి తెలుగుదేశం పార్టీ, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నోటీసులకు సంబంధించి ఈనెల 23 వరకు వరుసగా ఆరురోజులపాటు లోక్‌సభలో చర్చ జరగలేదు. టీఆర్ఎస్, ఏఐఏడీఎంకే తదితర పార్టీల సభ్యులు తమతమ డిమాండ్లతో సభలో ఆందోళనలు జరుపుతుండటంతో అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చే 50 మంది సభ్యులను లెక్కించడం సాధ్యం కావడంలేదంటూ స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను వాయిదా వేస్తూ వచ్చారు. టీడీపీ, వైసీపీలు ఇచ్చిన తీర్మానాలు సభముందు చర్చకు రాకపోవడంతో అవి మురిగిపోతూనే ఉన్నాయి. అయినా రెండు పార్టీల ఎంపీలు తీర్మానాలను రోజూ ఇస్తూనే ఉన్నారు. రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ కూడా ఈనెల 23న అవిశ్వాస తీర్మానం నోటీసును లోక్‌సభ సెక్రటరీ జనరల్ కార్యాలయంలో అందజేసింది. ఈ తీర్మానం ఈనెల 27న సభ ముందుకు వచ్చే అవకాశం ఉంది.

మరో 'దాణా' కేసులో దోషిగా లాలూ



దాణా కుంభకోణానికి సంబంధించిన మరో కేసులో బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ను సీబీఐ ప్రత్యేక కోర్టు దోషిగా తేల్చింది. మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాను నిర్దోషిగా ప్రకటించింది. 1990లలో లాలూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చోటు చేసుకున్న ఈ కుంభకోణానికి సంబంధించిన కేసుల్లో ఆయనపై దోష నిర్ధారణ జరగడం ఇది నాలుగోసారి.

హజారే నిరవధిక దీక్ష



సామాజిక కార్యకర్త అన్నా హజారే కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయ్యారు. అవినీతికి వ్యతిరేకంగా ఆయన తన తాజా పోరాటాన్ని ప్రారంభించారు. కేంద్రంలో లోక్‌పాల్ ఏర్పాటు చేయాలని, వ్యవసాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హజారే ఈనెల 23 నుంచి నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు.

ఇరాక్‌లో అపహరణకు గురైన 39 మంది భారతీయుల ఊచకోత

ఇరాక్‌లో మూడేళ్ల కిందట అపహరించిన 39 మంది భారతీయులను ఉగ్రవాద ముఠా ఐసిస్.. దారుణంగా హతమార్చినట్లు వెలుగులోకి వచ్చింది. మృతదేహాలను ఉగ్రవాదులు బదోశ్ గ్రామంలో సామూహికంగా ఖననం చేశారు. వాటిని వెలికితీసి డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించినట్లు విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఈనెల 20న రాజ్యసభలో ప్రకటించారు. మృతదేహాలను ప్రత్యేక విమానంలో తీసుకువచ్చి బంధువులకు అప్పగిస్తామన్నారు. ఇందుకు 8-10 రోజులు పడుతుందని విదేశాంగ శాఖ సహాయమంత్రి వి.కె.సింగ్ విలేకరులకు చెప్పారు. అపహరణకు గురైనవారిని ఉగ్రవాదులు హత్య చేసినట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి.

పద్మ పురస్కారాల ప్రదానం

43 మంది ప్రముఖులకు పద్మ పురస్కారాలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈనెల 20న ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్ర పతి ఎం.వెంకయ్య నాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, క్యాబినెట్ మంత్రులు హాజర య్యారు. ఇళయరాజా, ముస్తాఫా ఖాన్, పరమేశ్వరన్‌లకు పద్మవిభూషణ్‌ను ప్రదానం చేశారు.

జిన్‌పింగ్ రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక



అంతర్జాతీయ వార్తలు

అధ్యక్ష పదవిని జిన్‌పింగ్ రెండోసారి అధిష్టించేందుకు చైనా అధికారికంగా ఆమోదం తెలిపింది. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ) ఈనెల 17న ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఆయన జీవితాంతం ఈ పదవిలో కొనసాగేందుకు వీలు కల్పిస్తూ ఇటీవల రాజ్యాంగానికి సవరణ చేసిన విషయం తెలిసిందే. 20 లక్షల మందితో ప్రపంచంలోనే అతిపెద్ద సైన్యమైన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ)లోని అత్యున్నత కేంద్ర సైనిక కమిషన్‌కు అధిపతిగానూ ఆయనే కొనసాగేందుకు ఎన్‌సీపీ అంగీకరించింది. జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడైన వాంగ్ ఖిషాన్(69)ను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంది. వీరిద్దరూ ఇదే పదవుల్లో జీవితాంతం కొనసాగే అవకాశం ఉంది. చైనా ప్రధానిగా లీ కెకియాంగ్ ఈనెల 18న ఆ పదవికి రెండోసారి ఎన్నికయ్యారు. అధికార కమ్యూనిస్టు పార్టీలో రెండోస్థానంలో ఉన్న లీ (62) మరో ఐదేళ్ల ఈ పదవిలో కొనసాగనున్నారు.

మారిషస్ అధ్యక్షురాలి రాజీనామా

ఓ స్వచ్ఛంద సంస్థ క్రెడిట్‌కార్డును సొంత అవసరాలకు వినియోగించుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొన్న మారిషస్ అధ్యక్షురాలు అమీనా గురిబ్ ఫకిమ్ తన పదవికి ఈనెల 17న రాజీనామా చేశారు. లండన్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ఆ క్రెడిట్ కార్డు ఇవ్వగా.. గురిబ్ దాదాపు రూ.20 లక్షల విలువైన ఆభరణాలు, వస్తువులను అక్రమంగా కొనుగోలు చేసినట్లు పోర్ట్ లూయిస్ నుంచి వెలువడే ఓ పత్రిక ఇటీవల వార్తలు ప్రచురించింది. దీంతో రాజీనామా చేయాల్సిందిగా ప్రధానమంత్రి జగన్నాథ్ సహా పలువురి నుంచి ఒత్తిళ్ల పెరిగాయి. దీంతో చివరకు గురిబ్ రాజీనామా చేశారు.

జుకెర్‌బర్గ్ క్షమాపణ

'సమాచార దుర్వినియోగం' వివాదంలో చిక్కుకున్న ప్రముఖ సోషల్ మీడియా సంస్థ సీఈవో మార్క్ జుకెర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారు. పొరపాటు జరిగిందని ఆయన అంగీ కరించారు. 200 కోట్ల మంది ఖాతాదారుల వ్యక్తిగత వివరాల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ కోస పనిచేసిన బ్రిటన్ సంస్థ 'కేంబ్రిడ్జి అనలిటికా' ఐదుకోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల సమాచారాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే.

రష్యా అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ విజయం

రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ నాలుగోసారి ఎన్నికయ్యారు. పుతిన్‌తోపాటు ఏడుగురు అధ్యక్ష పదవికి పోటీ చేశారు. న్యాయపరమైన కారణాలతో పుతిన్ ప్రధాన ప్రత్యర్థి అలెక్సీ నావెల్నీని ఎన్నికల బరి నుంచి తప్పించారు. తాజా ఎన్నికల్లో పుతిన్‌కు గతంలో ఎన్నడూ లేనంతగా 76.66 శాతం ఓట్లు పోలయ్యాయి. రెండు దశాబ్దాలుగా రష్యా పాలన పుతిన్ చేతుల్లోనే ఉంది. ప్రస్తుత ఎన్నికల్లో విజయంతో పుతిన్ 2024 వరకు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆస్ట్రేలియాలో 457 కేటగిరీ వీసా విధానం రద్దు

విదేశీ నైపుణ్య ఉద్యోగాలకు కీలకమైన 457 (సబ్‌క్లాజ్) కేటగిరీ వీసాలను ఆస్ట్రేలియా రద్దు చేసింది. తద్వారా అమెరికా బాటలో పయనిస్తోంది. 457 వీసాల స్థానంలో 'టెంపరరీ స్కిల్ షార్టేజీ' (టీసీఎస్) వీసా విధానాన్ని ఈనెల 18న తీసుకువచ్చింది. ఆస్ట్రేలియా తీసుకున్న నిర్ణయంతో ముఖ్యంగా భారతీయ విద్యార్థుల అవకాశాలు బాగా దెబ్బతింటాయి.

2జి స్పెక్ట్రమ్ కేసు తీర్పుపై ఢిల్లీ హైకోర్టుకు సీబీఐ



2జీ స్పెక్ట్రం కేసు నుంచి కేంద్రమంత్రి రాజా, డీఎంకే ఎంపీ కనిమొళి తదితరులను విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీబీఐ ఈనెల 20న ఢిల్లీ హైకోర్టులో అప్పీలు దాఖలు చేసింది. ఈ అవినీతి వల్ల ప్రభుత్వానికి కోట్ల నష్టం వాటిల్లిందంటూ కొన్నేళ్ల క్రితం సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం కనిమొళి, రాజా సహా 17 మంది నిందితులను విడుదల చేస్తూ ప్రత్యేక న్యాయస్థానం ఇటీవల తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో ఆ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ అప్పీలు దాఖలు చేసింది. ఈనెల 19నే ఈ తీర్పును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సవాలు చేయడం గమనార్హం. ఈమేరకు ఢిల్లీ హైకోర్టు ఈనెల 21న కనిమొళి, రాజాలకు నోటీసులిచ్చింది.

రుణాలు చెల్లించలేమన్న 'ఆన్‌రాక్'

పెన్నా గ్రూప్, రస్ అల్ ఖైమాల భాగస్వామ్యంతో విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఆన్‌రాక్ అల్యూమినియం కంపెనీ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.3,461 కోట్లు చెల్లించలేమని పేర్కొంది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోసం దివాలా ప్రక్రియ చేపట్టాలని ఆన్‌రాక్ కోరగా, జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ నిరాకరించింది. 2014 మార్చి 31 నాటికే రూ.2,905 కోట్ల నిరర్థక ఆస్తి ప్రకటించగా, అందులో రూ.1,275 కోట్లు చెల్లిస్తానని ముందుకు వచ్చింది.

క్రీడా వార్తలు

ముక్కోణపు టీ20 సిరీస్ భారత్ కైవసం

కొలంబోలో ఈనెల 18న ఉత్కంఠంగా జరిగిన ముక్కోణపు టీ20 ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు నాలుగు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. 167 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. ఆరు వికెట్లు కోల్పోయి చివరి బంతికి విజయాన్ని సాధించింది. దినేశ్ కార్తీక్ చివరి బంతిని సిక్సర్ కొట్టి మ్యాచ్‌ను గెలిపించాడు. ఈ మ్యాచ్‌లో విజయంతో భారత జట్టు సిరీస్‌ను కైవసం చేసుకుంది.

మూడో వన్డేలోనూ భారత మహిళల ఓటమి

ఆస్ట్రేలియా మహిళల జట్టుతో ఈనెల 18న వడోదరలో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో భారత జట్టు 97 పరుగుల తేడాతో ఓడిపోయింది. మొదట ఆస్ట్రేలియా జట్టు ఏడు వికెట్లకు 332 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో భారత జట్టు 44.4 ఓవర్లలో 235 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ మ్యాచ్‌లో విజయంతో ఆస్ట్రేలియా జట్టు సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది.

హోదా కోసం జాతీయ రహదారుల దిగ్బంధం

రాష్ట్ర వార్తలు

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి పిలుపు మేరకు ఈనెల 22న రాష్ట్రవ్యాప్తంగా ఉదయం జాతీయ రహదారుల దిగ్బంధం సంపూర్ణంగా జరిగింది. సమితి పిలుపునకు సీపీఐ, సీపీఎం, వైసీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలతో పాటు విద్యార్థి, పాత్రికేయ, కార్మిక సంఘాలు మద్దతిచ్చాయి. ఆయా పార్టీలు, సంఘాల శ్రేణులు ఆందోళనలో పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతమైంది.

అకాల వర్షాలతో పంటలకు నష్టం

ఈనెల 16, 17 తేదీల్లో కురిసిన అకాల వర్షాలతో రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నెల్లూరు జిల్లాలో రూ.45 కోట్ల మేర పంట నష్టం వాటిల్లింది. అనంతపురం జిల్లాలో పలుచోట్ల అరటి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. రాయలసీమలో పలు మార్కెట్ యార్డుల్లో అమ్మకాల కోసం తెచ్చిన కందులు, శనగలు వర్షాలకు తడవటంతో రైతులు నష్టపోయారు.



'2019 ఎన్నికల్లో స్వతంత్రంగానే పోటీ'

2019 ఎన్నికల్లో జనసేన స్వతంత్రంగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈనెల 17న ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ, నవత రాన్ని, యువతరాన్ని రాజకీయాలలోకి తీసుకు రావాలన్నదే తన ఆలోచన అని చెప్పారు.

రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం

రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్రం నుంచి మొత్తం మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవగా, టీడీపీ రెండు, వైసీపీ ఒకటి దక్కించుకున్నాయి. టీడీపీకి చెందిన కె.రవీంద్రకుమార్, వైసీపీకి చెందిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కొద్దిరోజుల కిందటే ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారు. టీడీపీకి చెందిన సీఎం రమేష్ ఈనెల 23న ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.

'ఆప్' ఎమ్మెల్యేలకు ఊరట

లాభదాయక పదవుల కేసులో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలపై పడిన అనర్హత వేటును ఢిల్లీ హైకోర్టు ఈనెల 23న కొట్టివేసింది. ఈ అంశంపై మరోసారి విచారించి, నిర్ణయం తీసుకోవాలని కేసును తిరిగి ఎన్నికల సంఘానికి అప్పగించింది.

బ్యాంకులకు 'కనిష్క్' రూ.824 కోట్లు ఎగవేత



కనిష్క్ గోల్డ్ అనే మరో బంగారు ఆభరణాల వ్యాపార సంస్థ బ్యాంకులకు బకాయిలను ఎగవేసింది. రూ.824 కోట్ల మేర బకాయిలను ఈ సంస్థ యాజమాన్యం చెల్లించలేదు. ఈ సంస్థకు రుణాలిచ్చిన సహ వ్యవస్థకు నేతృత్వం వహించిన ఎస్‌బీఐ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి ఫిర్యాదు చేసింది. దీంతో సీబీఐ రంగంలోకి దిగి ఈనెల 21న ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేయడంతోపాటు నిందితుల నివాసాల్లో సోదాలు ప్రారంభించింది.

మమతా బెనర్జీతో కేసీఆర్ చర్చలు



తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఈనెల 19న కోల్‌కతాలోని సచివాలయంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సమావేశమయ్యారు. వీరి మధ్య మూడు గంటల పాటు చర్చలు జరిగాయి. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా బలమైన సమాఖ్య కూటమి (ఫెడరల్ ఫ్రంట్) ఆవశ్యకత ఉందన్నారు. కూటమి ఏర్పాటుకు తొలి అడుగు పడిందని తెలిపారు.

రాజ్యసభలో పెరిగిన బీజేపీ బలం

రాజ్యసభలో ఏప్రిల్‌లో ఖాళీ అవుతున్న 59 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవమైనవాటిని కలిపి మొత్తం 18 సీట్లను బీజేపీ గెలుచుకుంది. దీంతో రాజ్యసభలో ఎన్డీయే బలం 104కు చేరింది. ఇందులో బీజేపీకి 86 సీట్లు ఉన్నాయి. 59 స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా, 33 ఏకగ్రీవమయ్యాయి. 26 స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

వెంకట్‌రెడ్డి, సంపత్‌లకు ఓటు హక్కు లేదు : కేంద్ర ఎన్నికల సంఘం

తెలంగాణ వార్తలు

సభ్యత్వం రద్దయిన ఇద్దరు శాసనసభ్యులకు రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగం సమయంలో చోటుచేసుకున్న సంఘటన నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (నల్గొండ), ఎస్.ఎ.సంపత కుమార్ (అలంపూర్)ల శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ మేరకు స్పీకర్ నోటిఫికేషన్ జారీచేశారు. ఈ రెండు స్థానాలు ఖాళీ అయినట్లుగా కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ప్రభుత్వం నివేదించింది. కాగా, రాజ్యసభ ఎన్నికల్లో వారికి ఓటుహక్కు కల్పించాలని శాసనసభ కార్యదర్శిని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ క్రమంలో శాసనసభ కార్యదర్శి కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. పోలింగ్ తేదీ నాటికి సభ్యులుగా ఉన్నవారికి మాత్రమే ఓటుహక్కు ఉంటుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

బీజేపీకి 'నాగం' రాజీనామా

మాజీ మంత్రి నాగం జనార్దనరెడ్డి భారతీయ జనతాపార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఈనెల 22న పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు పంపారు. ఏ పార్టీలో చేరేదీ త్వరలో ప్రకటిస్తానని ఆయన విలేకరులకు తెలిపారు.

టీఆర్ఎస్ అభ్యర్థుల విజయం

రాష్ట్రం నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రసమితి మొత్తం మూడు స్థానాలను దక్కించుకుంది. ఎన్నికల్లో మొత్తం 107 ఓట్లు పోల్ కాగా, టీఆర్ఎస్‌కు ఊహించిన విధంగానే 97 ఓట్లు వచ్చాయి.



మత్తు..చిత్తు



విశాలాంధ్ర-జనరల్‌డెస్క్ : తెలుగు రాష్ట్రాల యువత ప్రస్తుతం గంజాయి మత్తులో ఊగుతున్నారు. ఈ రెండు రాష్ట్రాలలోని గంజాయి అందుబాటు ఎక్కువగా ఉండడంతో తొలుత ఫ్యాషన్‌గా తర్వాత దానికి బానిసలై పోతున్నారు. ఇలాంటి వారిలో సగం మంది విద్యార్థులేనన్న అధ్యయనం విశ్లేషణలు ఆందోళన కలిగిస్తున్నాయి. గంజాయి విక్రేతలు క్రమం తప్పకుండా పోలీసులకు మామూళ్లు సమర్పించుకుంటూ తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా నిర్వహించుకుంటున్నారు. అంతేకాదు ఈ దురలవాటు నుంచి యువతను కాపాడవలసిన పోలీసులు క్రమేపి గంజాయికి అలవాటుపడుతున్నట్టు సమాచారం. గంజాయి విక్రేతలు తమ బ్రోకర్ల ద్వారా మొదటగా వల వేస్తున్నది విద్యార్థులకే. ఈ మధ్య డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఆల్కహాల్ తీసుకుంటే బ్రీత్‌ఎన్‌లైజర్‌లో పోలీసులకు దొరికి పోతాం కాబట్టి గంజాయి తీసుకుంటే అటువంటి భయం ఉండకపోవడంతో ఈ మత్తుకు బానిసలవుతున్నట్టు తెలుస్తుంది. అంతేకాదు ఆల్కహాల్‌కు ఖర్చు కూడా ఎక్కువే, అలాగాకుండా వంద రూపాయలిస్తే చాలు పది సిగరెట్‌లలో కూర్చుకునేంత లభించడంతో గంజాయి పట్ల యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. గంజాయి కొనుక్కుంటున్న యువత నిర్మానుష్యంగా ఉండే మారుమూల ప్రాంతాల్లో చేరి సిగరెట్లలో పొగాకు పొడిని తీసేసి అందులో గంజాయి పౌడర్‌ను కొనుక్కుని కాల్చుకుంటూ సరదగా ఎంజాయ్ చేస్తున్నారు. చూడడానికి సిగరెట్టే కాబట్టి ఎవరికీ అనుమానం కూడా రాదు. విద్యార్థులు హాస్టళ్లలో ఈ కార్యక్రమాన్ని సాగిస్తూ ఆరోగ్యాలను చేజేతులా పాడు చేసుకుంటున్నారు. వైద్యులు, లెక్చరర్లు, వ్యాపారవేత్తలు, రాజకీయ నేతల పిల్లలు ఎక్కువగా ఈ మత్తుకు బానిసలవుతున్నట్టు పోలీసు వర్గాల సమాచారం. తెలుగు రాష్ట్రాల్లో ముందుగా సమాచారం ఉండడంతో పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున గంజాయి, సిగరెట్లు పట్టుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాలుండే విశాఖపట్నం, తూర్పు గోదావరి, ఖమ్మం, శ్రీకాకుళం జిల్లాల నుంచి గంజాయి తరలిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. విద్యార్థులలోను కొందరు గంజాయి విక్రయాలను జరుపుతున్నట్టు పోలీసులు చెబుతున్నారు.

ఆరోగ్య సమస్యలు

గంజాయి మహమ్మారికి అలవాటుపడితే శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. గంజాయికి అలవాటుపడి అది దొరక్కపోతే కాళ్లు, చేతులు వణకడం, మానసిక ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ మహమ్మారికిదాసులై కౌన్సెలింగ్ కోసం తమ వద్దకు వస్తున్న వారిలో ఇంజనీరింగ్ విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నారని డాక్టర్లు చెబుతున్నారు. ఇటువంటి మానసిక సమస్యల బారిన కుంగుబాటుకు గురై ఆత్మహత్యలు సైతం చేసుకుంటున్నారట. అయితే దీనికి తల్లిదండ్రులు వేరే కారణాలు చెబుతున్నారని సామాజిక విశ్లేషణలు వెల్లడిస్తున్నాయి.

కౌన్సెలింగ్ తప్ప మరో మార్గం లేదు

తాము ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా, దాడులు చేసి అరెస్టు చేస్తున్నా ఫలితం ఉండడం లేదని పోలీసు అధికారుల వాదన. విద్యాసంస్థల్లో కౌన్సెలింగ్ నిర్వహించడంలాంటి దుష్పరిణామాలను ప్రాక్టికల్‌గా తెలియజెప్పడం మినహా మరో మార్గం లేదని వారంటున్నారు. ఈ దురలవాటును అరికట్టడంలో తల్లిదండ్రులది కీలకకపాత్ర అని, యుక్తవయస్సు వచ్చే సమయానికి వారి కదలికలపై నిఘా ఉంచాలని, చెడుమార్గాలు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విచ్చలవిడిగా డబ్బులు ఇవ్వరాదని పోలీసు అధికారులు సలహా ఇస్తున్నారు.



నీటికి మనిషి చేటు

విశాలాంధ్ర-జనరల్ డెస్క్ : ప్రపంచం ప్రస్తుతం తీవ్ర సంక్షోభ పరిస్థితిలో ఉంది. ప్రకృతికి మానవుడు చేస్తున్న హానితో తన మనుగడకే కాకుండా భవిష్యత్తు తరాలు కూడా తీవ్ర సంక్షోభ పరిస్థితిని ఎదుర్కొనే సమయం ఆసన్నమైందని పలువురు శాస్త్రజ్ఞులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచంలో 2.5 బిలియన్లమంది ప్రజలు గొంతు తడుపుకు నేందుకు మంచినీటికోసం అల్లాడుతుం డగా, 4.5 బిలియన్లమందికి కనీస పారిశుద్ధ్య వసతులు లేక తీవ్ర అగచాట్లకు గురవుతున్నారని ఐక్యరాజ్యసమితి నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2050 నాటికి ప్రతి నలుగురిలో ఒకరు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నాయని యుఎన్‌ఓ సెక్రటరీ జనరల్ గుటెరస్ వ్యాఖ్యానించారు. 2025 నాటికి ఈ సమస్య 66శాతానికి చేరుకోవచ్చు. ప్రపంచ జనాభాలో 40శాతంమంది అంటే 2.5 బిలియన్ల మంది కనీస అవసరాలకోసం నీటి సమస్యను ఎదుర్కొం టుండగా, 80శాతం మంది నీటిని పునర్వినియోగించకుండా వృథాగా డ్రైనేజీల్లో కలిసిపోతున్నట్లు తెలుస్తోంది. 90శాతం ప్రకృతి వైపరీత్యాలు నీటికి సంబంధించినవే...నీటి కొరత ఎంత తీవ్రంగా ఉందంటే నీటి కోసం ప్రజలు యుద్ధాలు చేసుకనే స్థితి దాపురించింది. ప్రజలు తమ మనుగడకోసం వేరే ప్రదేశాలకు వలసలుగా వెళ్లిపోతున్నారు.

సురక్షిత నీటికోసం ప్రపంచవ్యాప్తంగా 800 మిలియన్లమంది కనీసం 30నిమిషాలు నడిస్తేగాని నీళ్లు దొరకడంలేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. ప్రకృతికి ఎనలేని హాని చేయడం ద్వారా మనిషి తన మనుగడకే ముప్పుతెచ్చుకొంటున్నట్లుగా పర్యావరణ శాస్త్రవేత్తలు అవేదన చెందుతున్నారు. గత శతాబ్దకాలంలో సగటున ఏటా రెండు రకాల వెన్నెముక జాతి జంతుజాలం అంతర్థానమైపోతోంది తాజాగా సూడాన్‌లో ప్రపంచంలోనే ఆఖరిదైన తెల్లటి ఖడ్గమృగం మృతిచెందడం ఇందుకు తాజా ఉదాహరణ. మొజాంబిక్ దేశ జనాభాలోని 26 మిలియన్లమందిలో సగానికిపైగా తాగేందుకు మంచినీరు అందడంలేదంటే ప్రపంచవ్యాప్తంగా నీటి పరిస్థితిని అంచనా వేయవచ్చు. 2100 నాటికి ఆఫ్రికాలోని పక్షులు, క్షీరదజాతులు సగానికిపైగా అంతరించిపోయే ప్రమాదం ఉందని తెలుస్తోంది. తాజాగా దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో ప్రభుత్వం మనిషికి 25 లీటర్ల నీరు అందజేస్తోంది. బ్రెజిల్ రాజధాని బ్రెసీలియా కూడా నీటిఎద్దడితో తరువాతి స్థానంలో ఉంది. వాతావరణంలో కర్బన ఉద్గారాల శాతం పెరిగిపోవడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. బ్రెజిల్‌లోని 5570 నగరాలు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. నీటి సంక్షోభాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్న దేశాల్లో ఆఫ్రికా దేశమైన ఎరిత్రియా ప్రధానంగా ఉంది. ఈ నగరంలో 19శాతం జనాభాకు కనీస నీటిసదుపాయం లేదు. తరువాతి స్థానిల్లో పపువా న్యూగినియా, ఉగాండా,ఇథియోపియా, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ ద కాంగో, సొమాలియా దేశాలు 37శాతం నుండి 40శాతం నీటి కరవుతో అల్లాడుతున్నాయి. ఆయా దేశాల్లో నీటి లభ్యతలో గణనీయమైన వైవిధ్యం కూడా ఉంది.

నైజీర్‌లో 41శాతం మంది పేదవాళ్లకు నీరు అందుబాటులో ఉండగా 72 శాతం మంది సంపన్నవర్గానికి నీటికొరత తీవ్రంగా ఉంది. ప్రక్కనే ఉన్న మాలిలో 45శాతం పేదవారికి నీరు సౌలభ్యంకాగా 93శాతం ఉన్నతవర్గంవారు తీవ్ర నీటి ఇబ్బందులకు గురవుతున్నారు. నీటి సౌలభ్యంలో అసమానత్వం ప్రధానంగా రాజకీయ రంగుతో మరింతగా ప్రబలుతోంది. పరిశుభ్రమైన నీటిని పొందడంలో 2000 నుండి 81-89శాతం మందికి మాత్రమే తమ ఇంటిదగ్గరనే మంచినీటిని పొందుతున్నారు. ప్రపంచంలో 844 మిలియన్లమంది 30నిమిషాలు నడిచి మంచినీటిని పొందగలుగుతున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్నదేశాల్లో మరింత అభివృద్ధి కనిపిస్తోంది. చైనా 2000-2015 మధ్యకాలంలో 334 మిలియన్లమందికి నీటిని అందుబాటులోకి తెచ్చింది.301 మిలియన్లమందితో భారత్ తరువాతి స్థానాన్ని ఆక్రమించింది. యునైటెడ్ నేషన్స్‌అంచనాల ప్రకారం 5బిలియన్లమంది ప్రజలు 2050నాటికి సంవత్సరంలో ఒక నెలైనా తీవ్ర నీటికొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది.

తాజాగా మన దేశంలో మెట్రోపాలిటన్ నగరం బెంగళూరు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటోంది. నీటి నిర్వహణ సరిగాలేక 85శాతం వర్షపునీరు డ్రైనేజీల్లో కలిసిపోతోంది. ఇది భూమిలో ఇంకక సహజమైన నీటికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. 2031 నాటికి 11 మిలియన్లు రెట్టింపయ్యే అవకాశం ఉంది. భూగర్భజలాలు మాత్రం మరింతగా ఇంకిపోతుండటం నీటి వినియోగం పెరగడంతో త్వరలో ఈ నగరం జీరో స్థితికి వచ్చే సూచనలు ఉన్నాయి. 11 మిలియన్ల మందిలో నాలుగు మిలియన్లమంది బోర్‌వెల్స్, ట్యాంకర్లపై ఆధారపడిఉన్నారు. జనాభా పెరగడంతో నగరంలో నీటి స్థితి10-12 మీటర్ల నుండి 20ఏళ్లలో 76-91 మీటర్లకు పడిపోయింది.

మంచి నిద్రతో ...
అనారోగ్యం మటుమాయం

విశాలాంధ్ర జనరల్ డెస్క్ : నిద్ర మన శరీరానికి అత్యంత అవసరం. ప్రతి రోజూ మనం కచ్చితంగా 6 నుంచి 8 గంటల వరకు నిద్రపోవాలి. వృద్ధులు, పిల్లలు అయితే 10 గంటలకు పైగానే నిద్ర పోవాల్సి ఉంటుంది. నిద్ర వల్ల శరీరం రీచార్జ్ అవడమే కాదు, పలు రకాల అనారోగ్య సమస్యలు పోతాయి. మనం నిద్రపోయే క్రమంలో శరీరం తనకు తానే పలు మరమ్మత్తులు కూడా చేసుకుంటుంది. అందుకే మనం కచ్చితంగా రోజూ నిర్దిష్ట సమయం ప్రకారం, నిర్దిష్టమైన గంటలపాటు నిద్రించాలి. అయితే రోజుకు 6 గంటల కన్నా తక్కువగా మాత్రం నిద్రించకూడదు. దాంతో పలు అనారోగ్య సమస్యలు వస్తాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

- నిత్యం 6 గంటల కన్న తక్కువ నిద్రపోతే ఆ తరువాతి 48 గంటల పాటు శరీరానికి సరిపడా ఆక్సిజన్ లభించదు. దీంతో ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు దరి చేరతాయి.
- ఆరు గంటల కన్నా తక్కువ నిద్రిస్తే ఆ రోజంతా ఉత్సాహంగా ఉండరు. నిరాసక్తంగా, స్తబ్దుగా, మబ్బుగా ఉంటారు. ఏ పనీ యాక్టివ్‌గా చేయరు. ఇది మూడ్‌ను మారుస్తుంది.



- నిత్యం తగినన్ని గంటల పాటు నిద్రపోకపోతే అది మెదడుపై ప్రభావం చూపుతుంది. మెదడు షార్ప్‌నెస్ తగ్గుతుంది. దీంతో జ్ఞాపకశక్తి తగ్గడమే కాదు, ఏ విషయాన్ని సరిగ్గా ఆలోచించలేరు. ఆలోచనా శక్తి తగ్గుతుంది. విద్యార్థులు చదువుల్లో రాణించలేరు. ఏ విషయాన్ని సరిగ్గా గుర్తు పెట్టుకోలేరు.
- సరిపడా నిద్రపోకపోతే డిప్రెషన్ బారిన పడతారు. సంతోషం స్థాయిలు తగ్గుతాయి. అలాంటి వారు ఎల్లప్పుడూ మూడీగాఉంటారు. అది ఇతర అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది.
- ఆఫీసులో పనిచేసే ఉద్యోగులైనా, చదువుకునే విద్యార్థులైనా తమ పనిపై సరిగ్గా ఫోకస్ పెట్టలేరు. దీంతో అనుకున్న పని పూర్తి చేయలేకపోతారు. దాని వల్ల ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు ఎదుర్కొంటారు.
- నిత్యం తగినన్ని గంటలు నిద్రపోక పోతే స్త్రీ, పురుషుల్లో శృంగార వాంఛ తగ్గుతుంది. పురుషుల్లో అయితే టెస్టోస్టిరాన్ లెవల్స్ తగ్గి శృంగారం అంటే అంతగా ఆసక్తి ప్రదర్శించరు. ఒక వేళ అందులో పాల్గొన్నా సరైన సామర్థ్యం ఉండదు.
- సరిగ్గా నిద్రపోక పోతే ఎదురయ్యే ఇంకో సమస్య బరువు పెరగడం. నిద్ర తగినంతగా పోకపోతే బరువు పెరుగుతారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కనుక ఫ్యాట్‌గా మారకుండా ఉండాలంటే రోజూ తగినన్ని గంటల నిద్ర అవసరం.
- రోజూ తగినన్ని గంటల పాటు నిద్రపోకపోతే వృద్ధాప్యం త్వరగా వచ్చేస్తుంది. అలాంటి వారి ముఖంపై ముడతలు పడతాయి. అది వృద్ధాప్య ఛాయలను తెలియజేసేం దుకు మొదటి సంకేతం. అలా అలా క్రమంగా వారికి త్వరగా వృద్ధాప్యం వస్తుంది.

విశాలాంధ్ర బిజినెస్

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
అదానీపోర్ట్స్	361.70	0.99
ఇన్ఫోసిస్	1,167.45	0.75
ఎం&ఎం	733.25	0.47
కోల్ ఇండియా	271.95	0.09
ఏషియన్ పెయింట్స్	1,119.00	0.03

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎస్-బ్యాంక్	286.70	-3.87
యాక్సిస్ బ్యాంక్	501.00	-3.34
ఎస్‌బీఐ	234.60	-2.90
ఐసీఐసీఐబ్యాంక్	277.85	-2.73
టాటాస్టీల్	569.25	-2.40

విదేశీమారకం విలువ (ఫారెక్స్)		
కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	65.10	65.01
యూరో	80.22	80.19
పౌండ్	92.05	91.85
ఆస్ట్రేలియా డాలర్	50.21	50.24
సింగపూర్ డాలర్	49.49	49.47

బులియన్		
బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,390	31,433
చెన్నై	29,390	31,433
బెంగళూరు	28,450	30,427
ముంబై	29,980	32,064
విజయవాడ	29,350	31,800
విశాఖపట్నం	29,340	31,370
ప్రొద్దుటూరు	29,340	30,810
ముడి చమురు		69.91

వాణిజ్య యుద్ధంతో కకావికలం

- సెన్సెక్స్ 579పాయింట్ల నష్టం
- నిఫ్టీ 197 పాయింట్లు

ఈ వారం దేశీయ మార్కెట్లు

అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ చైనా దిగుమతులపై విధించిన వాణిజ్య సుంకాల ధాటికి ప్రపంచ మార్కెట్లు కకావికలమై పోయాయి. దీనికిగాను చైనా ప్రతిచర్యతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. అమెరికా రక్షణాత్మక విధానాలకు ప్రతిగా ఇతర దేశాలు ప్రతిచర్యలు తీసుకుంటాయని. దీంతో వాణిజ్య యుద్ధాలు చెలరేగుతాయనే ఆందోళన మదుపరులు షేర్ల అమ్మకాలకు మొగ్గుచూపారు. వాణిజ్య యుద్ధ భయాలకు తోడు ముడి చమురు ధరలు భగ్గుమనడం, మరో రూ.1,241 కోట్ల బ్యాంక్ రుణ మోసం వెలుగులోకి రావడం, మరో వారంలోనే దీర్ఘకాల మూలధన లాభాల పన్ను అమల్లోకి రానుండటరి అంశాలు కూడా జత కావడంతో మన మార్కెట్లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఎన్ఎస్ఈ నిఫ్టీ కీలకమైన 10,000 పాయింట్ల దిగువకు, బీఎస్ఈ సెన్సెక్స్ మళ్లీ 33 వేల పాయింట్ల దిగువకు పతనమయ్యాయి. ఈ సూచీలు ఐదు నెలల కనిష్ట స్థాయికి దిగజారాయి. ఐటీ, మీడియా మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 410 పాయింట్లు(1.24%) నష్టపోయి 32,597 వద్ద, నిఫ్టీ 117 పాయింట్లు (1.15%)పతనమై 9,998 పాయింట్ల వద్ద ముగిశాయి. ఈ ఏడాది స్టాక్‌సూచీల కనిష్ట స్థాయిలు ఇవే. రియల్టీ, లోహ, బ్యాంక్, క్యాపిటల్ గూడ్స్, హెల్త్‌కేర్, పీఎస్‌యూ, వాహన, ఆయిల్, గ్యాస్ షేర్లు పడిపోయాయి. నిఫ్టీ 10 వేల దిగువకు రావడం గత ఏడాది అక్టోబర్ 11 తర్వాత ఇదే తొలిసారి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 522 పాయింట్లు, నిఫ్టీ 163 పాయింట్లు నష్టపోయాయి.



నాలుగో వారమూ నష్టాలే... వరుసగా నాలుగో వారం కూడా సూచీలు నష్టపోయాయి. ఈ వారంలో సెన్సెక్స్ 579 పాయింట్లు (1.75%), నిఫ్టీ 197 పాయింట్లు(1.93%) చొప్పున నష్టపోయాయి. ఈ నెల 15 ట్రేడింగ్ సెషన్లలో 10 సెషన్లలో స్టాక్ మార్కెట్ నష్టాల్లోనే ముగిసింది. ఈ నెలలో ఇప్పటివరకూ సెన్సెక్స్ 3.45%, నిఫ్టీ 3.6% చొప్పున క్షీణించాయి. రూ.3.9 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైపోయింది. 2018 జనవరి 29 నుండి చూస్తే మొత్తం రూ.15.8 లక్షల కోట్లుగా నమోదైంది. మెటల్ స్టాక్స్ లోకూడా షేర్లు నష్టపోయాయి. నిఫ్టీ బ్యాంకు 3.3శాతం, పిఎస్‌యు బ్యాంకు 7.5శాతం, మెటల్ ఇండెక్స్ 6శాతానికి దిగజారాయి.

ఆల్‌టైమ్ హై నుంచి 10 శాతం డౌన్... వాణిజ్య యుద్ధ భయాల ఆందోళనలకు తోడు ముడి చమురు ధరలు కూడా ఎగియడంతో మార్కెట్ భారీగా నష్టపోయిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. రికార్డ్ స్థాయిల నుంచి ప్రధాన స్టాక్ సూచీలు 10 శాతానికి పైగా కరెక్టయ్యాయని, లోహ, ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్ల పతనం కొనసాగుతోందని వివరించారు. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలు ప్రపంచ మార్కెట్లను పడగొట్టాయని సెంట్రమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ హెడ్(ఈక్విటీ) దేవాంగ్ మెహతా చెప్పారు. ఇక దేశీయంగా గత నెల ఆరంభం నుంచే మార్కెట్లు పతనమవుతు న్నాయని పేర్కొన్నారు. దీర్ఘకాల మూలధన లాభాల పన్ను(ఎల్‌టీసీజీ), బ్యాంక్ రుణ మోసాలు తగిన ప్రభావం చూపుతున్నాయని వివరించారు. ఎన్నికలు మరో ఏడాదిలో రానున్న కారణంగా ఒడిదుడుకులు మరింత తీవ్రంగా మరికొంత కాలం పాటు కొనసాగుతాయని ఆయన అంచనా వేస్తున్నారు. వారాంతం కావడం, వచ్చే వారమే ఈ నెల డెరివేటివ్స్ కాంట్రాక్టులు ముగియడం వంటి కారణాల వల్ల పొజిషన్లు తీసుకోవడానికి ట్రేడర్లు ముందుకు రాలేదని, దీంతో కొనుగోళ్ల మద్దతు లభించలేదని ఒక బ్రోకర్ పేర్కొన్నారు. మరో వారంలో దీర్ఘకాల మూలధన లాభాల పన్ను అమలు కానున్నందున మార్కెట్లో ఒడిదుడుకులు కొనసాగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఏడాది కనిష్టానికి ఎస్‌బీఐ.. తాజా పతనంతో పలు షేర్లు తాజా ఏడాది కనిష్ట స్థాయిలను తాకాయి. ఎస్‌బీఐ, టాటామోటార్స్, భెల్, అంబుజా, భారత్ ఎలక్ట్రానిక్స్, కేడిలా హెల్త్‌కేర్, కమిన్స్ ఇండియా, ఇండియన్ ఆయిల్, లుపిన్, పీఎఫ్‌సీ తదితర బీఎస్ఈ 500 సూచీలోని 60 షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

పతనానికి ప్రధాన కారణాలు..

వాణిజ్య ఉద్రిక్తతలు: చైనా దిగుమతులపై అమెరికా 6,000 కోట్ల డాలర్ల మేర సుంకాలు విధించింది. దీనికి ప్రతిగా అమెరికా దిగుమతులపై చైనా 300 కోట్ల డాలర్ల మేర సుంకాలు విధించింది. రక్షణాత్మక విధానాలకు ప్రతి చర్యలు ఉంటాయని, దీంతో వాణిజ్య యుద్ధాలు చెలరేగుతాయనే భయాలతో గురువారం అమెరికా మార్కెట్ భారీగా నష్టపోయింది. దీంతో ఆసియా మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలతో ఆరంభమయ్యాయి. మన స్టాక్ మార్కెట్ కూడా నష్టాల్లోనే ఆరంభమైంది. జపాన్ నికాయ్ 4.5%, హాంగ్ కాంగ్ హాంగ్‌సెంగ్ 2.4%, షాంగై కాంపొజిట్ 3.3% చొప్పున నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు నష్టాలతోనే ఆరంభమయ్యాయి.

బ్యాంక్ షేర్లు బేజారు...: రూ.1,394 కోట్ల రుణ మోసం విషయమై టొటొమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై సీబీఐ కేసు దాఖలు చేయడంతో బ్యాంక్ షేర్లు కుప్పకూలాయి. ఈ కంపెనీకి అత్యధికంగా రుణాలిచ్చిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 8% పతనమై రూ.86.85 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ 9% నష్టంతో 11 ఏళ్ల కనిష్టానికి, రూ.86కు పడిపోయింది. బ్యాంక్ నిఫ్టీ 471 పాయింట్లు నష్టపోయి 8 నెలల కనిష్టానికి 23,670 పాయింట్లకు పడిపోయింది. యాక్సిస్, పీఎన్‌బీ, యస్‌బ్యాంక్, కెనరా బ్యాంక్, ఐసీఐసీఐ, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, బీఓబీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు 4% వరకూ నష్టపోయాయి.

ముడిచమురు ధరలు: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భగ్గుమనడం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. 2017 నాటి ఉత్పత్తి కోతను వచ్చే ఏడాది కూడా అమలు చేయడానికి ఒపెక్‌ను, రష్యాని ఒప్పించాలని సౌదీ యోచిస్తోందన్న వార్తల కారణంగా శుక్రవారం చమురు ధరలు 1% ఎగిశాయి. చమురు ధరలు పెరిగితే కరంట్ అకౌంట్ లోటు ఎగబాకుతుందనే ఆందోళన ఇన్వెస్టర్లను కలవరపాటుకు గురిచేసింది.

టెక్నికల్: నిఫ్టీ 10,200కు ఎగిసిన 4 పర్యాయాల్లో 3 సార్లు అమ్మకాల ఒత్తిడి కనిపించిందని, మార్కెట్ పెరగాలంటే నిఫ్టీకి 10,200 మార్క్ కీలకమని అనలిస్ట్‌లు అంటున్నారు. ప్రస్తుత స్థాయిల నుంచి పడిపోతే తాజా కనిష్ట స్థాయిలు తప్పవని వారంటున్నారు.

రోజర్ డుబిస్‌తో వెల్వెట్ కేవియర్ డీల్




విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రముఖ ఫ్యాషన్ ఉత్పత్తుల సంస్థ వెల్వెట్ కేవియర్‌కు ప్రముఖ వాచీల ఉత్పత్తు సంస్థ రోగర్ దుబిస్‌తో భాగస్వామ్యం కుదిరింది. ఫ్యాషన్ రంగంలో రాణించే ఈ రెండు సంస్థల మధ్య భాగస్వామ్యం కుదరడంతో వినియోగదారులకు అత్త్యుత్తమ సేవలు అందనున్నాయి. రోగర్ దుబిస్, వెల్వెట్ కేవియర్ సంస్థలు అత్యుత్తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులను రూపొందిస్తుంటాయి.

మార్కెట్‌లోకి అపీస్ ఇండియా ఖర్జూరాలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రముఖ పోషకాహార ఉత్పత్తులను మార్కెట్‌కు అందించే అపీస్ ఇండియా తాజాగా రెండు వెరైటీలలో అపీస్ అరేబియన్ పెరల్ పేరిట అత్యంత నాణ్యమైన ఖర్జూరాలను ప్రవేశపెట్టింది. ఇప్పటికే తేనె, బేకరీ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. తాజాగా ఖర్జూరాలు 500 గ్రాములు, 250 గ్రాములు ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు సంస్థ తెలిపింది. ఇవి దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ షోరూంలతో పాటు ఆన్‌లైన్‌లోనూ లభిస్తాయని పేర్కొంది. ఖర్జూరాలో పుష్కలంగా ఉండే వివిధ రకాల మినరల్స్, విటమిన్స్, ఫైబర్‌తో పాటు హెల్తీఫ్యాట్, క్యాల్షియం మొదలైనవి ఉన్నాయని, ఇవి చక్కని ఆరోగ్యానికి దోహదపడుతాయని తెలిపింది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-409.73 ▼	-116.70 ▼	200 ▲	29,340	300 ▲	41,600	65.01
32,596.54	9,998.05	29,350	ప్రొద్దుటూరు 29,340	39,800	ప్రొద్దుటూరు 41,536	
			22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

ఆరోగ్య బీమా క్లెయిం విధానం



ఆరోగ్య బీమా క్లెయిం విధానంలో జాగ్రత్తలు తీసుకుంటే పరిహారం లభించడంలో జాప్యం ఏర్పడదు. ఆరోగ్య బీమా క్లెయిం చేసుకునేటప్పుడు పలు కీలక పత్రాలు అవసరమవుతాయి. ఆపదలో ఆదుకోవడానికే ఆరోగ్య బీమా పాలసీలు తీసుకుంటాం. హఠాత్తుగా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మన హడావిడిలో మనం ఉంటాం. అలాంటప్పుడు క్లెయిం కోసం కచ్చితంగా చేయాల్సిన పనులు కొన్ని ఉంటాయి.

వైద్య సహాయ నిమిత్తం ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటాం. కొన్ని సార్లు అవుట్ పేషెంట్‌గా వెళ్లి చికిత్స పొందుతాం. మరికొన్నిసార్లు ప్రత్యేక రుగ్మతలకు ముందుగానే చికిత్స చేయించుకోవాలని నిశ్చయించుకొని వెళతాం. రోడ్డు ప్రమాదాలు, గుండె జబ్బులు వంటివాటికైతే రోగిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించాల్సి ఉంటుంది. ఇలా వివిధ సందర్భాలలో ఆరోగ్య బీమా క్లెయిమ్ చేసుకునేందుకు అవసరమైన వివరాలు, విధానం తెలుసుకోవడం ఎంతోముఖ్యం.

క్లెయిం చేసుకునేందుకు సేకరించాల్సిన పత్రాలు

– ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి డాక్టర్ల ప్రిస్క్రిప్షన్లు, బిల్లులు, రశీదులు వంటివన్నీ సేకరించుకోవాలి.

– బిల్లులు, రశీదులపై పాలసీదారుడి పేరు, తేదీలు సరిగ్గా ఉన్నాయా లేదా చూసుకోవాలి.

– ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యేటప్పుడు డిశ్చార్జి కార్డు తీసుకోవాలి.

ప్రిస్క్రిప్షన్, బిల్లులు, రశీదుల జిరాక్సు కాపీలను సిద్ధం చేసుకోండి. క్లెయిం చేసేటప్పుడు ఒరిజినల్ వాటితో పాటు ఒక సెట్టు జిరాక్స్ కాపీలను ఉంచండి. మన దగ్గర కూడా ఒక సెట్టు జిరాక్స్ కాపీ ఉంచుకోవడం మంచిది.

కంపెనీ నుంచి క్లెయిం పత్రాన్ని పొందాల్సి ఉంటుంది. ఇది ఆయా కంపెనీ వెబ్‌సైట్లో లేదా ఏజెంటు ద్వారా లభిస్తుంది. దాన్ని నింపి అనుబంధ రశీదులు, ప్రిస్క్రిప్షన్లు తేదీల వారీగా సిద్ధం చేసుకోవాలి.

– ఆరోగ్య బీమా పాలసీ కాపీ

– థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్ (టీపీఏ) జారీచేసే టీపీఏ కార్డు

– క్లెయిం ఫారంపై పాలసీదారు, డాక్టరు ధ్రువీకరించినట్టు సంతకం చేయాల్సి ఉంటుంది.

– చికిత్స కోసం ఆసుపత్రిలో చేరేందుకు వైద్యుడి నుంచి సిఫార్సు

క్లెయిం చేసుకునేటప్పుడు ఇలా సంప్రదించాలి

రోగిని ఆసుపత్రిలో చేర్చే ముందు లేదా చేరిన 24 గంటలలోపు ఆ విషయాన్ని టోల్ ఫ్రీ నంబరు ద్వారా లేదా మెయిల్ ద్వారా బీమా కంపెనీకి తెలియపర్చాలి.

ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత లేదా చికిత్స ముగిసిన ఏడు రోజుల్లోగా క్లెయిం కోసం బీమా కంపెనీని సంప్రదించి విధివిధానాలను పూర్తిచేయాలి.

నియమనిబంధనలకు అనుగుణంగా లేని పత్రాలకు బీమా కంపెనీలు క్లెయిం చెల్లించవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

అన్ని ఆసుపత్రి ఖర్చులను బీమా కంపెనీలు చెల్లించవు. పాలసీ పరిధిలోకి వచ్చేవాటిని మాత్రమే చెల్లిస్తారు. దీని కోసం పాలసీ పత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి.

నగదు రహిత చికిత్స కోసం అయితే..

టీపీఏ లేదా బీమా కంపెనీ పాలసీ తీసుకున్న తర్వాత ఓ గుర్తింపు కార్డును జారీచేస్తారు. ఆసుపత్రిలో చేరే సమయంలో దీన్ని చూపించాల్సి వస్తుంది.

ఆసుపత్రిలో చేరిన తర్వాత 24 గంటల లోపు ఫోన్ ద్వారా లేదా ఈమెయిల్ ద్వారా బీమా కంపెనీకి సమాచారం అందించాలి. అప్పుడు క్లెయిం ఇంటిమేషన్ సంఖ్యను బీమా కంపెనీ కేటాయిస్తుంది.

నగదు రహిత సదుపాయాన్ని పొందేందుకు బీమా కంపెనీ నియమనిబంధనల మేరకు ముందే అనుమతి పొందాల్సి ఉంటుంది.

నెట్‌వర్క్ పరిధి ఆసుపత్రులైతే నగదు రహిత సదుపాయం వర్తిస్తుంది. నెట్‌వర్క్ పరిధి దాటిన వాటికి బిల్లులు, రశీదులు పెట్టి క్లెయిం చేసుకోవాల్సి ఉంటుంది.

చికిత్స సమయంలో కొన్ని ఆసుపత్రులు టీపీఏ ఒప్పందాన్ని అనుసరించి 15 నుంచి 20 శాతం డిపాజిట్‌ను ముందే వసూలు చేస్తాయి. ఈ మొత్తాన్ని క్లెయిం చేసుకునేటప్పుడు తిరిగి చెల్లిస్తారు.

రీయింబర్స్‌మెంట్ కోసం ఇలా:

- ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక డిశ్చార్జి కార్డును పొందాలి.
- డిశ్చార్జి కార్డు, బిల్లులు, రశీదుల జిరాక్సు కాపీలను సిద్ధంగా ఉంచుకోవాలి.
- చికిత్స ఇంటి వద్ద కూడా కొనసాగే సందర్భంలో డాక్టరు సిఫార్సు పొందాల్సి ఉంటుంది.
- క్లెయిం ఫారం, ఒరిజినల్ బిల్లులు, డిశ్చార్జి కార్డు, బీమా కంపెనీ నిర్దేశించిన ఇతర పత్రాలను సమర్పించి క్లెయిం చేసుకోవాలి.
- క్లెయిం ఫారంను నేరుగా బీమా కంపెనీకి సమర్పించాలనుకుంటే, వారి వద్ద నుంచి కంపెనీ ముద్ర ఉన్న రశీదును పొందాలి. నేరుగా చేర్చే అవకాశం లేనప్పుడు కొరియర్, స్పీడ్ పోస్ట్ లేదా రిజిస్టర్డ్ పోస్టుల ద్వారా పంపిస్తే భరోసా ఉంటుంది.



క్రెడిట్ కార్డు రివార్డు పాయింట్లతో ప్రయోజనం



షాపింగ్ సంస్కృతి పెరగడంతో పాటు, వివిధ ఉద్యోగాల కారణంగా వ్యక్తులు సంపాదించే ఆదాయం పెరగడంతో కార్డుల వాడకం బాగా పెరిగింది. క్రెడిట్ కార్డుతో షాపింగ్ అనగానే వెంటనే గుర్తొచ్చే విషయం రివార్డు పాయింట్లు. చాలా క్రెడిట్ కార్డు కంపెనీలు గొలుసుకట్టు దుకాణాలు, ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లతో ఒప్పందాలు కుదుర్చుకుని కొన్ని రకాల సేవలను ఉపయోగించినప్పుడు, కొన్ని రకాల వస్తువులను కొన్నప్పుడు వినియోగదారుడికి అదనంగా రివార్డు పాయింట్లను అందిస్తున్నాయి. ఇదంతా వినియోగదారులు మరింతగా క్రెడిట్ కార్డులు ఉపయోగించేందుకు, వారికి ప్రోత్సాహకాలను అందించేందుకే. కంపెనీని బట్టి రివార్డు పాయింట్స్ సౌలభ్యాలు మారుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో రివార్డు పాయింట్ల వల్ల కలిగే ప్రయోజనం, సకాలంలో వీటిని ఎలా ఉపయోగించాలి, అలా వాడుకోకపోతే ఏమవుతోందో తెలుసుకుందాం.

రివార్డు పాయింట్ల కోసం క్రెడిట్ కార్డులు కాదు....

అయితే రివార్డు పాయింట్స్ కోసమే రివార్డ్ క్రెడిట్ కార్డులను అందించే వాటి కోసం చూడకూడదు. ఎందుకంటే రివార్డు కార్డులకు సాధారణ కార్డుల కన్నా అధిక వడ్డీ వసూలు చేస్తారు. అన్ని కార్డులు, లావాదేవీలకు రివార్డు పాయింట్లు ఒకేలా ఉండవు. సాధారణంగా వినియోగించే ప్రతి 100 నుంచి 150 రూపాయలకు ఒకటి లేదా రెండు పాయింట్లు వస్తాయి. ఇలా ఆర్జించిన రివార్డు పాయింట్లన్నంటినీ ఉపయోగించుకుని కంపెనీ అందించే వివిధ వస్తువులు లేదా సేవలను పొందవచ్చు. కొన్ని బ్యాంక్‌లు పాయింట్లను రిడీమ్ చేసేందుకు సైతం రుసుములను విధిస్తున్నాయి. ఇందుకోసం క్రెడిట్ కార్డు నియమనిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఏదైనా సందేహం వస్తే కస్టమర్ కేర్‌ను సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవాలి.

సాధ్యమైనన్ని ఎక్కువ పాయింట్లు ఇలా...

చాలా మంది ఎక్కువ పాయింట్ల కోసం ఎక్కువ కొనాలనుకుంటారు. అలా కాకుండా తెలివిగా కార్డును వాడుకోవడం ద్వారా ఎక్కువ పాయింట్లను సంపాదించవచ్చు. పండుగల సమయాల్లో బ్యాంకులు, క్రెడిట్ కార్డు కంపెనీలు వివిధ ఆఫర్ల మెయిల్స్ పంపుతుంటాయి. వాటన్నింటినీ చూడకుండా అలా వదిలేయకూడదు. అప్పుడప్పుడు అవసరాలకు తగిన వాటిపై ఆఫర్లు ఏమైనా ఉంటే గమనిస్తూ ఉండాలి.

షాపింగ్, ఖర్చు, క్రెడిట్ కార్డు వినియోగం- రివార్డు పాయింట్లు

- క్రెడిట్ కార్డు కంపెనీలు ట్రావెల్ కంపెనీలతోను, రెస్టారెంట్లతోనూ, వస్త్ర దుకాణాలతో కలిపి క్యాష్‌బ్యాక్ ఆఫర్లను ప్రకటిస్తాయి
- కొన్ని కంపెనీలు గిఫ్ట్‌వోచర్లను ప్రకటిస్తాయి. వాటితో ట్రావెల్ కంపెనీల టికెట్లను, రెస్టారెంట్లలో డిస్కౌంట్లకు వాడుకోవచ్చు.
- కొన్ని కార్డులు చమురు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని, పెట్రోలు, డీజిల్ కొన్న ప్రతిసారీ కొంత శాతం ధర తగ్గించి ఇస్తున్నాయి.
- తరుచూ విమాన ప్రయాణాలు చేసేవారికి, విమాన ప్రయాణ టికెట్లలో రాయితీలను పొందేందుకు కొన్ని కార్డులు అవకాశం కల్పిస్తున్నాయి.
- గోల్డ్ క్రెడిట్ కార్డులు కలిగిన వారికి క్యాష్‌బ్యాక్ ఆఫర్లతో పాటు రివార్డు పాయింట్లు వచ్చే అవకాశం కూడా ఉంటుంది.
- కొన్ని కంపెనీలు రివార్డు పాయింట్లను నగదుగా మార్చుకునేందుకు సైతం వీలు కల్పిస్తున్నాయి.

పాయింట్ల ద్వారా ప్రయోజనం

పాయింట్లను ఎలా రిడీమ్ చేసుకోవాలో బ్యాంక్ వెబ్‌సైట్లలో పొందుపరుస్తారు. రిడీమ్ చేసుకున్న పాయింట్లతో వచ్చే సదుపాయాలు బ్యాంకును బట్టి మారుతూ ఉంటాయి.

వివిధ పద్ధతులు :

- రివార్డు పాయింట్లతో ఎంపిక చేసిన వస్త్రదుకాణాలు, గోల్డ్ షాప్‌లు, పాదరక్షల కంపెనీలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాల కంపెనీలు వంటి వాటిలో ఏవైనా వస్తువులు కొనేందుకు ఉపయోగించవచ్చు.
- ఫోన్‌చేసి: ఎక్కువ కంపెనీలు కస్టమర్ కేర్ ప్రతినిధులకు ఫోన్‌చేసి మీకు వర్తించే ఆఫర్లను తెలుసుకుని వెంటనే ఆర్డర్ చేసేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. తర్వాత మీరు సూచించిన చిరునామాలో ఆ వస్తువులను పొందవచ్చు.
- పోస్ట్ ద్వారా : కంపెనీ వెబ్‌సైట్లలో రిడెంప్షన్ ఫామ్ లభిస్తుంది. దాన్ని పూర్తిచేసి అక్కడ తెలియపరిచిన చిరునామాకు దాన్నిపోస్ట్‌చేయాలి.
- ఆన్‌లైన్ రిడెంప్షన్ : కంపెనీ వెబ్‌సైట్లలో నెట్‌బ్యాంకింగ్‌లో లాగిన్ అవ్వాలి. క్రెడిట్ కార్డు నెంబరును పొందుపరచాలి. పాయింట్స్ రిడీమ్ ఆప్షన్ ఎంచుకోవాలి. రిడెంప్షన్‌ను ఎంచుకున్న తర్వాత సబ్‌మిట్ నొక్కాలి. రిడీమ్ చేసిన తర్వాత రిడెంప్షన్ ఆర్డర్ నంబరు వస్తుంది. ఏదైనా సమస్య వస్తే తరచి చూసేందుకు వీలుగా దాన్ని రాసి ఉంచుకోవాలి.
- కొంత శాతం నగదు చెల్లించడం, మిగిలిన ధరకు రిడీమ్ చేసిన పాయింట్లను వాడుకునే సౌలభ్యాన్ని కల్పిస్తూ కొన్ని కంపెనీలు వస్తుసేవలను అందిస్తున్నాయి.
- సాధారణంగా కంపెనీ వెబ్‌సైట్లో లాగిన్ అవ్వగానే రిడీమ్ చేసే వస్తువులు, సేవలకు సంబంధించిన కేటలాగ్ ఉంటుంది. దాని ఆధారంగా మనకు ఉత్తమమైన దానిని ఎంచుకోవచ్చు. కొన్ని వెబ్‌సైట్లలో రివార్డు పాయింట్ల సంఖ్య, వస్తువుల కేటగిరీలను బట్టి ఆ పరిధిలోకి వచ్చే వస్తువులను అందుబాటులో ఉంచుతాయి. మనకు నచ్చిన దానిని ఎంపిక చేసుకుని ఆర్డర్ చేయవచ్చు. క్రెడిట్ కార్డును జాగ్రత్తగా వాడుతూ రివార్డు పాయింట్లను సకాలంలో వినియోగించుకుంటే కార్డు వల్ల మేలు కలుగుతుంది.



విజయ్ ఆంటోని కాశి



నకిలీ, డా.సలీం తర్వాత తెలుగులో వచ్చిన బిచ్చగాడుతో సెన్సేషన్ క్రియేట్ చేసిన హీరో విజయ్ ఆంటోని. తర్వాత ఆయన నటించిన యమన్, భేతాళుడు, ఇంద్రసేన చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. రెగ్యులర్‌కి భిన్నంగా ఉండే సినిమాల్లో నటించడమే విజయ్ ఆంటోని సక్సెస్ సీక్రెట్. అందుకే ఆయన తెలుగు ప్రేక్షకుల హృదయాలకు చేరువయ్యారు.

హీరోయిజమ్‌తో పాటు కథను ప్రధానంగా చేసుకుని దాని చుట్టూ పాత్రలను మలిచే దర్శకులతోనే విజయ్ ఆంటోని సినిమాలు చేస్తూ వస్తున్నారు. అందుకనే కొత్తదనాన్ని ఆదరించే తెలుగు ప్రేక్షకులకు విజయ్ ఆంటోని సినిమా అంటే ఓ ఆసక్తి ఏర్పడింది. ఇప్పుడు కాశి సినిమా ద్వారా సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. అంజలి, సునయన హీరోయిన్లుగా నటించారు. విజయ్ ఆంటోని ఫిలిమ్ కార్పొరేషన్ పతాకంపై కృతిజ ఉదయనిధి దర్శకత్వంలో ఫాతిమా విజయ్ ఆంటోని ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌కు ప్రేక్షకుల నుండి మంచి స్పందన వచ్చింది. విజయ్ ఆంటోని ఇందులో మూడు షేడ్స్ ఉన్న పాత్రలో మెప్పిస్తున్నారు. మదర్ సెంటిమెంట్, ఎమోషన్, లవ్, యాక్షన్ ఇలా అన్ని ఎలిమెంట్స్ సినిమాలో ఉండబోతున్నట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తుంది.

విజయ్ ఆంటోని బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రిచర్డ్ ఎం.నాథన్ సినిమాటోగ్రఫీ సినిమాకు మేజర్ ఎసెట్స్‌గా నిలుస్తున్నాయి. మంచి టీంతో చేసిన ఈ సినిమాకు తెలుగులో బాషా శ్రీ మాటలు, పాటలు అందిస్తున్నారు. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. విజయ్ ఆంటోని, అంజలి, సునయన, అమ్రిత, శిల్పా మంజునాథ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఎడిటింగ్: లారెన్స్ కిశోర్, సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ఎం.నాథన్, సంగీతం: విజయ్ ఆంటోని, నిర్మాత: ఫాతిమా విజయ్ ఆంటోని, దర్శకత్వం: కృతిక ఉదయనిధి.

'టాక్సీవాలా' ఫస్ట్‌లుక్



పెళ్లి చూపులు, అర్జున్ రెడ్డి చిత్రాలతో నటుడుగా, యువ హీరోల్లో సెన్సేషనల్ స్టార్‌గా స్టార్‌డమ్ తెచ్చుకున్న విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సీవాలా'. టాలీవుడ్ అగ్రనిర్మాణసంస్థలు జీఏ 2 యువి పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఎస్ కె ఎన్ నిర్మాత. రాహుల్ సంకృత్యాన్ దర్శకుడిగా తెరంగేట్రం చేస్తున్నారు. ఫస్ట్ గేర్‌తో తన కారును రయ్ రయ్ అంటూ తన ఎనర్జీని పరిచయం చేసిన విజయ్ దేవరకొండ నిన్న కారు దిగి ఫస్ట్‌లుక్ ఇచ్చేశాడు. టాక్సీ వాలాగా విజయ్ స్టైల్ అదరకొడుతోంది. డిఫెరెంట్ లుక్‌తో తన కారుకు ఆనుకొని స్టైల్‌గా నిల్చున్న ఈ లుక్ యూత్ ఆడియన్స్‌ని బాగా ఆకట్టుకుంటోంది. 'అర్జున్ రెడ్డి' చిత్రంతో విజయ్ దేవరకొండకి యూత్‌లో క్రేజ్ ఎలా పెరిగిందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఆ అంచనాలకు ఏ మాత్రం తీసుపోకుండా టాక్సీవాలా చిత్రం రూపుదిద్దుకుంటుందని, విజయ్ కెరియర్‌లో మరో మైలురాయిగా నిలిచిపోయే చిత్రంగా 'టాక్సీవాలా' ఉండబోతోందని చిత్ర యూనిట్ తెలియజేసింది.

రీఎంట్రీతో వరుస ఛాన్స్‌లు అందుకుంటున్న లిజీ



ఒకప్పుడు తన సినిమాలతో కుర్రకారు మనసులో మంచి స్థానం సంపాదించుకున్న లిజీ చాలా కాలం పాటు ఇండస్ట్రీకి దూరంగా ఉండి పోయింది. ఇటీవలే రీ ఎంట్రీ ఇచ్చిన లిజీ చైతన్య కృష్ణ డైరెక్షన్‌లో తెరకెక్కిన నితిన్, మేఘా ఆకాష్ నటించిన ఛల్ మోహన్ రంగ సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. తెలుగు, తమిళ్, మలయాళానికి సంబంధించిన ఎన్నో ఆఫర్లు వచ్చినా వాటన్నింటినీ తిరస్కరించి సెలక్టెడ్‌గా మూవీస్ ఎంచుకుంటోంది. ఇటీవలే లిజీ మరో సినిమాకు సైన్ చేసినట్టు వార్తలు వస్తున్నాయి. అడవి శేష్, హీరో రాజశేఖర్ కుమార్తె శివాని జంటగా వెంకట్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న సినిమాకు లిజీ ఓ కీలక పాత్రకు సైన్ చేసినట్టు సమాచారం.

వేసవి కానుకగా 'మెహబూబా'



స్టార్ డైరెక్టర్ పూరిజగన్నాథ్ ప్రస్తుతం తన కుమారుడు ఆకాష్ పూరి హీరోగా 'మెహబూబా' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. చిత్రీకరణ మొత్తం పూర్తిచేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. 1971 ఇండియా, పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో నడిచే ప్రేమ కథగా ఉండనున్న ఈ సినిమాలో నూతన నటి నేహా శెట్టి కథానాయకిగా నటిస్తోంది. ఈ చిత్రాన్ని మే 11న వేసవి కానుకగా విడుదలచేయనున్నారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఈ చిత్రం యొక్క ప్రపంచవ్యాప్త విడుదల హక్కుల్ని సొంతం చేసుకున్నారు. సొంత బ్యానర్ పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్ బ్యానర్‌పై పూరి స్వయంగా నిర్మించిన ఈ చిత్రానికి సందీప్ చౌత స్వరాలు సమకూరుస్తున్నారు. ఇటీవలే విడుదలైన చిత్ర టీజర్‌కు కూడా మంచి స్పందన లభించింది.

విశాలాంధ్ర సినిమా

భరత్ అనే నేను ఆడియో ఫంక్షన్ వేదిక మార్పు



విశాఖలో భారీగా భరత్ అనే నేను మూవీ ఆడియో ఫంక్షన్ చేయాలని మేకర్స్ నిర్ణయించారు. అయితే ఇంతలోనే ఈ సినిమా వేడుక వేదిక మారబోతోంది. అవును.. విశాఖలో కాకుండా విజయవాడలో భరత్ అనే నేను పాటల విడుదల వేడుకను ఏర్పాటుచేయాలని అనుకుంటున్నారు. మహేష్ బావ గల్లా జయదేవ్ నియోజకవర్గంలో.. గుంటూరు-విజయవాడ మధ్యలో భరత్ అనే నేను ఆడియోను ఆవిష్కరించాలని తాజాగా నిర్ణయించారు. వేదిక మారినా ఈ ఆడియో ఫంక్షన్ రిలీజ్ డేట్ మాత్రం మారలేదు. ఏప్రిల్ 7న సినిమా ఆడియో రిలీజ్ అవుతుంది.

దేవిశ్రీప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందించాడు. ఇక సినిమా షూటింగ్ విషయానికొస్తే తాజాగా హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయింది. రెండు పాటల చిత్రీకరణ కోసం త్వరలోనే స్పెయిన్ వెళ్తుంది యూనిట్. కొరటాల శివ డైరక్ట్ చేస్తున్న ఈ సినిమాలో కైరా అద్వానీ హీరోయిన్.

మే 11న రానున్న 'రాజుగాడు'



యంగ్ హీరో రాజ్‌తరుణ్ నటించిన తాజా చిత్రం 'రాజుగాడు'. నూతన దర్శకురాలు సంజన రెడ్డి డైరెక్ట్ చేసిన ఈ చిత్రం ప్రస్తుతం ప్రోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఇటీవలే విడుదలైన చిత్ర టీజర్ కూడ మంచి ఫన్‌తో నిండి సినిమాపై ఆసక్తిని రేకెత్తించింది. ఈ చిత్రాన్ని మే 11న ప్రేక్షకులకు అందివ్వాలని నిర్మాతలు నిర్ణయించారు. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సుంకర రామబ్రహ్మం నిర్మించిన ఈ చిత్రంలో రాజ్ తరుణ్ దొంతనం చేసే లోపం ఉన్న కుర్రాడిగా కనిపించనున్నాడు. సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఒక కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో అమైరా దస్తూర్ రాజ్ తరుణ్‌కు జోడీగా నటించింది. గత చిత్రం 'రంగుల రాట్నం' పరాజయం చెందడంతో రాజ్ తరుణ్ ఈ చిత్రంతో సాలిడ్ హిట్ అందుకోవాలని భావిస్తున్నారు .

'ఎంఎల్ఏ'కి మంచి ఓపెనింగ్స్



నందమూరి హీరో కళ్యాణ్ రామ్ నటించిన తాజా చిత్రం 'ఎం.ఎల్.ఏ'. శుక్రవారం భారీ ఎత్తున విడుదలైన ఈ సినిమా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి ఓపెనింగ్స్ రాబట్టింది. రెండు రోజులు వీకెండ్ కావడం వలన ఈ వసూళ్ళు ఇలానే కొనసాగే అవకాశాలున్నాయి. మాస్ సెంటర్లలో చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. కళ్యాణ్ రామ్ సరసన కాజల్ అగర్వాల్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ఉపేంద్ర మాధవ్ డైరెక్ట్ చేయగా భరత్ చౌదరి, కిరణ్ రెడ్డిలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇకపోతే ఏప్రిల్ నెలాఖరు నుండి సినిమాటోగ్రఫర్ గుహన్ దర్శకత్వంలో ఒక సినిమాను మొదలుపెట్టనున్న కళ్యాణ్ రామ్ మే 25న 'నా నువ్వే' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు.

సింగిల్ షెడ్యూల్లో ఎన్టీఆర్ సినిమాను పూర్తిచేయనున్నాడు

యంగ్ టైగర్ ఎన్టీఆర్ తన తర్వాతి సినిమాను త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ రెండో వారంలో మొదలుపెట్టనున్నారు. చిత్రీకరణ కోసం ఇప్పటికే భారీ సెట్‌ను సైతం డిజైన్ చేస్తున్నారట. త్వరలో ఎన్టీఆర్ రాజమౌళి చిత్ర పనుల్లో జాయిన్ కావాల్సి ఉండటంతో త్రివిక్రమ్ అండ్ టీమ్ సింగిల్ షెడ్యూల్లో సినిమాను పూర్తిచేయాలనే ఆలోచనలో ఉన్నారట. అందుకే పకడ్బందీగా ప్రీ ప్రొడక్షన్ పనులు చేస్తున్నారు.

కార్తికి ముందస్తు బెయిల్



ఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత చిదం బరం కుమారుడు కార్తి చిదంబరానికి ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసులోను ఊరట లభించింది. ఈ కేసులో అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ కోరుతూ కార్తి దాఖలు చేసిన పిటిషన్ విచారణను శనివారం ఢిల్లీ ప్రత్యేక న్యాయస్థానం చేపట్టింది. గంట పాటు విచారణ జరిగిన అనంతరం కార్తికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు న్యాయ స్థానం అంగీకరించింది. ఏప్రిల్ 16 వరకు కార్తిని అరెస్టు చేసేందుకు వీల్లేదని కోర్టు పేర్కొంది.

అయితే.. సీబీఐ అధికారులు ఎప్పుడు విచారణకు రమ్మని సమన్లు పం పిస్తే అప్పుడు విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల 16కి వాయిదా వేసింది. 2011, 12 సంవత్స రాల్లో కార్తిపై ఎయిర్‌సెల్ మాక్సిక్ కేసుల విషయంలో రెండు ఎఫ్ఐఆర్‌లను ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు నమోదు చేశారు. కేంద్రఆర్థిక మంత్రిగా చిదంబరం ఉన్న సమయంలో ఎయిర్‌సెల్ మాక్సిస్ కంపెనీలో విదేశీ పెట్టుబడులు పెట్టేందుకు అవసరమైన ఎఫ్ఐపీబీ క్లియరెన్స్ కోసం కార్తి భారీగా ముడుపులు తీసుకున్నట్లు సీబీఐ, ఈడీ అధికారులు ఆరోపిస్తున్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కార్తికి బెయిల్ వచ్చిన మరుసటి రోజే ఈ కేసులోను ముందస్తు బెయిల్ రావడం గమనార్హం.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సడలించవద్దు

కేంద్రాన్ని డిమాండ్ చేసిన దళిత సంఘాలు

న్యూఢిల్లీ: ఎస్సీఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులను తక్షణం అరెస్ట్ చేయడానికి వీలులేకుండా ఆ చట్టంలోని నిబంధనలను సుప్రీంకోర్టు సడలించడంపై కాంగ్రెస్‌తోపాటు, దళిత సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్‌డీఏ పాలనలో దళితులపై దాడులు పెరిగాయని, ఈ పరిస్థితిలో సుప్రీంకోర్టు మంగళవారం ఇచ్చిన తీర్పును ప్రభుత్వం సమీక్షించాలి లేదా చట్టాన్ని సవరించాలని ఆ సంస్థల నాయకులు కోరారు. కోర్టు తీర్పు తరువాత ఎస్సీ ఎస్టీలు అభద్రతాభావానికి గురవుతున్నందున ప్రభుత్వం ఈ విషయంలో తన వైఖరిని వెల్లడించాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆనంద్‌శర్మ మీడియాతో అన్నారు. కేంద్రం మౌనంగా ఉంటే అది కోర్టు తీర్పును సమర్థించినట్లే అవుతుందని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు దేశంలో రిజర్వేషన్లు లేకుండా చేయాలని కుట్ర పన్నాయని, వారి విధానాల ఫలితమే కోర్టు తీర్పు అని కాంగ్రెస్ ఎంపీ కుమారి సెల్జా ఆరోపించారు. ఈ కేసులో కక్షిదారుగా ఉన్న కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాలు కోర్టులో సరిగా వాదించలేదని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలా చెప్పారు. సుప్రీంతీర్పును సవాలు చేయాలని దళిత్ శోధన్ ముక్తి మంచ్ తదితర సంఘాలు కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. ఎస్సీఎస్టీల చట్టం కింద నకిలీ కేసులు నమోదవుతున్నాయని, ఈ కేసుల్లో అమాయకులను నిందితులుగా పేర్కొన్న సందర్భాలు ఉన్నాయని సుప్రీంకోర్టు మంగళవారం ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది. ఎస్సీఎస్టీలపై అత్యాచార కేసుల్లో ఉద్యోగులను నిందితులుగా పేర్కొనడం వల్ల పోలీసులు వారిని వెంటనే అరెస్ట్ చేయాల్సి వస్తున్నదని తెలిపింది. ఉన్నతాధికారుల ఆమోదం తీసుకున్న తరువాత మాత్రమే ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న ఉద్యోగులను అరెస్ట్ చేయాలని ఆదేశించింది.

న్యాయ మంత్రి అసత్యాలు

రాహుల్ విమర్శ



న్యూఢిల్లీ : కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య పెరిగిపోవడం, న్యాయ మూర్తుల కొరత వుండ దంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీ న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌పై తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. న్యాయమూర్తుల కొరత తీర్చడానికి బదులు 'తప్పుడు సమాచారం అందజేస్తు న్నారు" అని రాహుల్ విమర్శించారు. కేంబ్రిడ్జి అనల్యాటిక్ నుంచి వివాదాస్పద సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ సంగ్రహించిందని ప్రసాద్ చేసిన ఆరోపణలను రాహుల్ తిప్పికొట్టారు. ఈ ఆరో పణలను కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే తోసిపుచ్చింది, బీజేపీనే ఆ సంస్థ సేవలను పొందిందని పేర్కొంది. "పెండింగ్‌లో ఉన్న కేసులు కారణంగా న్యాయవ్యవస్థ కుప్పకూలిపోయింది. సుప్రీంకోర్టులో 55,000,హైకోర్టులో 37 లక్షలు, దిగువ కోర్టులలో 2.6 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికీ హైకోర్టులలో 400 మంది, దిగువ కోర్టులలో 6,000 మంది న్యాయవాదులను నియమించాల్సి ఉంది. న్యాయశాఖ మంత్రి మాత్రం తప్పుడు సమా చారం వ్యాప్తిలో మునిగిపోయారు" అని ట్విట్టర్‌లో రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

లాలూకు 14 ఏళ్ల జైలు

దాణా కుంభకోణం నాల్గవ కేసులో శిక్ష ఖరారు



రాంచీ : దాణా కుంభకోణం నాలుగో కేసులో బీహార్ మాజీ సీఎం, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు 14ఏళ్ల జైలుశిక్ష పడింది. ఈ కేసులో ఆయనను దోషిగా తేలుస్తూ రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం గత సోమవారం తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో శనివారం న్యాయస్థానం ఆయనకు శిక్ష ఖరారు చేసింది. దీంతో పాటు రూ. 60లక్షల జరిమానా విధించింది. కాగా.. ఇదే కుంభకోణానికి సంబంధించిన మిగతా మూడు కేసుల్లోనూ లాలూకు శిక్ష పడిన విషయం తెలిసిందే. దుమ్కా కోశాగారానికి సంబంధించిన కుంభ కోణంలో ఆయనను దోషిగా తేలుస్తూ రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించింది. ఈ కుంభకోణంలో రూ. 3.13 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగింది. డిసెంబర్ 1995 నుంచి 1996 వరకు దుంకా ట్రెజరీ నుంచి ఆ నిధులను స్వాహా చేశారు. 1990లో బీహార్ సీఎంగా ఉన్నప్పుడు లాలూ ఈ కుంభకోణానికి పాల్పడ్డారు. లాలూతో పాటు దాణా కుంభకోణం కేసులో మరో 31 మంది నిందితులుగా ఉన్నారు. ఐపీసీ 120-బి (నేర పూరిత కుట్ర), రెడ్ విత్ 419, 420, 467, 468 (మోసం, ఫోర్జరీ) సెక్షన్‌ల ప్రకారం సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కోశాగారం నుంచి అక్ర మంగా రూ.3.13కోట్లు విత్‌డ్రా చేసినట్లు ఆరోపణలు రావడంతో లాలూ, మరికొం దరిపై కేసు నమోదైంది. దుంకా ట్రజరీ కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తి శివపాల్ సింగ్ శనివారం ఈ తీర్పును వెల్లడించారు. కాగా.. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాను నిర్దోషిగా ప్రకటించింది. 1990లలో లాలూ ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో చోటుచేసు కున్న ఈ కుంభకోణానికి సంబంధించిన కేసుల్లో లాలూపై దోష నిర్ధారణ జరగడం ఇది నాలుగోసారి. రూ.377.7 కోట్ల స్వాహాకు సంబంధించిన తొలి కేసులో 2013 సెప్టెంబర్ 30న లాలూ దోషిగా తేలారు. ఆ కేసులో ఆయనకు ఐదేళ్ల జైలు శిక్ష పడింది. దీంతో ఆయన లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు పడింది. శిక్ష పూర్తయ్యాక ఆరేళ్ల వరకూ ఆయన.. ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేదు. అయితే కొన్ని నెలల పాటు జైలు శిక్ష అనుభవించిన లాలూ ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. ఇక దేవ్‌గఢ్ కోశాగారం నుంచి అక్రమంగా నిధులు విడుదల చేయడానికి సంబంధించిన రెండో కేసులోనూ లాలూకు శిక్ష పడింది. గత ఏడాది డిసెంబర్ 23 నుంచి ఆయన రాంచీలోని బిర్సా ముండా కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నారు. రూ.37.62 కోట్ల విత్‌డ్రాకు సంబంధిం చిన మరో కేసులో ఆయనకు ఈ ఏడాది జనవరి 24న ఐదేళ్ల జైలు శిక్ష పడింది. మరోవైపు జగన్నాథ్ మిశ్ర.. రెండు కేసుల్లో దోషిగా తేలగా, రెండింటి నుంచి విముక్తి పొందారు. రాంచీలోని దొరాండా కోశాగారం నుంచి రూ.139 కోట్లను అక్రమంగా విత్‌డ్రా చేయడానికి సంబంధించిన ఐదో కేసు ఇంకా పెండింగ్‌లో ఉంది.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం



శ్రీనగర్ : దక్షిణ కాశ్మీర్‌లో అనంతనాగ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌం టర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్టు పోలీసులు తెలిపారు. జిల్లాలోని దూరులో షిస్టాగాం గ్రామంలో ఉగ్రవాదులున్నట్టు ముందుగా అందిన సమాచారం మేరకు భద్రతాదళాలు అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య హోరాహోరీగా కాల్పులు జరిగాయన్నారు. కాల్పుల్లో హతమైన ఇద్దరు ఉగ్రవాదులను గుర్తించినట్టు చెప్పారు. సంఘటనా స్థలం నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

'అపో'లో వ్యవస్థాపక చైర్మన్‌కు గుండెపోటు



చెన్నై: అపోలో గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డికి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుండెపోటు వచ్చింది. ఆయనకు చెన్నై థౌజండ్ లైట్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. చెన్నై తేనాం పేటలోని నివాసంలో శుక్రవారం రాత్రి ఆయనకు శ్వాస సమస్య తలెత్తింది. ఆ వెంటనే గుండెపోటు రావడంతో స్పృహ తప్పారు. కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో రాత్రంతా చికిత్స అందించారు. వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు వైద్యులు పరీక్షిస్తున్నారు.

బీహెచ్‌యూ వీసీగా రాకేష్ భట్నాగర్



న్యూఢిల్లీ : బెనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ) వైస్‌చాన్సలర్‌గా జేఎన్‌యూ ప్రొఫెసర్ రాకేష్ భట్నాగర్ నియమితులైనట్టు హెచ్‌ఆర్డీ మంత్రిత్వశాఖ శనివారం తెలిపింది. 2012-13లో కుమౌన్ యూనివర్సిటీ వీసీగా కూడా ఆయన బాధ్యతలు చేపట్టారు. వర్సిటీకి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ విచ్చేసిన సందర్భంలో భట్నాగర్ నియమకాన్ని మంజూరు చేసినట్టు తెలిపింది.

ఐఎస్ రిక్రూట్‌మెంట్ కేసులో మహిళకు ఏడేళ్లు జైలు



కోచి : కేరళ ఐఎస్ రిక్రూట్‌మెంట్ కేసులో ఎర్నాకులంలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టు యాస్మిన్ మొహమ్మద్ జాహిద్ అనే మహిళకు ఏడేళ్లు జైలు శిక్ష విధించింది. అలాగే కోర్టు ఆమెకు రూ.25 వేలు జరిమానా విధించింది. బీహార్‌కు చెందిన జాహిద్‌ను ఎన్ఐఏ ఈ కేసులో విచారణ జరిపింది. గత ఏడాది ఐఎస్ఐఎస్ కార్యకలాపాలు సాగిస్తున్న ప్రధాన నిందితుడు అబ్దుల్ రషీద్ అబ్దులా, రెండవ నిందితురాలు జాహిద్‌లపై ఎన్ఐఏ చార్జిషీటు దాఖలైంది.

ఆప్ ఎమ్మెల్యేల అనర్హత...

ఢిల్లీ హైకోర్టు తీర్పు హర్షణీయం

సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం



న్యూఢిల్లీ : లాభదాయక పదవులను నిర్వహించే ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రక టించడానికి సంబంధించి ఒక్కొక్క రాష్ట్రంలో ఒకో విధానాన్ని అమలు చేస్తున్నా రని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) విమర్శించింది. లాభదాయక కేసులో 20 మంది ఆప్ ఎమ్మెల్యేలకు ఊరటనిస్తూ ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పును స్వాగతించింది. ఆప్ ఎమ్మెల్యేలపై పడిన అనర్హతవేటును ఢిల్లీ హైకోర్టు కొట్టివే సింది. ఈ అంశంపై మరోసారి విచారించి, నిర్ణయం తీసుకోవాలని సూచిస్తూ కేసును తిరిగి ఎన్నికల సంఘానికి అప్ప గించింది. ఈసీ సిఫా ర్సును కోర్టు తప్పు పట్టడంతో పాటు ఇందులో సహజ న్యాయసూత్రాల ఉల్లం ఘన జరిగిందని పేర్కొంది. ఎన్నికల సంఘం వీరిని అనర్హులుగా ప్రకటించిన రోజు నుంచే ఈ అంశంపై సీపీఐ తన ఆందోళనను వ్యక్తం చేస్తోంది. ఈ కేసులో ఈసీ తీరును సీపీఐ తప్పుపట్టింది. ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం దేశ ప్రజా తంత్ర వ్యవస్థను బలహీనపరుస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలను విడదీసి చూడలేమని శనివారం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ తన స్వయంప్రతిపత్తిని నిలబెట్టుకోవాలని, ఇందుకు సంబంధించి జాతికి విశ్వాసాన్ని కల్పించాలని సూచిం చారు. ఎన్నికల కమిషన్ చర్య మొత్తంగా అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. లాభదాయక పదవులకు సంబంధించి ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క పద్ధతి అనుసరించవద్దని, లేకపోతే పంజరంలో మరో చిలుక ఉన్నదని ప్రజలు భావిస్తారని తెలిపారు.



జేఎన్‌యూ మార్చ్‌పై లాఠీచార్జి

దర్యాప్తుకు ఆదేశించిన మహిళా కమిషన్

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని నిరసన ర్యాలీ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) విద్యా ర్థులు, మహిళా జర్నలిస్టులపై పోలీసు లాఠీ చార్జిపై దర్యాప్తుకు జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) ఆదేశించింది. వివిధ డిమాం డ్లపై జేఎన్‌యూ విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం పార్లమెంట్‌కు మార్చ్ నిర్వహించ తలపెట్టారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులు వీరిని అడ్డుకుని లాఠీచార్జి చేశారు. వాటర్ కేనన్లను కూడా ఉపయోగించారు. 'మేము దర్యాప్తుకు ఆదేశించాం. పోలీసు అధికారులను కలిసేందుకు ఒక బృందాన్ని పంపించాం. మేము ఈ విషయాన్ని సోమ వారంనాడు మరింత లోతుగా పరిశీలిస్తాం" అని ఎన్‌సీడబ్ల్యూ తాత్కాలిక ఛైర్మన్ రేఖా శర్మ తెలిపారు. పోలీసులు కవ్వింపు చర్యలకు దిగి దాడి చేశారని నిరసన కార్యక్రమంలో పాల్గొ న్న విద్యార్థులు తెలిపారు. 'యూనిఫాం ధరిం చిన ఒక వ్యక్తి మా పట్ల దురుసుగా ప్రవ ర్తిస్తూ, ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయమని ఆదేశిం చారు" అని మహిళా జర్నలిస్టులు తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడె ంట్స్ యూనియన్ (జేఎన్‌యూఎస్‌యూ), జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (జేఎన్‌యూటీఏ) నిర్వహించిన ఈ 'పాదయాత్ర' యూనివర్సిటీ క్యాంపస్ నుంచి ప్రారంభమైంది. విద్యా విషయక స్వేచ్ఛ కావాలని, నాణ్యమైన విద్యను అందు బాటులో ఉంచాలని డిమాండు చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

'రెప్పపాటులో ప్రమాదాలు జరగవచ్చు'



వడోదర : రోడ్డు భద్రతలపై ప్రజల్లో అవగాహనకు వడోదరకు చెందిన ట్రాఫిక్ పోలీసులు మాత్రం ఇంకాస్త వినూత్నంగా ఆలోచించారు. రోడ్డుప్రమాదాలపై మరింత అవగాహన కల్పించేందుకు తన కను సైగలతో యావత్ భారత్‌దేశాన్ని తనవైపు నకు తిప్పుకొన్న మలయాళ నటి ప్రియా ప్రకాశ్ వారియర్ ఫొటోను తమ ప్రచార చిత్రంగా వాడుకొంటున్నారు. ప్రియ కన్నుకొడుతున్న ఫొటో పక్కన 'రెప్పపాటులో ప్రమాదాలు జరగవచ్చు'అని అర్థం వచ్చేలా సందేశాన్ని రాసి ఉన్న ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. దీంతో ఈ ఫొటో అంతర్జాలంలో వైరల్‌గా మారింది.

ఎన్నికల వేళ జేడీఎస్‌కు షాక్

- నలుగురు రెబల్ ఎమ్మెల్యేల రాజీనామా
- నేడో, రేపో కాంగ్రెస్‌లో చేరిక




బెంగళూరు : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్ణాటకలో జేడీఎస్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన నలుగురు తిరుగుబాటు శాసనసభ్యులు తమ పదవులకు శనివారం రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. జేడీఎస్ తిరుగుబాటు శాసనసభ్యులు రాజ్యసభ ఎన్ని కల్లో కాంగ్రెస్‌కు లబ్ది చేకూర్చేలా ఓటు హక్కు వినియోగించుకున్నారు. తిరు గుబాటు శాసనసభ్యులు బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్, ఆర్.అఖండ శ్రీనివాసమూర్తి, ఎన్.చలువరాయ స్వామి, భీమానాయక్‌లు అసెంబ్లీ స్పీకర్ కేబీ కొలివాడ్‌ను ఆయన నివాసంలో కలిసి రాజీనామా పత్రాలు సమ ర్పించారు. ఒకటి, రెండు రోజుల్లో వారు కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని వారి సన్నిహితులు చెప్పారు. జేడీఎస్ నాయక త్వం ప్రత్యేకించి హెచ్‌డీ కుమారస్వామిపై ఏడుగురు ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయగా అందులో నలుగురు కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టు వార్తలు వచ్చాయి. ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదించినట్టు కొలివాడ్ విలేకరులకు చెప్పారు. 'ఆ నలుగురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సభ్యత్వానికి రాజీ నామా చేశారు. రాజీనామాలకు గల కారణాలను వ్యక్తిగతంగా నేను అడిగాను. తమపై రాజకీయ ఒత్తిళ్లు లేవని, తామే రాజీనామా చేస్తున్నామని ఎమ్మెల్యేలు చెప్పారు. అందుకే వారి రాజీనామాలు ఆమోదించాను' అని స్పీకర్ తెలిపారు. రాజీనామా అనంతరం ఖాన్ విలేకరులతో మాట్లాడుతూ జేడీఎస్ ఏకవ్యక్తి పార్టీగా మారినందున పార్టీని వీడాలని తాను నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. 'హెచ్‌డీ కుమారస్వామి ఎవరి మాటా వినరు. కనీసం ఆయన తండ్రి దేవగౌడ, సోదరుడు రేవన్నతోనూ సంప్రదింపులు జరపరు. ఇక మా మాటెందుకు వింటారు' అని ఖాన్ అన్నారు. తిరుగుబాటు శాసనసభ్యులు ఏడుగురు రాజ్యసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారంతా ఇండి పెండెంటు అభ్యర్థికి ఓటేశారు. కాంగ్రెస్ తరపున మూడో అభ్యర్థి గెలవడానికి ఆ విధంగా దోహదపడ్డారు.

బీఎస్పీ ఎమ్మెల్యే సస్పెన్షన్

లక్నో: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయవతి సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాజ్యసభ ఎన్నికల్లో బీఎస్పీకి చెందిన ఎమ్మెల్యే అనిల్ సింగ్.. బీజేపీకి ఓటు వేయడాన్ని ఆమె తీవ్రంగా పరిగణించారు. దీంతో అనిల్‌పై చర్యలకు ఉపక్రమించారు. అనిల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తు న్నట్లు ప్రకటించారు. ఇదే విషయమై శనివారం మీడియాతో మాట్లాడిన మాయవతి.. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని అపహా స్యానికి గురిచేస్తూ.. క్రాస్‌ఓటింగ్‌ను ప్రోత్సహించారని విమర్శించారు. బీఎస్పీ, ఎస్పీ బంధంపై దెబ్బకొట్టాలని బీజేపీ ప్రయత్నించిందన్నారు. బీజేపీ నేతలు ఎన్ని కుయుక్తులు పన్నినా ఏమీ చేయ లేరని ధీమా వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడి గెలిచిన గెలుపు.. ఓ గెలుపు కాదని వ్యాఖ్యానించారు.

నక్సలిజాన్ని ఎదుర్కోవడం పెద్ద సవాల్



గుర్‌గావ్ : నక్సలిజాన్ని ఎదుర్కొవడం పెద్ద సవాల్, కానీ, సీఆర్‌పీఎఫ్ సహా భద్రతాదళాలు దానిని కట్టడి చేయటంలో కృషి చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. హర్యానాలోని గుర్‌గావ్‌లో శనివారం సీఆర్‌పీఎఫ్ దళాల 79వ రైసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుక్మా ఎన్‌కౌంటర్‌లో మరణించిన జవాన్లకు నివాళులర్పించిన అనంతరం రాజ్‌నాథ్ ప్రసంగించారు. దేశంలో నక్సజలిం చివరి అంచుల్లో ఉందని, భద్రతా దళాలు నక్సలిజాన్ని ఎదుర్కోవడంలో విజయవంతం అయ్యాయని అన్నారు.

బీజేపీకి 69..కాంగ్రెస్‌కు 50

రాజ్యసభలో పెరిగిన కాషాయపార్టీ బలం



న్యూఢిల్లీ : రాజ్యసభలో బీజేపీ బలం కొంత మేరకు పెరిగింది. కాంగ్రెస్ బలం తగ్గింది. ఉత్తర ప్రదేశ్ లోక్‌సభ ఉపఎన్నికల్లో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అయితే రాజ్యసభ ఎన్నికల ఫలితాలు ఆ పార్టీకి ఊరట కలిగించాయి. అత్య ధిక స్థానాలను గెలుచుకొని, రాజ్యసభలో అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించింది. 245 మంది సభ్యులున్న పెద్దల సభలో పూర్తిస్థాయి ఆధిక్యం రానప్పటికీ ప్రతిపక్ష కాంగ్రెస్ కన్నా సంఖ్యా బలంలో మెరుగైన స్థితికి వచ్చింది. తాజా ఫలితాలతో బీజేపీ ఖాతాలో మరో 11 స్థానాలు అదనంగా వచ్చి చేరాయి. 245 మంది సభ్యులున్న రాజ్యసభలో బీజేపీ బలం 58 నుంచి 69కి చేరింది. అదే సమయంలో కాంగ్రెస్ నాలుగు స్థానాలను కోల్పోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ సంఖ్యా బలం 54 నుంచి 50కి పడిపోయింది. ఇటీవలి రాజకీయ పరిణామాలు బీజేపీకి ఊహిం చని షాక్‌లను ఇచ్చాయి. ప్రత్యేక హోదా విషయంలో తెలుగుదేశం పార్టీ ఎన్డీయే కూటమి నుంచి బయటకు రావడం, బీజేపీకి కంచుకోటగా నిలిచిన యూపీలోని గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్ సభ స్థానాలలో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటివరకూ ప్రభుత్వం ప్రవేశ పెట్టే బిల్లులు లోక్ సభలో ఆమోదం పొందినా, రాజ్యసభలో సరైన సంఖ్యాబలం లేక ఆగిపోయేవి. కొన్నిసార్లు విపక్షా లను సైతం బిల్లుకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరాల్సి వచ్చేది. తాజా ఫలితాలతో రాజ్యసభలోనూ బీజేపీ బలం పెరగడం ఆ పార్టీకి ఊరట కలిగించింది.

'2017'లో అన్నీ అరిష్టాలే..



న్యూఢిల్లీ: గతేడాది ప్రపంచవ్యాప్తంగా సంభ వించిన ప్రకృతి వైపరీత్యాలు అధిక సంఖ్యలో ప్రాణ నష్టంతో పాటు అపార ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా అత్యంత నష్టం వాటిల్లిన ఏడాదిగా 2017 నిలిచినట్లు ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) వెల్లడించింది. భారత ఉప ఖండంలో వరదలు, తూర్పు ఆఫ్రికా ప్రాంతంలో కరవు పరిస్థితుల కారణంగా 2017లో 320 బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లినట్లు డబ్ల్యూఎంవో నివేదిక పేర్కొంది. ప్రకృతి ప్రకోపం కారణంగా కరేబియన్ దీవుల్లాంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా జరిగిన అభివృద్ధి తుడిచిపెట్టుకుపోయిందని తెలిపింది. 2017 జూన్-ఆగస్టు మాసాల మధ్య కురిసిన వర్షాలతో పాటు ఇతర ప్రకృతి విపత్తుల కారణంగా భారత్, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో 1200 మంది చనిపోయారన్న నివేదిక.. 4 కోట్ల మంది ప్రజల జీవితాలను అవి ప్రభావితం చేశాయని పేర్కొంది. ఉత్తర హిందూ మహా సముద్రంలో సంభవించిన మోరా, ఓఖీ తుపాన్ల కారణంగా అధిక నష్టం వాటిల్లినట్లు డబ్ల్యూఎంవో వెల్లడించింది.

హాస్టల్‌లో విద్యార్థులతో వంటలు



గుణ (మధ్యప్రదేశ్) : ఓ హాస్టల్లో పిల్లలతోనే వంట చేయించిన ఘటన మధ్యప్రదేశ్‌లోని గుణలో చోటు చేసు కుంది. గుణలోని జూనియర్ గిరిజన వసతి గృహంలో ఉన్న విద్యార్థులతో ప్రతి రోజూ వంట చేయిస్తున్నారు. అక్కడ సిబ్బంది ఉన్నా వంటమాత్రం పిల్లలు చేయాల్సిందే.అంతేకాదు మరుగుదొడ్లు కడిగించడం, పాత్రలు తోమించడం, శు భ్రం చేయించడం వంటివి చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టరు రాజేష్ జైన్ హాస్టల్ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేశారు. మిగతా సిబ్బందిపైనా చర్యలు తీసుకుంటామని కలెక్టరు తెలిపారు.

రాజ్‌కోట్‌లో దారుణం



రాజ్‌కోట్ : రాజ్‌కోట్‌లో దారుణం చోటుచేసు కున్నది. ఓ పక్క ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూనే ఇరుగుపొరుగు ఇళ్లలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న 11 ఏళ్ల బాలికపై ఆరుగురు వ్యక్తులు ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. గత 9 నెలలుగా ఈ దారుణం జరుగుతోంది. భయంతో ఆ బాలిక ఎవరికీ ఆ విషయం చెప్పలేదు. అయితే ఆమె తల్లి మార్చి 8న ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే 8 నెలల గర్భవతి అని నిర్ధారణ అయ్యింది. ఈ దారుణానికి పాల్పడిన వారిపై ఆమె తల్లి ఫిర్యాదు చేయగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు 60 ఏళ్ల వృద్ధులతోపాటు ఒక మైనర్ కూడా ఉన్నట్లు తెలిసింది.

ప్రసార మాధ్యమాల్లో 'పది' ప్రశ్నాపత్రాలు

పోలీసుల విచారణ కోరిన విద్యాశాఖ అధికారులు

పశ్చిమగోదావరి జిల్లాలో వాట్సాప్‌ల్లో ప్రశ్నాపత్రాలు

విశాలాంధ్ర - ఏలూరు : లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఎంతో పకడ్బందీగా నిర్వహించాల్సిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు పక్కదోవ పడుతున్నాయి. పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికే ప్రశ్నాపత్రాలు వాట్సాప్ లాంటి ప్రసారమాధ్యమాల్లో ప్రత్యక్షమవుతున్నాయి. పరీక్ష హాలులో విద్యార్థులు రాస్తున్న ప్రశ్నాపత్రాలే వాట్సాప్‌ల్లో దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.. ప్రశ్నాపత్రాలను వాట్సాప్‌లో పంపుతున్నది ఎవరు.. ఎక్కడి నుంచి వస్తున్నాయి.. ఏ కారణంతో వస్తున్నాయో నిజానిజాలు నిగ్గుతేల్చాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖ అధికారులు శనివారం జిల్లా ఎస్పీ ఎం. రవిప్రకాష్‌ను విచారణ చేయాల్సిదిగా కోరారు. ఈ నెల 15వ తేదీ నుంచి పరీక్షలు కొనసాగుతున్న తరుణంలో ఈ నెల 21వ తేదీన గణితం పేపర్ - 1 ప్రశ్నాపత్రం తాడేపల్లిగూడెం మండలంలోని ఒక పాఠశాల నుంచి వాట్సాప్ లో బయటకు వచ్చినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. శుక్రవారం సైన్స్ పేపర్- 1 ప్రశ్నాపత్రం పరీక్ష ప్రారంభమైన గంటకే భీమడోలు మండలంలోని ఒక పాఠశాల నుంచి వాట్సాప్‌లో వచ్చినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న డీఈవో సీవీ రేణుక వెంటనే ఆరుగొలను, భీమడోలు మండలాల్లోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రశ్నాపత్రాలు వాట్సాప్‌లో వచ్చిన విషయాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వారి ఆదేశాలతో ఈ అంశంపై విచారణ చేయాలని జిల్లా ఎస్పీ ఎం రవిప్రకాష్‌ను కోరినట్లు డీఈవో తెలిపారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ ఈ నెల 21న లెక్కలు పేపర్ - 1 ప్రశ్నాపత్రం వాట్సాప్‌లో బయటకు రావడంపై పోలీస్ కేసు నమోదు చేయాలని తాడేపల్లిగూడెం డీవైఈవోను ఆదేశించామన్నారు. శనివారం సైన్స్ పేపర్- 2 ప్రశ్నాపత్రం వాట్సాప్ ద్వారా వచ్చిందన్న విషయంపైనా విచారణ చేయాలంటూ పరీక్షల జిల్లా కమిషనర్ శనివారం రాత్రి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు వివరించారు. కేసు విచారణ అనంతరం కారకులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఈవో రేణుక తెలిపారు.

ఏకపక్ష నిర్ణయమనడం సరికాదు : అశోక్



విశాలాంధ్ర-విజయనగరం : ఎన్డీయే కూటమి నుంచి తెలుగుదేశం పార్టీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని బయటకు వెళ్లిపోయిందంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా వ్యాఖ్యానించడం సరికాదని కేంద్ర మాజీ మంత్రి, విజయనగరం ఎంపీ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం శనివారం ఉదయం విజయనగరం వచ్చిన అశోక్‌కు టీడీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. 500 కార్లు, 1,500 మోటార్‌సైకిళ్ళతో భారీ ర్యాలీతో ఊరేగింపుగా తొలుత తమ ఇలవేల్పు శ్రీ పైడితల్లమ్మను దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము ఎన్నోసార్లు రాష్ట్ర సమస్యలను అమిత్‌షాకు విన్నవించినా కనీసం పట్టించుకోలే దన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలపై ఇంకా చర్చలు జరగడం దురదృష్టకరమన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినా సభ ఆర్డర్‌లో లేదని చర్చకు అనుమతించలేదన్నారు. రాష్ట్రంలో అనేక విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించినా ఇప్పటివరకు కేంద్రం ముందడుగు వేయలేద న్నారు. పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీలను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలనడం అవివేకమన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.



ఆళ్ళగడ్డలో అదనపు కోర్టు పోరాట ఫలితమే

విశాలాంధ్ర-ఆళ్ళగడ్డ : కర్నూలు జిల్లా ఆళ్ళగడ్డలో అదనపు కోర్టు (జిల్లాకోర్టు) ఏర్పాటు 15 ఏళ్ల కృషి ఫలితమే అని హైకోర్టు జడ్జి ఏపీ శేషసాయి అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో అదనపుకోర్టు శిలాఫలకాన్ని, కోర్టు గదిని, న్యాయదేవత విగ్రహాన్ని శనివారం ఆయన జిల్లాజడ్జి అనుపమాచక్రవర్తితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆళ్ళగడ్డ అయిదవ అదనపు కోర్టు (జిల్లాకోర్టు) రప్పించేందుకు అనేక మంది న్యాయవాదులు 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారన్నారు. వారందరి కృషిఫలితంగా నేడు కోర్టు ఏర్పాటైందన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు ఎక్కువ మానసిక ఒత్తిడికి గురవుతుంటారని, అప్పుడప్పుడు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా మానసిక ఒత్తిడి నుంచి బయటపడవచ్చన్నారు. నూతన కోర్టుల ఏర్పాటుతో సామాన్య ప్రజలకు న్యాయం దగ్గరవుతుందన్నారు. లా కోర్సు అయిపోగానే జూనియర్ న్యాయవాదులు నేరుగా కోర్టుకు రాకుండా సీనియర్ల దగ్గర పనిచేయాలన్నారు. కోర్టులో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించి ఏదైనా అవసరమైతే జిల్లా జడ్జి ద్వారా తమ దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరిం చేందుకు కృషిచేస్తామన్నారు. ఆళ్ళగడ్డకు చెందిన విశ్రాంత న్యాయమూర్తులు నాగిరెడ్డి, శివప్రసాద్, ఆళ్ళగడ్డ సీనియర్ సివిల్ జడ్జి సురేష్, జూనియర్ సివిల్‌జడ్జి దివాకర్, న్యాయవాదులు శివరామిరెడ్డి, మహబూబ్‌బాషా, నీలకంఠేశ్వరం, శ్రీనాథ్‌రెడ్డిలను హైకోర్టు జడ్జి సన్మానించారు. కార్యక్రమంలో ఏపీపీ రమాదేవి, న్యాయవాదులు అన్నయ్యాచారి, నేరెళ్ళ చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, మురళీధర్‌గౌడ్, రమణయ్య, శివప్రసాద్, జనార్దన్, మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో సర్కారు భూములు

- పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో భూ ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు



విశాలాంధ్ర-పలాస : శ్రీకాకుళం జిల్లాలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూములు ఆక్రమణదారులకు అడ్డాగా మారాయి. కొందరు అధికార, ప్రతిపక్ష నేతలతోపాట పెత్తందారులు సుమారు 30 ఎకరాలను తమ గుప్పెట్లో పెట్టుకొని పక్కా భవనాలు నిర్మిస్తున్నా, విక్రయిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలాస-కాశీబుగ్గ పంచాయతీగా కొనసాగిన కాలంలో ఖరీదైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. పలాస-కాశీబుగ్గ జంట గ్రామాలు 1985 వరకు పంచాయతీలుగా ఉన్నాయి. పాలకవర్గాలు రద్దు చేశాక 1996 నవంబరు 21వ తేదీ వరకు ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగింది. తర్వాత మున్సిపాలిటీగా రూపొందింది. అంతకు ముందు 20 ఏళ్ళపాటు సర్పంచ్‌ల పాలనలో పంచాయతీ భూములు ఆక్రమణలకు గురయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను అధికారులు సర్వేలు చేశారు. మిగులుభూముల రికార్డుల ఆచూకీపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. మున్సిపాలిటీలోని పద్మనాభపురం, తాళబద్ర, నీలాపురం, చినబాడాం, అంతరకుద్ద, మొగిలిపాడు, సూదికొండ, నెమలికొండ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్టు గుర్తించారు. నాలుగు దశాబ్దాల క్రితం కాశీబుగ్గలో చెరువును బస్టాండ్‌గా రూపొందించినప్పుడు కోట్ల రూపాయల విలువ చేసే రెండెకరాల భూమిని కొందరు కబ్జా చేశారు. అప్పట్లో కాశీబుగ్గ నాయుడుగా వ్యవహరించిన గ్రామ పెద్ద హనుమంతు సింహాద్రినాయుడు అడ్డుకోవడంతో కబ్జాదారులు ఆయనపై దాడికి తెగబడటం కలకలం రేపింది. దీంతో ప్రభుత్వం జోక్యం చేసుకొని కబ్జాదారులపై సివిల్, క్రిమినల్ కేసులు పెట్టింది. ఈ క్రమంలో అప్పటి అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఏమీ తెలియనట్లు వ్యవహరించడంతో ఆ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు పెద్ద భవనాలను నిర్మించుకున్నారు. 2002 సంవత్సరంలో మున్సిపాలిటీ ప్రత్యేక డ్రైవ్‌లో అప్పటి రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ సయ్యద్ ముజఫర్ హుసేన్ ఇక్కడి మిగులుభూముల అన్యాక్రాంతంపై అప్పటి మున్సిపల్ కమిషనర్లు ఆర్.వెంకటరామయ్య, సోమన్నారాయణ నుంచి వివరాలు తెలుసుకున్నారు. మిగులు భూములు మాయమైనట్టు బయటకు పొక్కకుండా చూసేందుకు కబ్జాదారులకు అనుకూలంగా కొందరు అవినీతి అధికారులు రికార్డులు సైతం తారుమారు చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. కబ్జాదారులకు అప్పటి కమిషనర్ ఖయ్యాం నోటీసులు కూడా జారీ చేశారు. కాలక్రమంలో మున్సిపల్ పాలకవర్గంలో కొందరు కబ్జాదారులతో చేతులు కలపడంతో మిగులుభూముల విషయం పూర్తిగా మరచిపోయారు. దీనిని సాకుగా తీసుకున్న మరికొందరు బస్టాండ్ ఆవరణలో మిగిలిన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యంత్రాలు ఉపయోగించడంతో అప్పటి కమిషనర్ శేషాద్రి అడ్డుకోవడం సంచలనం కలిగింది. చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేయడంతో ఆక్రమణదారులు వెనక్కి తగ్గారు. అప్పుడు తవ్విన గొయ్యి మాత్రం ప్రస్తుతం ప్రజలకు దర్శనమిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జంట పట్టణాల్లోని ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో విజిలెన్స్ తనిఖీ

విశాలాంధ్ర-గుంటూరు (వైద్యశాఖ) : గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా ఎస్పీ శోభామంజరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజునాయుడు నుంచి వివిధ అంశాలకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. 2015వ సంవత్సరంలో రూ.4 కోట్ల అంచనాతో ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోవడానికి కారణాలను శోభామంజరి తెలుసుకున్నారు. కిటికీ అద్దాలు పగిలి రోగులకు గాయాలు కావడంపై ఫిర్యాదులకు వివరణలు అడిగారు. రెండేళ్ల క్రితం ఈ అద్దాలు, ఇతర రిపేర్లకు కాంట్రాక్టులు ఇచ్చినా పనులు మరొకరికి అప్పగించడంతో జాప్యం జరుగుతోందని సూపరింటెండెంట్ బదులిచ్చారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో రూ.4 కోట్ల పనులకు మొదట్లో ఇచ్చిన జీవో తర్వాత రద్దు కావడంతో పనులు పెండింగ్‌లో పడినట్టు వివరించారు. ఆరోగ్య శ్రీ రోగుల వివరాలను తెలుసుకున్నారు. జీజీహెచ్‌లోని డాక్టర్లు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు.




రాజధానిలో భూసేకరణకు కసరత్తు

విశాలాంధ్ర-తుళ్ళూరు : రాజధాని అమరావతి ప్రాంతంలో భూసమీకరణకు ఇవ్వని భూముల సేకరణకు గుంటూరు జిల్లా రెవెన్యూ యంత్రాంగం కసరత్తును తీవ్రతరం చేసింది. శనివారం తుళ్ళూరు మండలం లింగాయపాలెంలోని 98 ఎకరాల భూమిలో 22 ఎకరాలను అత్యవసరంగా సేకరించేందుకు ఆర్డీఓ శ్రీనివాసులు భూములను పరిశీలించారు. రైతులకు ఇచ్చిన ప్లాట్లు, రహదారుల నిర్మాణాల కోసం భూసేకరణ చేయనున్నట్లు సమాచారం. సర్వే నెంబర్ 114/4, 115/ఏ, 116/1, 117/1లోని పొలాల్లో ప్రస్తుతం దొండ, అరటి, జొన్న పంటలు సాగు చేస్తున్నారు. అయితే రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో అధికారులపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూములు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులును అనుసరిస్తున్న మీడియా ప్రతినిధులపై అనధికారంగా ఆంక్షలు విధించారు. ఫొటోలు తీసుకున్నారుగా వెంట రాకండి..ఇక్కడి నుంచి తక్షణమే వెళ్ళండి అంటూ ఆర్డీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఉమారాణి, తహశీల్దార్ ఎం.పూర్ణచంద్రరావు, వీఆర్వో ఎ.అంకయ్య, డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పవన్, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దారవీడులో స్వల్ప భూ ప్రకంపనలు

విశాలాంధ్ర - పెద్దారవీడు : ప్రకాశంజిల్లా పెద్దారవీడు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి 9 గంటల సమయంలో స్వల్పంగా భూమి కంపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మార్కాపురం ప్రాంతంలో ఈ నెలలో ఇది రెండోసారి. పెద్దారవీడుతోపాటు మార్కాపురం, కంభం, బేస్తవారిపేట తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో భూ ప్రకంపనలు కనిపించడంతో ప్రజలు ఇళ్లలోనుంచి బయటకు పరుగులు తీశారు. ముఖ్యంగా పెద్దారవీడు మండలంలో సుమారు 2 నుంచి 3 నిముషాల వరకు భూ ప్రకంపనలు కనిపించాయి. దీనితో మండలంలోని ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

గన్నేరుపప్పు తిని చిన్నారులకు అస్వస్థత



విశాలాంధ్ర-కోట: నెల్లూరు జిల్లా వాకాడు మండలం తిరుమూరు గ్రామంలో శనివారం విద్యార్థులు గన్నేరు పప్పు తినడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని కోటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు 2,4,5వ తరగతి చదివే రుషిన్, శిరీషా, శ్రీలతలు ఉదయాన్నే స్కూల్‌కు వెళ్లి ఒంటిపూట బడి కారణంగా మధ్యాహ్నం సెలవు ఇవ్వడంతో ఇంటికి వస్తూ దారిలో గన్నేరుపప్పు తిని ఇంటికి చేరుకోగానే తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించి చికిత్స అందజేశారు. ప్రస్తుత విద్యార్థుల పరిస్థితి ఆరోగ్యంగానే ఉంది.

హాస్టల్‌లో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

విశాలాంధ్ర-వలేటివారిపాలెం : ప్రకాశం జిల్లా వలేటివారిపాలెం మండలంలోని రోళ్ళపాడు గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి తానికొండ వినయ్ (25) శనివారం ఉదయం ఒంగోలులోని పేస్ కళాశాల హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునితోపాటు 10 మంది విద్యార్థులు కలిసి ఉంటున్నారు. రోజు మాదిరిగానే విద్యార్థులు పరీక్షలు రాసేందుకు బయలుదేరుతూ వినయ్‌ను కూడా రావాలని కోరారు. మీరు వెళ్ళండి తర్వాత వస్తానన్న వినయ్ వారు పరీక్షకు వెళ్లిన తర్వాత ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సహ విద్యార్థి హాస్టల్ గదికి వెళ్లిన సమయంలో వినయ్ గదిలో శబ్దం రావటంతో వెళ్లి చూశాడు. ఫ్యాన్‌కు వేలాడి కనిపించడంతో హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. కిందకు దించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. వినయ్ తల్లిదండ్రులు తానికొండ శ్రీను, మల్లేశ్వరి గ్రామంలో వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు.

పీడీసీసీబీ పాలకవర్గం రద్దు

- స్పెషలాఫీసర్‌గా జిల్లా కలెక్టర్
- ఊపిరి పీల్చుకున్న టీడీపీ
- చైర్మన్ వర్గం అసంతృప్తి
- బ్యాంకు అవినీతిపై విచారణకు అవకాశం

విశాలాంధ్ర - ఒంగోలు బ్యూరో : ది ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ (పీడీసీసీబీ) పాలకవర్గాన్ని రద్దు చేస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు మాసాలుగా బ్యాంకులో తలెత్తిన వివాదాల నేపథ్యంలో స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా కలెక్టర్ వి వినయ్‌చంద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక బ్యాంకు లావాదేవీలు, పాలనా విభాగం అన్నీ కలెక్టర్ సమక్షంలోనే జరగనున్నాయి. ఎన్నో కొత్త మలుపుల అనంతరం బ్యాంక్ పాలకవర్గం రద్దును డైరెక్టర్‌లే కొని తెచ్చుకున్నారు. ఈ బ్యాంకు వ్యవహారం తెలుగుదేశం పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. అధికార పార్టీలోని ఎమ్మెల్యేలు, బ్యాంకు డైరెక్టర్లు రెండుగా చీలిపోవడంతో పార్టీతోపాటు ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చిందనే విమర్శలు లేకపోలేదు. మూడు నెలలుగా బ్యాంకు డైరెక్టర్లను సమన్వయం చేస్తూ సమస్య పరిష్కారానికి తెలుగుదేశంపార్టీ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో పాలకవర్గాన్ని రద్దు చేస్తూ సంబంధిత అధికారులు ప్రకటించారు.

పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ఈదర మోహన్ నాలుగు నెలల క్రితం తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. చైర్మన్ రాజీనామాకు పాలకవర్గంలోని కొందరు డైరెక్టర్లే కారణమన్నది సుస్పష్టం. మోహన్‌కు వ్యతిరేకంగా బ్యాంకు డైరెక్టర్లలో యలమందయ్య, మస్తానయ్య మరికొందరు డైరెక్టర్లతో కలసి ప్రత్యక్ష యుద్ధం ప్రకటించారు. వీరికి తెలుగుదేశం పార్టీలోనే కొందరు ఎమ్మెల్యేల మద్దతు ఉండటంతో బ్యాంకు వివాదాల్లో చిక్కుకుంది. ఈ క్రమంలో ఈదర మోహన్ రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్ కండే శ్రీనివాస రావు చైర్మన్‌గా ఎంపికయ్యారు. అయినప్పటికీ మస్తానయ్యను చైర్మన్ చేయాలంటూ కొందరు డైరెక్టర్లు జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావు, టీడీపీ జిల్లా అధ్యక్షులు, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌తోపాటు కొందరు శాసనసభ్యులపై తీవ్ర వత్తిడి తీసుకొచ్చారు. ఈ క్రమంలో దళిత వర్గానికి చెందిన కండే శ్రీనివాసరావుపై అవిశ్వాస తీర్మానం పెట్టి చైర్మన్ బాధ్యతల నుంచి తప్పించేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేశారు. కోర్టును ఆశ్రయించడం, కోర్టులో స్టే రావడం, కొందరు శాసనసభ్యుల అండతో కండే శ్రీనివాసరావును చైర్మన్ పదవి నుంచి తప్పించేందుకు సాగని ప్రయత్నాలు లేవు. దళితుడైన శ్రీనివాసరావుపై వేటు వేస్తే ఆ వర్గ ప్రజల నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తుందన్న భయంతో మంత్రి శిద్దా రాఘవరావు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తోపాటు ఆ పార్టీ నేతలు ఆచితూచి అడుగులు వేశారు. ఈ క్రమంలో పాలకవర్గాన్ని పూర్తిగా రద్దు చేసి స్పెషల్ అధికారిని నియమిస్తే పార్టీలో సమస్య సద్దుమణుగుతుందని భావించిన నేతలు ఆ దిశగా పావులు కదిపినట్లు తెలుస్తోంది.

ఆరు నెలలుగా ఎన్నో మలుపులు..

ఆరు నెలలుగా పీడీసీసీ బ్యాంకు వ్యవహారం ఎన్నో మలుపులు తిరుగుతూ చర్చనీయాంశంగా మారింది. బ్యాంకు లావాదేవీల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందంటూ బ్యాంకు పాలకవర్గ సభ్యులే బహిరంగంగా ఆరోపించారు. 19 పేజీలతో కూడిన బహిరంగ లేఖను విడుదల చేశారు. గత చైర్మన్ ఈదర మోహన్‌పై విచారణ చేయాలంటూ డిమాండ్ చేసిన నేపథ్యంలో పాలకవర్గమే రద్దయింది. బ్యాంకుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై స్పెషల్ అధికారి అయిన జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించినా ఆశ్చర్యం లేదన్న చర్చ కొనసాగుతోంది. కలెక్టర్‌పై అధికార పార్టీ నేతల వత్తిడి లేకపోతే విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయంటూ చర్చ నడుస్తోంది.

భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం



విశాలాంధ్ర-వేపాడ : భారీ స్థాయిలో పేలుడు పదార్థాలను అక్రమంగా తరలిస్తున్న వాహనంపై శనివారం ఉదయం విజయనగరం జిల్లాలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి రూ.5 లక్షల విలువైన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని భువనగిరి జిల్లా బొమ్మల రామారం గ్రామం నుంచి రీజెన్సీన్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు విశాఖలోని కృష్ణాపురం వైష్ణవి ఎంటర్ ప్రైజెస్‌కు ఎక్స్‌ప్లోజివ్ లారీలో పంపించారు. ఈ లారీలో ఎక్స్‌ప్లోజివ్ జిలటిన్స్ 600 బాక్సుల్లో రవాణా అవుతోంది. వీటి రవాణాకు విశాఖ వరకు మాత్రమే అనుమతి ఉంది. ఇతర ప్రాంతాలకు తరలించేందుకు లారీకి రవాణాపత్రాలు గానీ, ఎక్స్‌ప్లోజింగ్ అనుమతి పత్రాలుగానీ లేవు. వీటిని విశాఖలో దించకుండా విజయనగరం జిల్లా వేపాడ మండలం సోంపురానికి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు సోంపురం వద్ద నిఘా వేసి పట్టుకున్నారు. లారీడ్రైవర్‌ను విచారించగా వైష్ణవి ఎంటర్ ప్రైజెస్ యజమాని ఈ సరకును సోంపురంలోని హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్‌లో దిగుమతి చేయమని చెప్పడంతో తీసుకొచ్చినట్లు చెప్పాడు. అత్యంత శక్తివంతమైన పేలుడు పదార్థాలను ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలించడంతో లారీతో సహా సరుకును స్వాధీన పర్చుకున్నారు. వల్లంపూడి పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు టి.హరికృష్ణ (ఎస్పీ), డిప్యూటీ ఎస్పీ ప్రసాదరావు, సీఐ కృష్ణ, వల్లంపూడి ఎస్సై కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.





సీమ బైక్ దొంగల ముఠా అరెస్టు

84 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

విశాలాంధ్ర ప్రతినిధి - అనంతపురం : రాయలసీమ జిల్లాల్లో ద్విచక్రవాహనాలను మాయం చేస్తున్న అంతర్ జిల్లాల దొంగల ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.45 లక్షల విలువైన 84 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతపురంలోని పోలీసు సమావేశ మందిరంలో శనివారం జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ ఈ ముఠా వివరాలను మీడియాకు తెలిపారు. జిల్లాలోని పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరు గ్రామానికి చెందిన బండారు కృష్ణ(44), యాడికికి చెందిన వడ్డే నారాయణస్వామి అలియాస్ ఎర్రోడు(23), వంకం నాగరాజు(31), దుద్దే శివకుమార్ (22)తోపాటు రిసీవర్లు కోడూరు బాలకృష్ణారెడ్డి (38), దూదేకుల గౌస్(30)ను అరెస్టు చేశామన్నారు. వీరిలో బండారు కృష్ణ కీలక నిందితుడు అన్నారు. వడ్డే నారాయణస్వామి ఇతని వద్ద ఒక వాహనాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి దగ్గరయ్యాడన్నారు. తన స్నేహితులైన వంకం నాగరాజు, దుద్దే శివకుమార్‌ను ఇతనికి పరిచయం చేయడంతో కృష్ణ నేతృత్వంలో ముఠాగా ఏర్పడ్డార న్నారు. సీమ జిల్లాల్లోని మదనపల్లి, నంద్యాల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, కర్నూలు, డోన్, గార్లదిన్నె, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, రాప్తాడు తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలించారన్నారు. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, అపార్టుమెంట్లు తదితర రద్దీ ప్రదేశాల్లో పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను సులువుగా ఎత్తుకెళ్లేవారన్నారు. దొంగిలించిన వాహనాలను యాడికి కేంద్రంగా విక్రయించడానికి పథకం పన్నారన్నారు. అనంతపురం డీఎస్పీ జె.వెంకట్రావు పర్యవేక్షణలో త్రీ టౌన్ సీఐ మురళీకృష్ణ, ఎస్సైలు శంకరరెడ్డి, క్రాంతి, నారాయణరెడ్డి నిఘా వేయడంతో పక్కా సమాచారంతో శుక్రవారం స్థానిక తపోవనం కూడలిలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

శ్రీయుత ప్రత్యేక కలెక్టర్ (భూ.సే), టీజీపి, నెల్లూరు వారి కార్యవర్తనములు

RC D1/330/2016 Dt.. 12-02-2018

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఫారం నెం. VII

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణములను ప్రజాప్రయోజనమునకై అనగా తెలుగు గంగ ప్రాజెక్టుకు సంబంధించి జిల్లా కాశీపురం మైనర్ (19ఎల్) నిర్మాణము కొరకు గూడలి గ్రామం, కోట మండలం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కి.మీ.2.450 నుండి 2.850 కి.మీ వరకు గూడలి గ్రామ పరిధిలోని విస్తీర్ణం ఎ. 0.83 సెంట్లు భూములు కావలెనని శ్రీ ప్రత్యేక కలెక్టర్ , తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు భావించినందున, 2013వ సంవత్సరము 30వ చట్టంలోని 15వ విభాగము ననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములను విచారణ జరిపిన పిమ్మట శ్రీ ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖాలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2016-17నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంనమసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీయుత ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించిన ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణములను ప్రజాప్రయోజనమునకై అనగా తెలుగు గంగ ప్రాజెక్టుకు సంబంధించి కాశీపురం మైనర్ (19ఎల్) నిర్మాణము కొరకు గూడలి గ్రామం, కోట మండలం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కి.మీ. 2.450 నుండి 2.850 కి.మీ వరకు గూడలి గ్రామ పరిధిలోని విస్తీర్ణము ఎ.0.83 అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు — మండలం : కోట — గ్రామము: గూడలి

క్రమ సంఖ్య	సర్వే నెంబరు/ సబ్.డి.నెం.	విస్తీర్ణం	తరగతి	పట్టాదారు పేరు	అనుభవదారు పేరు	సాగు/ బీడు
01	78/1సి1	0.03	పట్టా మెట్ట	దొడ్ల సరస్వతమ్మ భర్త సుందర రామిరెడ్డి	దొడ్ల సరస్వతమ్మ భర్త సుందర రామిరెడ్డి	సాగు
	79/1ఎ	0.39				బోర్లు-2 టెంకాయ-1 వేప-1
	79/3ఎ	0.04				సాగు
02	78/1డి1	0.22	పట్టా మెట్ట	దొడ్ల శశికుమార్‌రెడ్డి తండ్రి సుందరరామిరెడ్డి	దొడ్ల శశికుమార్‌రెడ్డి తండ్రి సుందరరామిరెడ్డి	సాగు
03	78/1డి1	0.15	పట్టా మెట్ట	యనమల తిరుపాలయ్య తండ్రి కొండయ్య	యనమల తిరుపాలయ్య తండ్రి కొండయ్య	సాగు
మొత్తం		0.83				

ఈభూముల ప్లాను శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసే) తెలుగు గంగ ప్రాజెక్టు, నెల్లూరు యూనిట్ వారి కార్యాలయములో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయములోనైనా తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణవలన నిర్వాసితులయిన వారు ఎవ్వరును లేరు.

బొగ్గు ఘనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలోగాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణము కొరకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుట గాని చేయవలెను.

శ్రీమతి పి. ప్రశాంతి, ఎం.ఎ., ప్రత్యేక కలెక్టర్, టీజీపి, నెల్లూరు

యువతలో 70శాతంపైగా గ్లకోమా బాధితులే...

ఢిల్లీ : దేశ యువతలో 70శాతం మందికిపైగా గ్లకోమాకు గురైనట్లు వైద్యులు ఆందోళన వెలిబుచ్చారు. గ్లమోకు గురైనవారిలో రెండు లక్షలమందికిపైగా కంటిచూపు పూర్తిగా పోగొట్లుకున్నట్లు తెలుస్తోంది. గ్లకోమాపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో మరింత పెరిగే ప్రమాదం నుండి అరికట్టవచ్చునని వీరు వెల్లడించారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం తద్వారా ఆప్టిక్ నర్వ్ పరీక్షల ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చునని తెలుస్తోంది. ముందస్తు లక్షణాలు లేకపోయినప్పటికీ ఈ వ్యాధి పట్ల ప్రజలను చైతన్యవంతులను చేయడంతో ఆప్టిక్ నర్వ్ డ్యామేజ్‌ను నివారించ వచ్చు. డయాబెటిస్, హైపర్‌టెన్షన్,రక్త సరఫరా సరిగా లేకపోవడం, ముఖ్యంగా కంటివైద్యుని సంప్రదించడంతో ఈ రిస్కునుండి బైటపడవచ్చు. ప్రపంచ ఆరోగ్యసంస్థ గణాంకాల ఆధారంగా, కంటిచూపు తగ్గడానికి ప్రధానకారణం గ్లకోమా ప్రపంచంలో రెండవ అతిపెద్ద కారణం కాగా భారత్‌లో నాలుగవ అతిపెద్ద కారణంగా నమోదైంది. భారత్‌లో సుమారు గ్లకోమా కారణంగా కంటిచూపు పోగొట్లుకున్నవారు సుమారు 18లక్షల మంది ఉన్నట్లు నమోదైంది. గ్లకోమా పెరిగే సంఖ్య 50 ఏళ్లకు పైబడినవారిలో మరింతగా ప్రబలింది.సెండెంటరీ జీవన విధానం, పాశ్చాత్య జీవనశైలితో సరాసరి వయసు కూడా 50ఏళ్లకన్నా మరింత తగ్గిందనే చెప్పవచ్చు. నమోదైన 70శాతం కేసుల్లో 35ఏళ్ల లోపువారే...కంటి నుండి మెదడుకు సమాచారాన్ని పంపే ఆప్టిక్ నెర్వ్ డ్యామేజ్ కారణంగా గ్లకోమా సంభవిస్తుంది.

2020కల్లా క్షయ నిర్మూలన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : 2020 కల్లా క్షయను రాష్ట్రం నుంచి క్షయను తరిమికొట్టేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శనివారం శ్రీకారం చుట్టారు. వ్యాధి నిర్మూలనకు, రోగులకు అత్యుత్తమ చికిత్సకు సంబంధించి వివిధ పథకాలను ప్రారంభించారు. రాష్ట్రంలోని ప్రతి క్షయ వ్యాధిగ్రస్తునికి పోషకాహారం కోసం డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) కింద ఇక నుంచి ప్రతినెలా రూ. 500 అందించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అలాగే మొండివ్యాధిని కూడా నయం చేసే బెడాక్విలైన్ మెడిసన్ పంపిణీ చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. ఇందుకోసం ఒక్కో రోగికి రూ.15 లక్షల వరకు ఖర్చు కానుందని, వ్యాధిగ్రస్తులకు పూర్తిగా నయమయ్యేవరకు వారి ట్రాక్ పరిశీలనకు రాష్ట్రవ్యాప్తంగా 725 మంది ఫీల్డ్ సూపర్‌వైజర్లకు ట్యాబ్‌లు అందించాలని ఆదేశించారు. 'ఎండ్ టీబీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో టీబీ వ్యాధిగ్రస్తుల కోసం 'ట్రీట్మెంట్ సపోర్ట్ సెంటర్' ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించడం, చికిత్స అందేలా చూడటం ఈ సెంటర్ల విధిగా పేర్కొన్నారు. అలాగే 234 సీహెచ్‌సీల్లో టీబీ యూనిట్లు సిద్ధం చేశామని చెప్పారు.రాష్ట్రంలోని మొత్తం 610 సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులలో 'కఫం తనిఖీ కేంద్రాలు' నెలకొల్పుతున్నామని అధికారులు తెలిపారు. క్షయను గుర్తించే అత్యాధునిక వ్యాధి నిర్ధారణ (సీపీ మ్యాట్) కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 65 వేల మంది క్షయ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించి, చికిత్స అందిస్తున్నామని, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందేవారితో కలుపుకుంటే ఈ సంఖ్య లక్ష వరకు వుండొచ్చని అన్నారు. వీరందరిని 'నిక్షయ్' సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో పర్యవేక్షిస్తామని చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందే వారి వివరాలను సైతం తప్పనిసరిగా ప్రభుత్వానికి తెలియ జేసేలా ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సీఎం సూచించారు. క్షయ వ్యాధి నివారణపై ప్రజా చైతన్యానికి రూపొందించిన కరపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, సీఎం కార్యదర్శి గిరిజా శంకర్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ అరుణ కుమారి, రాష్ట్ర క్షయ వ్యాధి నివారణ అధికారి రామారావు పాల్గొన్నారు.

మూడేళ్లలో 230 మంది

రైతుల ఆత్మహత్య

- కౌలు రైతులకు రూ. 2,697 కోట్ల రుణాలు
- ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మంత్రి ప్రత్తిపాటి


విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: గడచిన మూడేళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 230 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. రైతుల ఆత్మహత్యలు పెరగడానికి గల కారణాలు, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలకు సంబంధించి ఈ ప్రశ్న ఉత్పన్నం కాలేదని ఆయన సభాపూర్వకంగా స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా శనివారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో గతంలో ప్రతిపక్ష పార్టీ సభ్యులు లేవనెత్తిన ఈ ప్రశ్నపై ప్రకాశంజిల్లా అద్దంకి ఎమ్మెల్యే జి రవికుమార్, పొన్నూరు ఎమ్మెల్యే డి నరేంద్రకుమార్ వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డిని వివరణ కోరారు. అయితే ఆయన అందుబాటులో లేకపోవడంతో మంత్రి పుల్లారావు సమాధానం చెప్పారు. రాష్ట్రంలో 2015 సంవత్సరంలో 160 రైతులు ఆత్మహత్యలు చేసుకోగా 145 మందికి పరిహారం చెల్లించినట్లు తెలిపారు. అలాగే 2016లో 51 మంది, 2017లో 19 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు సభాపతి దృష్టికి తీసుకొచ్చారు. ఆత్మహత్యలను నివారించేందుకు ఎన్నడూ లేని రీతిలో రికార్డు స్థాయిలో 7.6 లక్షల మంది కౌలు రైతులకు రూ. 2,697 కోట్ల రుణాన్ని మంజూరు చేసినట్లు వివరించారు. అయితే అద్దంకి ఎమ్మెల్యే జి రవికుమార్ మాట్లాడుతూ ప్రకాశంజిల్లాలో సన్న, చిన్నకారు రైతులు సుమారు 1.50 లక్షల మంది ఉంటే వారిలో 25వేల మందికే గుర్తింపులు కార్డులు జారీ అయ్యాయని తెలిపారు. గడచిన మూడేళ్లలో ఒక్క ప్రకాశంజిల్లాలోనే 119 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే అధికారులు 38 మందినే గుర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సరైన విధానంతో ఎన్యుమరేషన్ చేయడంలేదన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తప్పకుండా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీవో 62 ప్రకారం మృతుని కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాల్సి ఉండగా విపరీతమైన జాప్యం జరుగుతోందని మరొక ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కాలవ్యవధిని ప్రకటించి నిర్ణీత సమయంలో రైతులను ఆదుకోవాలన్నారు.

అన్ని జిల్లాల్లోనూ సాంస్కృతిక కేంద్రాలు : మంత్రి భూమా అఖిలప్రియ

అన్ని జిల్లాల్లోనూ సాంస్కృతిక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటకశాఖమంత్రి భూమా అఖిలప్రియ తెలిపారు. ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిస్తూ.. ఈ కేంద్రాల ఏర్పాటుకు ఆయా జిల్లాల్లో భూసేకరణకు చర్యలు చేపట్టామన్నారు. అయితే కొన్ని చోట్ల ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. విజయవాడలో రూ. 10కోట్లతో ఏర్పాటు చేసే సాంస్కృతిక కేంద్రంలో సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించడానికి అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కర్ణాటక సంగీతంతోపాటు వీణ, వయోలిన్, మృదంగం, తబల, డోలు, నాదస్వరం వంటి వాయిద్యాలపై బోధించేందుకు 6 ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల/కళాశాలలున్నాయని మంత్రి తెలిపారు.

ఫార్మా-డి కోర్సులకు పుష్కల అవకాశాలు: మంత్రి గంటా

రాష్ట్రంలో మొత్తం 58 ఫార్మా-డి కళాశాలలున్నాయని, ఈ కోర్సు చేసిన గ్రాడ్యుయేట్లకు పుష్కల అవకాశాలున్నాయని మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఈ కోర్సుకు డిమాండు ఉండేదని, క్రమేపీ తగ్గుతూ వస్తోందన్నారు. వీరి సేవలను ప్రైవేటు వైద్యశాలల్లో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ వాస్తవానికి ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మా-డి కోర్సు చేసిన వారు ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన మందులు లభించని కారణంగా 70 శాతం మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని ఈ కోర్సు చేసిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.



33 కళాశాలలకు తాత్కాలిక ఆమోదం

ఏకీకృత ఉపాధ్యాయ విద్యా కోర్సులను అమలుచేసే క్రమంలో రెండేళ్లలో 33 కళాశాలలకు జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) నంచి తాత్కాలిక ఆమోదం లభించినట్లు మంత్రి గంటా తెలిపారు. అయితే నిబంధనలు సరిగాలేవనే కారణంగా ఏ కళాశాలల్లోనూ కోర్సులు ప్రారంభం కాలేదన్నారు. దీనిపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసిందన్నారు.

98 కరవు మండలాల ప్రకటన : మంత్రి ప్రత్తిపాటి

రాష్ట్రంలో 2017-18 సంవత్సరంలో రబీ కాలంలో ఇన్‌పుట్ సబ్సిడీని విస్తరించేందుకు ప్రభుత్వం 98 మండలాలను కరవు ప్రభావిత మండలాలుగా ప్రకటించినట్లు మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. క్షేత్ర పంటల్లో భాగంగా గడచిన మూడేళ్ల కాలంలో 24.49 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 29.72 లక్షల మంది రైతులకు వర్తింపచేస్తూ రూ. 3,070.41 కోట్ల మొత్తాన్ని విడుదల చేసినట్లు సభకు వివరించారు. ఉద్యానపంటల కోసం 3 జిల్లాల్లో 2,695 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ. 4.80 కోట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనావృష్టి పీడిత మండలాల్లో రైతులను ఆదుకునే విషయమై ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు వ్యవసాయశాఖమంత్రి అందుబాటులో లేకపోవడంతో పుల్లారావు సమాధానమిచ్చారు.

రాష్ట్రంలో వయోవృద్ధుల సంఖ్య 33.75 లక్షలు: మంత్రి పరిటాల

రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 33,75,607 వయోవృద్ధులున్నారని మహిళాభ్యుదయం, శిశుసంక్షేమశాఖమంత్రి పరిటాల సునీత తెలిపారు. రాష్ట్రంలో ఆసరా కార్యక్రమం అమలుపై ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిస్తూ.. ఆసరా కార్యక్రమం కోసం ప్రత్యేకంగా భవనాలను నిర్మించలేదన్నారు. వృద్ధుల సంక్షేమం, వృద్ధాశ్రమాల ఏర్పాటు చేసే ప్రతిపాదనలేవీ ప్రభుత్వం వద్ద లేవని ఆమె స్పష్టం చేశారు.



పరిపాలన భవనాల ఆకృతుల ప్రదర్శన

విశాలాంధ్ర-అమరావతి : నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో నిర్మించనున్న పరిపాలన భవనాల అకృతులను శాసనసభ ఆవరణలో శనివారం పలువురు ప్రముఖులు పరిశీలించారు. నార్మన్ ఫోస్టర్స్ రూపొందించిన ఈ ఆకృతులను మంత్రులు నారా లోకేష్, అమర్‌నాథరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలతో పాటు స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, పురపాలకశాఖ మంత్రి నారాయణ, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పరిపాలన భవంతుల అకృతులను పరిశీలించి నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాదాపు ఈ డిజైన్లే పరిపాలన భవనాలుగా ఖరారు అవుతాయని తెలుస్తోంది.

కేంద్ర వైఖరిపై మండిపడ్డ ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర-అమరావతి : కేంద్ర వైఖరిపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా ప్రాంగణం వద్ద శనివారం మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమాన్ని బీజేపీ తుంగలో తొక్కిందన్నారు.

ఏ 2 నేరస్తుడైన విజయసాయిరెడ్డికి పాస్‌పోర్టు ఇచ్చి ఎక్కడ విదేశాలకు పంపేస్తారేమోనని అనుమానంగా ఉందని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి తరచూ ప్రధానిని కలిస్తే తప్పేంటి అని బీజేపీ నేతలు అంటున్నారు. ఆర్థిక నేరస్థుడు తరచు ప్రధానిని కలిస్తే సీబీఐ , ఈడీలకు స్వేచ్ఛగా ఎలా పనిచేస్తాయి. కేంద్రం తక్షణం రాష్ట్రానికి రావాల్సిన సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. మోడీ హయాంలో జరిగిన కుంభకోణాలపై కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలతో విచారణకు బీజేపీ సిద్ధమా అని ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర ప్రశ్నించారు. పట్టిసీమ గురించి మండలిలో చర్చకు వస్తే సోము వీర్రాజు పారిపోయారు. కేంద్రం నుండి నిధులు రాకుండా చేస్తున్న సోము వీర్రాజు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చెయ్యాలన్నారు.

2022 నాటికి ప్రతి ఇంటికి తాగునీరు

- 22 వేల కోట్లతో వాటర్ కార్పొరేషన్ ఏర్పాటు
- పంచాయితీ రాజ్ శాఖ మంత్రి లోకేష్



విశాలాంధ్ర-అమరావతి : 2022 నాటికి తాగునీటి కొరత లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతానని పంచాయితీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శనివారం గ్రామీణ నీటి సరఫరాపై మండలిలో జరిగిన చర్చలో భాగంగా మంత్రి సమాధానమిస్తూ గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి, పారిశుధ్య సౌకర్యాలు కల్పించడం కోసం రాష్ట్రంలోని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ నోడల్ ఏజెన్సీగా ఏర్పడిందన్నారు. చేతి పంపులతో, బోరు బావులు, సింగిల్ ఫేజ్ మోటార్లు, నేరు పంపింగ్ పథకాలు, ఎండబ్ల్యూఎస్ పథకాలు, సీపీడబ్ల్యూఎస్ పథకాలు మొదలైన వివిధ రకాల పథకాల ద్వారా తాగు నీటి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. సుస్థిర ప్రాతిపదికపై గ్రామంలోని ప్రతి వ్యక్తికి తాగునీరు, వంట ఇతర ప్రాథమిక అవసరాల కోసం తగినంత సురక్షిత నీటిని సమకూర్చడం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.2018 నాటికి, 35 శాతం కనీసం గృహ కనెక్షన్లు, 2022 నాటికి ప్రతి గ్రామీణ వ్యక్తి తమ ఇంటి నుంచి 50 మీటర్లు మించని సమాంతర దూరంలో 70 ఎల్‌పీసీడీలు నీటిని ఇస్తామన్నారు. బోరు బావులకు అమర్చిన చేతి పంపులు 22,2250 , పిడబ్ల్యూఎస్ ఎంపిడబ్ల్యూఎస్ పథకాలు 33,985, సీపీడబ్ల్యూఎస్ పథకాలు 1,554, నీటి పరీక్ష ప్రయోగశాలలు 107 ఉన్నాయన్నారు. 2014-2015లో 3,631 ఎస్‌వీఎస్, ఎంవీఎస్ పథకాల ద్వారా రూ.1,711 కోట్లను ఖర్చు చేస్తూ 6,197 జనావాసాలకు నీటిని అందించామన్నారు. రూ.461,08 కోట్ల వ్యయంతో ఈ సంవత్సరంలో 1,458 జనావాసాలను లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

పనుల కార్యక్రమాల నిమిత్తం 2017-18 సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.627.27 కోట్లను కేటాయించామన్నారు. 509 జనావాసాలకు తాగునీటి సౌకర్యాల కోసం 422 పనులకు నాబార్డ్ నుంచి రూ.125.36 కోట్ల మొత్తాన్ని మంజూరు చేసినట్లు వివరించారు. ఎస్‌డీపీ సీఎం నిధి క్రింద 699 ఐటీడీఏ ప్రాంతాలకు తాగునీటి సౌకర్యాల కోసం రూ.104.99 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేస్తున్నామన్నారు. 278 ఐటీడీఏ ప్రాంతాలు, ఐటీడీఏ యేతర ప్రాంతాలకు తాగునీటి సౌకర్యాల కోసం రూ.44.62 కోట్లు మంజూరు చేసినట్లు లోకేష్ చెప్పారు. శిధిలావస్థలో ఉన్న ట్యాంకుల కోసం 723 పనులకుగాను రూ.28.43 కోట్ల కేటాయించామన్నారు. ఎన్టీఆర్ సుజల పథకం సుమారు రూ.402.40 కోట్ల మొత్తంతో సుమారు 7,787 ప్రాంతాలకు 103 క్లస్టర్లను గుర్తించి టెండర్లను ఆహ్వానించడం జరిగిందన్నారు.

గ్రామీణ ప్రాంతాలలో వేసవి కార్యాచరణ

గ్రామీణ ప్రాంతాలలో వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 3,230 తాగునీటి ప్రాంతాలను గుర్తించి ప్రైవేటు వనరులను అద్దెకు తీసుకోవడం, బోరు బావులు శుద్ధి చేసి ట్యాంకులను నింపడం వంటి చర్యలు వెంటనే చేపట్టడానికి సుమారు రూ.103.02 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నీటి కొరత ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేసే ఆన్ లైన్ ట్రాకింగ్ పర్యవేక్షణ వ్యవస్థ కోసం జీపీఎస్ ఆధారిత మొబైల్ యాప్ ను అమలు చేస్తున్నామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఫిబ్రవరి 1వ తేదీ నుండి 45 రోజుల పాటు 2018 అత్యవసర కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అందులో ప్రతి తాగునీటి వనరుల వ్యవస్థలను తనిఖీ చేసి, పరిశీలించి, చేతి పంపులకు సంబంధించి మరమ్మతు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ సంవత్సరం జనవరి నుండి ఇప్పటి వరకూ జలవాణి కాల్ సెంటర్ కు 2,545 ఫిర్యాదులు వచ్చాయని, ఇప్పటి వరకూ 1,177 ఫిర్యాదులు పరిష్కారం చేశామని, 542 ఫిర్యాదులకు సంబంధించి పనులు ప్రారంభించినట్లు, 498 ఫిర్యాదులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఎన్టీఆర్ సుజల కార్యక్రమంలో భాగంగా ఉద్దానంలో 7 మదర్ ప్లాంట్స్‌కుగాను 6 పూర్తి చేశామని, మిగిలిన ఒక్కటి మార్చి నెలాఖరుకు పూర్తి చేసి 121 నివాస ప్రాంతాలకు తాగునీరు అందిస్తామన్నారు. కనిగిరిలో 3 మదర్ ప్లాంట్స్‌కు 2 పూర్తి అయ్యాయి, జూన్ 2018కు పూర్తి చేసి 86 నివాస ప్రాంతాలకు తాగునీరు ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. కుప్పంలో 15 క్లస్టర్లు గాను 13 పూర్తి చేశాం. మిగిలిన 2 మార్చి నెలాఖరుకు పూర్తి చేసి వీటి ద్వారా 533 నివాస ప్రాంతాలకు తాగునీరు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలలో 402 కోట్లతో 7,787 నివాస ప్రాంతాల్లో 103 ఎన్టీఆర్ సుజల క్లస్టర్ల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేస్తున్నామన్నారు.

ట్యాంకర్లతో సరఫరా

నీటి కొరత ఉన్న ప్రాంతాలను ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్నామన్నారు. 334 ప్రాంతాలలో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. అనంతపురంలో 22, చిత్తూరు 62, నెల్లూరు 4, ప్రకాశం 204, గుంటూరు 17, కడప 13, కర్నూలు 1, కృష్ణాలో 11 చోట్ల నీటిని రవాణా చేస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతపురం జిల్లాలో 9,662 పశువుల కోసం నీటిని అందిస్తున్నామన్నారు.

వాటర్ కార్పొరేషన్ ఏర్పాటు

రాష్ట్రంలో రూ.22,000 కోట్ల తాగునీటి ప్రాజెక్టుకు ప్రతిపాదనలను రూపొందించామని మంత్రి లోకేష్ తెలిపారు. ప్రతి ఇంటికి కొళాయి ని ఇస్తామన్నారు. రూ. 99.32 కోట్ల గనుల శాఖ నుండి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ నీటి సరఫరా సంస్థ నిధులు మరలించారన్నారు. బ్యాంకు రుణాలతో 8 జిల్లాలకు, యాన్యుటీ విధానంలో 7 జిల్లాలకు నీటి కొరతను శాశ్వతంగా దూరం చేస్తానని హామీ ఇస్తున్నట్లు చెప్పారు.



ప్రజల మనిషి గురవయ్య

సంస్మరణ సభలో ముప్పాళ్ల ప్రభృతులు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : నమ్మిన సిద్ధాంతాల కోసం తుదిశ్వాస వరకు పరితపించిన అజాత శత్రువు నరిశేటి గురవయ్య అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు కొనియాడారు. రాష్ట్ర రైతు సంఘ ఉపాధ్యక్షులు, దూళిపాళ్ల ఆంధ్రాబ్యాంకు రైతు సేవా సహకార సంఘం చైర్మన్ గురవయ్య సంస్మరణ సభ శనివారం గుంటూరు జిల్లా సత్తెనపల్లిలోని కాకతీయ కళ్యాణమండపంలో జరిగింది.

సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షత వహిం చారు. ముప్పాళ్ల మాట్లాడుతు కేవలం సీపీఐ కార్యక్రమాలకే గురవయ్య పరిమితి కాలేదన్నారు. ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం, విద్యార్థి కార్మిక, రైతాంగ సమ స్యల పరిష్కారం కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో కేంద్ర బిందువుగా పనిచేశారన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా ముందుకు తీసుకెళ్లిన ఆదర్శ నేతగా గురవయ్య నిలిచారన్నారు. ప్రజల హృదయాల్లో గురవయ్య నిలిచిపోతారన్నారు. బలిజేపల్లి భువనచంద్ర చెక్‌డ్యాం నిర్మాణంలో ఆ ప్రాంత రైతుల ఆశయ సాధనలో గురవయ్య పోషించిన పాత్ర అనిర్వచనీయమన్నారు. పల్నాడు ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక బలమైన నేతగా గురవయ్య నిలిచారని ఎంతటి సమస్యనైనా ఒత్తిడికి లోను కాకుండా పరిష్కరించడంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. పార్టీ నిర్మాణంలో, ప్రజా ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషించారన్నారు. ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతు రైతు ఉద్యమాల నిర్మా ణంలో గురవయ్య నిబద్ధత ఎంతో ఆకట్టు కొంటుందన్నారు. రైతులన్నా, కూలీలన్నా గురవయ్యకు అమితమైన ఇష్టమన్నారు. నూతన రాజధాని ప్రాంతంలో రైతు సంఘం భవన నిర్మాణం చేయాలనే సంకల్పంతో గురవయ్య పనిచేశారని, ఆయన ఆశయ సాధన కోసం రైతు సంఘ భవన నిర్మాణం చేపడతామన్నారు.

రైతులు ఎదుర్కొంటున్న సమస్య లపై గురవయ్యకు ఒక అవగాహన ఉన్నదని, వాటి పరిష్కారం కోసం నిరంతరం పరితపించే వారన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి యర్రం వెంకటేశ్వ రెడ్డి మాట్లాడుతూ, నేటి తరం నాయకులు గురవయ్యలాంటి నాయకులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 4 దశాబ్దాలు ఎలాంటి ఆరోపణలు లేకుండా నమ్మిన సిద్ధాంతం కోసం కుటుంబాన్ని సహితం ఉద్యమంలో నడిపిన నేతగా ప్రజల హృదయాల్లో ఆయన చిరస్థాయిగా నిలిచి పోయారన్నారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ న్యాయవాది పి.సూరిబాబు మాట్లాడుతు తాను నమ్మిన సీపీఐ అధికారం వస్తుందో రాదో తెలియక పోయినా దశాబ్దాలకు పైగా ఒకే పార్టీలో వుండి పనిచేయడం అనితర సాధ్యమన్నారు. మున్సిపల్ చైర్మన్ యెలినేడి రామస్వామి మాట్లాడుతూ వార్డు కౌన్సిలర్‌గా పట్టణ అభివృద్ధిలో గురవయ్య క్రియాశీల పాత్ర పోషించారన్నారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతు ఉపాధ్యాయునిగా వృత్తి ప్రారంభించి బడుగు, బలహీన వర్గాల సమస్యలు పరిష్కరించడం కోసం నిరంతరం పనిచేశారన్నారు. సత్తెనపల్లిలో గురవయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అన్ని వర్గాలు సహకరించాలన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. సభలో ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, యార్డు చైర్మన్లు సయ్యద్ పెద కరీముల్లా, పివి.కోటయ్య, ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షులు సుధీర్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధక్షులు మహాంకాళి సుబ్బారావు, రైతు సంఘ నాయకులు టి.సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ కె.కాశీవిశ్వనాధం, బిజేపీ నాయకులు పి.సాంబశివరావు, టీడీపీ జిల్లా నాయకులు ఎన్.రాజనారాయణ, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు పి.సాంబశివరావు, గని, బి.రామకృష్ణ, ఎస్టీయు రాష్ట్ర మాజీ నాయకులు ఎస్.మృత్యుంజయరావు, రైతు నాయకులు జి.కోటేశ్వరావు, మాజీ జెడ్పీటీసీ ఎం.పున్నారావు, కాంగ్రెస్ నాయకులు చాంద్ భాషా, తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎంబీబీఎస్ ఫైనల్ పార్ట్-2 ఫలితాలు విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఎంబీబీఎస్ ఫైనల్ పార్ట్-2 ఫలితాలను శనివారం డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ విడుదల చేసింది. మొత్తం యూనివర్శిటీ పరిధిలో 24 మందికి డిస్టింక్షన్ రాగా, 8 మందిని విత్‌హెల్డ్‌లో వుంచినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం.వి.భీమేశ్వర్ వెల్లడించారు. పరీక్షా ఫలితాలను యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. రీటోటలింగ్, వ్యక్తిగత తనిఖీ కోరేవారు ఏప్రిల్ 7వ తేదీలోగా యూనివర్శిటీ పేర రూ.2వేల ఫీజు చెల్లించాల్సి వుంటుందని తెలిపారు.

అమిత్ షా లేఖతో నూతనోత్సాహం

బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్

విశాలాంధ్ర -అమరావతి : తెలుగుదేశం పార్టీపై బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర శనివారం మాట్లాడుతూ అమిత్ షా లేఖతో తమకు నూతనోత్సాహం వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు రాష్ట్ర సంక్షేమానికి ఎన్డీయే కట్టుబడి ఉందన్నారు. బిజెపి పై మంత్రి ఘంటా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఎన్డీయే నుండి బయటకు వెళ్లిపోతున్న వైనంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రాసిన లేఖకు సమాధానంగా బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా 9 పేజీలు లేఖ రాశారని తెలిపారు. అన్ని రాష్ట్రాలను అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పట్ల, తెలుగు ప్రజల పట్ల ఎటువంటి వివక్ష చూపలేదని స్పష్టం చేశారు. 2014 నుండి 2018 మధ్య గతంలో కంటే 107 శాతం ఎక్కువ నిధులు ఇచ్చామని చెప్పారు. ఇంత భారీ మొత్తంలో నిధులు ఇస్తున్నా కేంద్రం వివక్ష చూపుతున్నదని అనడం సరికాదన్నారు. రైల్వే జోన్ పై సానుకూల నిర్ణయం తీసుకుంటామని త్వరలోనే అందరికి ఆమోదయోగ్యమైన నిర్ణయం కేంద్రం తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణానికి కావలసిన నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని , ఇప్పటివరకు ఇచ్చిన నిధులలో 8 శాతం మాత్రమే ఖర్చు చేశారని, మరి మిగిలిన నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ నుండి అమరావతి, అమరావతి నుండి అనంతపురం రహదారుల అనుసంధానికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. స్పెషల్ ప్యాకేజీ క్రింద నిధులు ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నా ఎందుకు వినియోగించుకోవడం లేదో రాష్ట్రమే సమాధానం చెప్పాలన్నారు. ఈ ఏపీ నిధులు తీసుకోకపోవడానికి కారణం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అమిత్ షా లేఖ రాష్ట్రానికి చెంప పెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. కేంద్రం పై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. బీజేపీ చేసిన అభివృద్ధి పనులను ప్రజలలోకి తీసుకెళ్తామని చెప్పారు. .

12
విజయవాడ
ఆదివారం
25 మార్చి 2018
విశాలాంధ్ర


క్రీడలు

మను బాకర్‌కు పసిడి



సిడ్నీ: మను బాకర్.. ఈ పేరు ఎక్కడో విన్నట్టు ఉందే అని అనుకుంటున్నారా. ఔను. నిజమే. ఐఎస్ఎస్ఎఫ్ సీనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో రెండు స్వర్ణ పతకాలతో సంచలనాలు సృష్టించిన ఈ 16 ఏళ్ల చిన్నది ఇప్పుడు జూనియర్ ప్రపంచకప్‌లోనూ తన సత్తా చాటుతోంది. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచకప్ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 10మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మను స్వర్ణం సొంతం చేసుకుంది. అలాగే 10మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో మను జట్టు స్వర్ణం సొంతం చేసుకుంది. వ్యక్తిగత విభాగంలో 235.9 పాయింట్లతో మను స్వర్ణం గెలుచుకోగా.. థాయ్‌లాండ్(234.9), చైనా(214.2) క్రీడాకారిణీలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. మరో భారత క్రీడాకారిణి దేవాన్షి రాణా 195.3 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. మను బాకర్, దేవాన్షి రాణా, మహిమా అగర్వాల్ కలిసి 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం కైవసం చేసుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, థాయ్‌లాండ్ నిలిచింది.

బీసీసీఐపై షమి భార్య ఫైర్



న్యూఢిల్లీ: బీసీసీఐపై టీమిండియా పేసర్ మహమ్మద్ షమి భార్య హసీన్ జహాన్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై బీసీసీఐ జరిపిన దర్యాప్తు తీరును తప్పుబట్టారు. బీసీసీఐ దర్యాప్తు బృందం షమీ క్యారెక్టర్‌ను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. అతడి వ్యక్తిగత విషయాలను బీసీసీఐ పక్కనపెట్టేసిందని విమర్శించారు. "అతడు మళ్లీ ఆడతాడు సరే, అతడి క్యారెక్టర్ మాటేమిటి? షమి గుణాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. అతడి వ్యక్తిగత జీవితం గురించి బీసీసీఐ ఏమాత్రం పట్టించుకోలేదు" అని హసీన్ పేర్కొన్నారు. హసీన్ జహాన్ ఆరోపణలపై దర్యాప్తు జరిపిన బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం అధికారులు షమి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడలేదని తేల్చి చెప్పారు. దీంతో బీసీసీఐ షమి కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించింది. అలాగే ఐపీఎల్‌లో ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

టెస్టు చరిత్రలోనే రెండో క్రికెటర్!



కేప్‌టౌన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో దక్షిణాఫ్రికా ఓపెనర్ డీన్ ఎల్గర్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఎల్గర్ (141 నాటౌట్)గా నిలిచిన విషయం తెలిసిందే. దీంతో టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఓపెనర్‌గా వచ్చి అధిక సార్లు నాటౌట్‌గా నిలిచిన రెండో బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందాడు. అంతకు ముందు మూడు సార్లు ఈ ఘనత సాధించిన విండీస్ దిగ్గజం హేన్స్‌తో సమంగా నిలిచాడు. హేన్స్ పాకిస్తాన్‌పై (1986లో 88 నాటౌట్), ఇంగ్లండ్‌పై(1991లో75 నాటౌట్), పాకిస్తాన్‌పై (1993లో143 నాటౌట్) ఈ ఘనతను అందుకున్నాడు. ఎల్గర్ 48 టెస్టుల్లోనే ఈ ఘనతను సాధించడం విశేషమైతే.. ఒకే క్యాలెండర్ సంవత్సరంలో రెండు సార్లు సాధించడం మరో విశేషం. భారత్‌తో జరిగిన గత సిరీస్ చివరి టెస్టులో ఎల్గర్ 86 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇక 2015లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎల్గర్(118 నాటౌట్)గా నిలిచి తొలి సారి ఈ ఘనతను అందుకున్నాడు. దేశాల వారి జాబితాను పరిశీలిస్తే ఆస్ట్రేలియా(14) అత్యధిక సార్లు ఈ ఘనతను సాధించగా భారత్ నాలుగు సార్లు ఈ ఫీట్‌ను అందుకోంది. భారత్ నుంచి సునీల్ గావస్కర్, వీరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్, చతేశ్వర పుజారాలు తలా ఒక సారి ఈ రికార్డు నమోదు చేశారు.



అదొక మానసిక క్షోభ: షమి

డెహ్రాడూన్: తనను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) కాంట్రాక్ట్ నుంచి తప్పించిన క్షణంలో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యానని పేసర్ మహ్మద్ షమి తాజాగా పేర్కొన్నాడు. తాను మ్యాచ్ ఫిక్సింగ్ చేశానంటూ భార్య హసీన్ జహాన్ చేసిన ఆరోపణలు చాలా ఎక్కువగా బాధించాయన్నాడు. మ్యాచ్ ఫిక్సింగ్, ఇతర మహిళలతో సంబంధాలు, హత్యాయత్నానికి పాల్పడ్డాడంటూ షమి భార్య జహాన్ సంచనల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అప్పుడు బీసీసీఐ షమికి కాంట్రాక్టులో స్థానం కల్పించలేదు. అయితే దర్యాప్తు తర్వాత షమి ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడలేదని తేలడంతో బీసీసీఐ 'బి' గ్రేడ్ కాంట్రాక్టులో చోటు కల్పించారు. మ్యాచ్ ఫిక్సింగ్ పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేకపోవడం, బీసీసీఐ కాంట్రాక్టు దక్కడం, ఐపీఎల్‌లో ఆడటంపై షమి తాజాగా సంతోషం వ్యక్తం చేశాడు. 'ఇది పూర్తిగా కుటుంబానికి సంబంధించిన సమస్య. నాకు వ్యతిరేకంగా వచ్చిన వార్తల్లో ఏ మాత్రం నిజం లేదు. గత 10-15 రోజులుగా ఎంతో మానసిక క్షోభకు గురయ్యా. ఈ రోజులన్ని ఎంతో కఠినంగా గడిచాయి. వీలైనంత త్వరగా మిగతా వాటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నా' అని షమి తెలిపాడు.

సాహో విధ్వంసం



- 20 బంతుల్లో శతకం!
- 14 సిక్సులు.. 4 ఫోర్లతో వీరవిహారం
- సన్‌రైజర్స్ తరపున బరిలోకి సాహో

కోల్‌కతా: టీమిండియా టెస్ట్ వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా రెచ్చిపోయాడు. ఐపీఎల్ ఎఫెక్ట్ ఎమో కానీ మైదానంలో చెలరేగాడు. ఏకంగా 14 సిక్సులు, నాలుగు ఫోర్లతో కేవలం 20 బంతుల్లో శతకం బాదాడు. శనివారం కోల్‌కతాలో జరిగిన జేసీ ముఖర్జీ లోకల్ టీ20 టోర్నీలో సాహా 20 బంతుల్లో 102 పరుగులు చేశాడు. ఎదుర్కొన్న 20 బంతుల్లో 18 బంతులను బౌండరీకి తరలించడం విశేషం. వీటితోనే సాహా 100 పరుగులను పూర్తి చేశాడు. ఈ విజృంభణతో సాహా ప్రాతినిధ్యం వహిస్తున్న మోహన్ బగాన్ జట్టు బీఎన్ఆర్ రీక్రియేషన్ క్లబ్‌పై పది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బీఎన్ఆర్ 152 లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ లక్ష్యంతో బరిలోకి దిగిన మోహన్ బగాన్ సాహా, కెప్టెన్ సుబ్ హోమయ్(43 22 బంతుల్లో)లు దాటిగా ఆడటంతో వికెట్ నష్టపోకుండా కేవలం 7 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్ అనంతరం సాహా మాట్లాడుతూ.. 'ఇది రికార్డో కాదో కూడా నాకు తెలియదు. ఐపీఎల్‌ను దృష్టిలో ఉంచుకోని ప్రత్యేకమైన్ షాట్స్ ఆడటానికి ప్రయత్నించా. ప్రతి బంతి నా బ్యాట్ మధ్యలో తగిలిందని భావించి హిట్టింగ్ చేశానని' తెలిపాడు. ఇక వన్డే, టీ20ల్లో అవకాశంపై స్పందిస్తూ.. అది సెలక్టర్ల నిర్ణయమని, అవకాశం వచ్చేలా ఆడటమే నా బాధ్యత అని చెప్పుకొచ్చాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో సాహా సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున బరిలోకి దిగుతున్న విషయం తెలిసిందే. అయితే ఓపెనింగ్ బ్యాటింగ్ చేయడానికే ఇష్టపడుతానన్నా సాహా సన్‌రైజర్స్‌లో ధావన్, వార్నర్‌లు ఉండటంతో ఏ స్థానంలో ఆడటానికైనా సిద్ధమేనన్నాడు.



'ఏ+' గ్రేడ్‌కు ధవన్

న్యూఢిల్లీ: టీం ఇండియా ఓపెనర్ శిఖర్ ధవన్ ప్రస్తుతం అద్భుతమైన ఫాంలో ఉన్నాడు. ఆడిన ప్రతీ మ్యాచ్‌లోనూ ధవన్ గొప్పగా రాణిస్తున్నాడు. ముఖ్యంగా సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌ని భారత్ 5-1 తేడాతో కైవసం చేసుకోవడంలో ధవన్ కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో ధవన్ ప్రతిభను గమనించిన బీసీసీఐ అతన్ని ఏ+ గ్రేడ్‌లో చేర్చి వేతనాన్ని రూ.7 కోట్లకి పెంచింది. దీనిపై ధవన్ స్పందించాడు. "నేను టీం ఇండియా కోసం అద్భుతంగా ఆడుతున్నాను. మూడు ఫార్మాట్‌లలో నా టాలెంట్‌ని మొత్తం జట్టు కోసం ఉపయోగిస్తున్నాను. ఇది చూసి బీసీసీఐ నన్ను సీ గ్రేడ్ నుంచి ఏ+ గ్రేడ్‌కి పెంచింది. కానీ నా వేతనం ఇంత ఎక్కువగా పెరుగుతుందని కలలో కూడా అనుకోలేదు" అని తెలిపాడు. ఇక సౌతాఫ్రికాలో మంచి క్రికెట్ ఆడామని ధవన్ అన్నాడు. "ఏ భారత జట్టు సాధించలేని విజయాలు మేం సాధించాం. సౌతాఫ్రికా సిరీస్‌లో వచ్చిన ఫలితాలు ఎంతో గర్వకారణం" అని పేర్కొన్నాడు. ఐపీఎల్ తర్వాత టీం ఇండియా వెళ్లే ఇంగ్లాండ్ పర్యటన కోసం సిద్ధమవుతున్నట్లు ధవన్ తెలిపాడు. "ఐపీఎల్ బిజీ సీజన్ తర్వాత ఇంగ్లాండ్ పర్యటన, ఆఫ్గానిస్థాన్‌తో టెస్ట్ మ్యాచ్‌లు ఆడనున్నాం. దీని కోసం జట్టు ఎంపిక విషయంలో బీసీసీఐ ఇప్పటికే చర్చలు ప్రారంభించింది" అని అన్నాడు.

చరిత్రాత్మక మ్యాచ్‌కి కోహ్లి దూరం!



బెంగళూరు: టీం ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి త్వరలో భారత జట్టు ఆడనున్న ఓ చరిత్రాత్మక మ్యాచ్‌కి దూరం కానున్నాడు. సౌతాఫ్రికా సిరీస్ తర్వాత భారత్-శ్రీలంక-బంగ్లాదేశ్ మధ్య జరిగిన నిదహాస్ ట్రోఫీ నుంచి విరాట్ విరామం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే వచ్చే నెల నుంచి ప్రారంభంకానున్న ఐపీఎల్‌లో విరాట్ బెంగళూరు జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. కానీ ఆ తర్వాత ఆఫ్గానిస్థాన్‌తో జరిగిన ఒకే ఒక టెస్ట్‌కు మాత్రం విరాట్ దూరం కానున్నాడు. ఆఫ్గానిస్థాన్ క్రికెట్ చరిత్రలో ఇది ఆ జట్టుకు తొలి టెస్ట్ మ్యాచ్. ఈ మ్యాచ్ తర్వాత భారత్ ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఇది దృష్టిలో పెట్టుకొని విరాట్‌కు ఈ టెస్ట్ నుంచి బీసీసీఐ విశ్రాంతి కల్పించింది. ఇంగ్లాండ్ పర్యటనలో భారత్ ఐదు టెస్ట్‌లు, మూడు వన్డేలు, మూడు టీ-20లు ఆడనుంది. అయితే ఈ సిరీస్‌కి ముందు కోహ్లీ సుర్రే తరపున క్రికెట్ ఆడేందుకు ఒప్పందం చేసుకున్నాడు. తన ప్రతిభను మరింత మెరుగు చేసుకునేందుకే కోహ్లీ ఆ జట్టు తరఫున ఆడనున్నట్లు తెలుస్తోంది. ఇంగ్లాండ్‌తో తొలి టెస్ట్ ఆగస్టు ఒకటిన ప్రారంభంకానుంది. దీంతో జూన్ 14న బెంగళూరులో ఆఫ్గానిస్థాన్‌తో జరిగే టెస్ట్ మ్యాచ్‌ని కోహ్లీ మిస్ కానున్నాడు. మరోవైపు చతేశ్వర్ పుజారా యాక్‌షైర్‌తో చేసుకున్న ఒప్పందం పొడిగించుకునేందుకు భావిస్తున్నాడు. దీంతో సుర్రే, యాక్‌షైర్ మధ్య జరిగే మ్యాచుల్లో కోహ్లీ, పూజారా ప్రత్యర్థులుగా తలపడనున్నారు.

'నాకు రైనానే ఆదర్శం'



కోల్‌కతా: తనకు టీమిండియా క్రికెటర్ సురేశ్ రైనా ఆదర్శమంటున్నాడు ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన క్రికెటర్ రింకూ సింగ్. త్వరలో ఆరంభమయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరపున బరిలోకి దిగుతున్న రింకూ సింగ్.. గతంలో రైనా ఇచ్చిన సలహా తనకు ఎంతగానో ఉపయోగపడిందన్నాడు. ఐపీఎల్ అరంగేట్రంలో ఒత్తిడి లేకుండా ఆడమని రైనా ఇచ్చిన సలహానే తన కెరీర్‌ను పటిష్టం చేసుకోవడానికి కారణమైందని ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ తెలిపాడు. 'నాకు రైనానే ఆదర్శం. నేను ఐపీఎల్లోకి ప్రవేశించిన సమయంలో నా రూమ్‌కి వచ్చిన రైనా కొన్ని సలహాలు ఇచ్చాడు. స్వేచ్ఛగా ఆడటానికి యత్నించమన్నాడు. అదే సమయంలో ఒక జత గ్లోవ్స్, బ్యాట్ కూడా రైనా కానుకగా ఇచ్చాడు. ఈ ఏడాది నన్ను కేకేఆర్ రూ. 80 లక్షలు కొనుగోలు చేయడం ఆశ్చర్యమేసింది. నాకు రూ.30 లక్షల నుంచి 35 లక్షల వరకూ దక్కుతుం దని మాత్రమే భావించి. నేను ఊహించిన దాని కంటే రెట్టింపు మొత్తానికి కేకేఆర్ కొనుగోలు చేయడం నిజంగా ఆశ్చర్యపరిచింది' అని రింకూ సింగ్ తెలిపాడు.

ఉత్సాహంగా లెజిస్లేచర్స్ స్పోర్ట్స్ మీట్

- క్రికెట్ విన్నర్ సీఎం ఎలెవన్
- రాణించిన సూర్యనారాయణరాజు, గద్దె రామ్మోహన్
- టెన్నికాయిట్ డబుల్స్‌లో పరిటాల సునీత, పీతల సుజాత
- షాట్‌పుట్‌లో పోతుల సునీత

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని లెజిస్లేచర్స్ స్పోర్ట్స్ మీట్ విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్(ఐజీఎంసీ)స్టేడియంలో శని వారం ప్రారంభమయ్యాయి. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత రాజధానిలో శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు క్రీడా పోటీలు నిర్వహించటం ఇదే తొలిసారి. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ప్రతి సంవత్సరం ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహించేవారు. మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ పోటీలను శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు ప్రారంభించారు. నాలుగేళ్ల తర్వాత క్రీడా పోటీలు నిర్వహిస్తుండటంతో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పురుషులతోపాటు మహిళా ప్రజా ప్రతినిధులు కూడా రెట్టించిన ఉత్సాహంతో క్రీడలో పాల్గొనటం విశేషం. తొలుత సీఎం ఎలెవన్, స్పీకర్ ఎలెవన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌ని స్పీకర్ కోడెల ప్రారంభించారు. క్రికెట్ మ్యాచ్ పూర్తయ్యేంత వరకు స్పీకర్ స్టేడియంలోనే ఉండి మ్యాచ్‌ని తిలకించారు. అనంతపురం ఎమ్మెల్యే వీ ప్రభాకర చౌదరి నేతృత్వంలోని స్పీకర్ ఎలెవన్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌ను ఎంచుకుంది. నిర్ణీత ఆరు ఓవర్లలో స్పీకర జట్టు రెండు వికెట్ల నష్టానికి 42 పరుగులు చేసింది. జట్టులోని పల్లా శ్రీనివాస్ ఎనిమిది బంతులలో రెండు బౌండరీలతో పది పరుగులు చేయగా, గద్దె రామ్మోహన్ ఏడు బంతులలో రెండు బౌండరీలతో ఎనిమిది పరుగులు సాధించారు. అనంతరం 43 పరుగుల లక్ష్యంతో క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నేతృత్వంలోని సీఎం ఎలెవన్ జట్టు 4.5 ఓవర్లలో 43 పరుగులు చేసి గెలుపొందింది జట్టులోని కలిదిండి సూర్యనారాయణరాజు ఐదో ఓవర్ ఐదో బంతిలో బౌండరీని సాధించి జట్టుకు విజయాన్ని అందించారు. మహిళల టెన్నికాయిట్ పోటీలలో పలువురు సభ్యులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. డబుల్స్‌లో మంత్రి పరిటాల సునీత, మాజీ మంత్రి పీతల సుజాత జోడీ ప్రథమస్థానం సాధించగా, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన రెండోస్థానం సాధించారు. సింగిల్స్‌లో ఎమ్మెల్యేలు జీ లక్ష్మీదేవమ్మ, జీ సంధ్యారాణి మొదటి రెండుస్థానాలలో నిలిచారు. షాట్‌పుట్‌లో ఎమ్మెల్సీ పోతుల సునీత (5.98 మీటర్లు), జీ సంధ్యారాణి (5.49 మీటర్లు), మంత్రి పరిటాల సునీత (5.48 మీటర్లు), ఉప్పులేటి కల్పన (5.18 మీటర్లు) వరుసగా మొదటి నాలుగు స్థానాలు సాధించారు.

క్రీడలతో ఒత్తిడికి దూరం : స్పీకర్ కోడెల

లెజిస్లేచర్స్ క్రీడా పోటీలను ప్రారంభించిన స్పీకర్ డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు మాట్లాడుతూ, నిత్యం ప్రజల మధ్య ఉంటూ ఒత్తిడికి గురయ్యే ప్రజా ప్రతినిధులకు క్రీడా పోటీలు ఆటవిడుపుగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలలో భాగస్వామ్యం కావాలనే ఆలోచనతో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలగడంతో పాటు మరింతగా ప్రజాసేవ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. క్రీడలు, యువజన సర్వీసులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే ప్రజా ప్రతినిధులకు కూడా పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు వారాలుగా అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటూ ఒత్తిడిగా ఉన్న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు కాస్త రిలీఫ్ కలిగించే ఉద్దేశంతోనే ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ మంచి క్రీడా స్ఫూర్తితో పాల్గొనటం హర్షణీయమన్నారు. సీనియర్ ఎమ్మెల్యేలుసైతం ఉత్సాహంగా పోటీలకు రావటం తమకు మంచి స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ, నిత్యం రాజకీయాలతో ఒత్తిడిగా ఉండే తమకు ఆటలు కాస్త ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఇక నుంచి ప్రతి సంవత్సరం క్రీడా పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మహిళా సభ్యులు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు చెప్పారు. మున్సిపల్‌శాఖ మంత్రి పీ నారాయణ మాట్లాడుతూ, తొలిసారిగా రాజధాని ప్రాంతంలో క్రీడా పోటీలకు విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి వైస్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ విప్ కూన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు స్పీకర్ డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు, క్రీడాశాఖ మంత్రి కొల్లు రవీంద్ర సభ్యులకు స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు.









కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటీషన్ వేయాలి : జల్లి విల్సన్ డిమాండు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఎస్సీ,ఎస్టీ చట్ట సవరణ తీర్పుపై కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటీషన్ దాఖలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి విల్సన్ డిమాండు చేశారు. సుప్రీం తీర్పును నిరసిస్తూ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో శనివారం విజయవాడ తుమ్మపల్లి కళాక్షేత్రం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ తీవ్ర సామాజిక వివక్షకు గురవుతున్న దళితులకు అండగా నిలవాల్సిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని బలహీనపరిచే విధంగా ఇటీవల సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చిందన్నారు. కేంద్రం వెంటనే స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేయాలన్నారు. సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు మాట్లాడుతూ దళితులపై దాడులు పెరిగిపోతున్న ఈ తరుణంలో సుప్రీంకోర్టు తీర్పు దళితులకు మరింత అభద్రతాభావాన్ని కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జస్టిస్ ఏకే గోయల్, జస్టిస్ యాయూ లలిత్ ఉత్తర్వులు వెనక్కు తీసుకునే విధంగా దళిత సంఘాలు, శ్రేణులు కేంద్రంపై వత్తిడి తీసుకొచ్చే విధంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప, ఉపాధ్యక్షులు కనకరాజు ప్రసాద్, ఎస్ నాగరాజన్, కోశాధికారి తుపాకుల నాగేశ్వరరావు, కార్యదర్శులు బి వెంకట్రావు, కె లక్ష్మణ్, గోక రమేష్, డీసీహెచ్ రాజబాబు, టి గోవిందు, కె మాధవస్వామి, సీహెచ్ కాలయ్య, కృష్ణంరాజు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.